సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
శుక్రవారం, 24.04.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 182
పేజీలు: 12 వెల: రూ. 5

# నాదెండ్లకు తుది వీడ్కోలు



- ఉమ్మడి ఏపీ మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావుకు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- ఘనంగా నివాళులర్పించిన ప్రముఖులు

03

## ఆర్టీసీ సమ్మె ఉధృతం

### పంథా మార్చి కార్మికుల నిరసనలు

### ఉదయం నుంచి అన్ని డిపోల ఎదుట ధర్నాలు


- పోలీసు బందోబస్తు మధ్య ప్రైవేట్ డ్రైవర్లతో బస్సులు నడిపేందుకు ప్రభుత్వం యత్నం
- పలుచోట్ల అడ్డుకున్న కార్మికులు
- పోలీసులతో వాగ్వాదం
- నర్సంపేట లో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం
- తొర్రూర్ లో 21 మందిపై కేసులు
- సమ్మెకు మద్దతు పలికిన బీఆర్ఎస్, బీజేపీ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తమ డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజు ఉధృతరూపం దాల్చింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డీపోల ఎదుట కార్మికులు ధర్నాలు చేపట్టారు. ఉదయం నుంచే డిపోల ఎదుట బైఠాయించి తమ డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. దీంతో పలు జిల్లాలో ఆర్టీసీ కార్మికులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. ఆర్టీసీ కార్మికులకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న జేఏసీ నేతలను సైతం పోలీసులు అడ్డుకుని అరెస్టులు చేశారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్నతో పాటు పలువురు నాయకులను అదుపులోకి తీసుకున్నారు. డిపోల నుంచి బస్సులు బయటకు కదలకుండా కార్మికులు అడ్డుకున్నారు. రెండో రోజు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ వాహనదారులు ప్రయాణికుల వద్ద అధిక చార్జీలతో దోపిడీకి పాల్పడ్డారు.

**నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం**

వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపోలో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న కోలా శంకర్ గౌడ్.. మిగతా 02లో






# కొలువుల పండుగ

## నిరుద్యోగులకు భారీ శుభవార్త

- త్వరలో టీజీపీఎస్సీ నోటిఫికేషన్
- ఆర్థిక శాఖ క్లియరెన్స్
- సీఎంకు ఫైల్.. ఆమోదం రాగానే నోటిఫికేషన్
- 2,500 పోస్టుల భర్తీకి చర్యలు
- ఇక నుంచి నెలకో నోటిఫికేషన్
- కొత్త ఉద్యోగాలకు ఓటీఆర్ అప్‌డేట్ తప్పనిసరి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో ఉద్యోగాల నోటిఫికేషన్లు మొదలుకానున్నాయి. ఈ నేపథ్యంలోనే నిరుద్యోగులకు టీజీపీఎస్సీ భారీ శుభవార్త చెప్పింది. ఇక నుంచి నెలకో నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఒక నోటిఫికేషన్ విడుదల చేయగా, త్వరలోనే 2,500 పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపడుతోంది. మరోవైపు ఓటీఆర్ అప్‌డేట్ చేసుకోవడం తప్పనిసరి అని తేల్చి చెప్పింది. వివిధ రకాల పరీక్షలు క్లాష్ కాకుండా ఉండేందుకు పక్కాగా పరీక్షల షెడ్యూల్‌ను రూపొందించనుంది. తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ( టీజీపీఎస్సీ ) అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇక నుంచి ప్రతీ నెల ఒక నోటిఫికేషన్ విడుదల చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ఆర్థిక శాఖ క్లియరెన్స్ ఇచ్చిన 2,500 ఖాళీలను భర్తీ చేయడానికి చర్యలు చేపట్టింది. టౌన్ ప్లానింగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ), అగ్రికల్చర్, ఏఈ, డిప్యూటీ ఈఓ సహా పలు రకాల ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీ అధికారులు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే కొన్ని పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ రిలీజ్ చేయగా, మిగతా పోస్టుల భర్తీకి ప్లాన్ చేస్తోంది. ఇప్పటి నుంచి నోటిఫికేషన్లను జారీ చేయడంలో ఎలాంటి ఆలస్యం చేయకుండా అభ్యర్థులు ప్రిపేర్ అయ్యేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు కసరత్తు చేపట్టింది. ఆర్థిక శాఖ క్లియరెన్స్ ఇచ్చిన సుమారు 2,500 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు, పరీక్షల షెడ్యూల్ తయారు చేసే పనిలో టీజీపీఎస్సీ అధికారులు నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలోనే చాలా రోజుల తర్వాత తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్--2) పోస్టులను భర్తీ చేసేందుకు ఇటీవల టీజీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. పీసీబీ అసిస్టెంట్ సైంటిస్ట్ పోస్టుల భర్తీకి ఈనెల 27వ తేదీ నుంచి దరఖాస్తులు ప్రారంభం కానున్నాయి. త్వరలోనే అదే విభాగంలోనే మరో 6, 7 రకాల పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చేందుకు కూడా చర్యలు చేపట్టింది. వీటితోపాటు కీలకమైన టౌన్ ప్లానింగ్, మిగతా 02లో

## నాణ్యమైన విద్య.. పౌష్టికాహారం సర్కారు లక్ష్యం



- ముఖ్యమంత్రి ఆశయ సాధన విద్యార్థులు భాగస్వాములు కావాలి
- చదువులో రాణించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి
- రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

03


## మృతదేహంపై బంగారం మాయం



- చికిత్స పొందుతూ రోగి మృతి
- మృతదేహంపై బంగారు ఆభరణాలు మాయం
- ఆసుపత్రి సిబ్బందిపై ఆగ్రహం

09

## డ్రగ్స్ తయారీ కేంద్రంపై నార్కోటిక్స్ దాడి



- రూ.17 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్
- ముగ్గురు నిందితులు అరెస్ట్
- 69.600 కిలోల అల్ప్రజోలామ్ స్వాధీనం

03

## హాలిడేస్

నేటి నుంచి 48 రోజులు వేసవి సెలవులు

02



# పోలింగ్ ప్రశాంతం

### బెంగాల్ లో హింస, తమిళనాడులో భారీ పోలింగ్

భారీ పోలింగ్‌తో బెంగాల్, తమిళనాడులో రాజకీయ సమీకరణాలు మారనున్నాయా?

- తృణమూల్ vs బీజేపీ పోరు, తమిళనాడులో త్రికోణ సమరం
- 80% పైగా ఓటింగ్.. ప్రజల తీర్పుపై పార్టీల దృష్టి
- కీలక నియోజకవర్గాల్లో హోరాహోరీ పోటీ
- ద్రావిడ మోడల్ vs అవినీతి వ్యతిరేక నినాదం
- ఎవరి వ్యూహం విజయం సాధిస్తుంది?

**ముద్ర, డెస్క్:** దేశ రాజకీయాల్లో కీలకంగా భావిస్తున్న పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్ గురువారం ఉత్సాహంగా కొనసాగుతోంది. చాలా కాలంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి దూరంగా ఉన్న ఈ రెండు రాష్ట్రాల్లో ఓటర్లు భారీగా పోలింగ్‌లో పాల్గొంటున్నారు.



**బెంగాల్‌లో భారీ పోలింగ్**

పశ్చిమ బెంగాల్‌లో తొలి దశలో 294 స్థానాల్లో 152 నియోజకవర్గాల్లో పోలింగ్ జరుగుతోంది. మొత్తం 16 జిల్లాల్లోని నందిగ్రామ్, డార్జిలింగ్, సిలిగురి, జల్పైగురి, కూచ్ బేహార్ ప్రాంతాల్లో ఓటింగ్ జరుగుతోంది. సుమారు 3.6 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్రంలో 89.92% పోలింగ్ నమోదైంది. రెండో దశ పోలింగ్ ఏప్రిల్ 29న జరగనుంది. ఇక్కడ తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటీ తీవ్రంగా కొనసాగుతోంది. ఓటర్ల జాబితా సవరణ అంశం రాజకీయ వేడిని పెంచింది.

**తమిళనాడులో త్రికోణ పోరు**

తమిళనాడులో ఈసారి ప్రధానంగా మూడు శక్తుల మధ్య పోటీ నెలకొంది. మిగతా 02లో

## కేసీఆర్ చేతుల్లోనే తెలంగాణ భవిష్యత్తు

### బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ జీవన్ రెడ్డి

09

కేసీఆర్‌ను కలలో తలుచుకొని భయపడుతున్న రేవంత్

కేటీఆర్ నాయకత్వంలో ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు



## కాళేశ్వరంపై ఎవరి వాదన వారిదే

10

విజయం మాదేనంటున్న బీఆర్ఎస్

ముందుంది అసలు పండుగ అంటున్న కాంగ్రెస్

వచ్చే కాలం నుంచి నీళ్లిస్తారా అనే ఆశల్లో రైతులు

## 'ప్రైవేట్' దోపిడీపై వివరణ ఇవ్వండి


స్కూళ్లలో అధిక ధరలకు పుస్తకాల అమ్మకాలపై సీరియస్

అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు జాతీయ మానవ హక్కుల కమిషన్ నోటీసులు

02




ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 24.04.2026
www.mudranews.in | @mudranews



## మైగ్రేన్ నియంత్రణకు..



**క్రమమైన నిద్ర**

ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకోవడం, లేవడం అలవాటు చేసుకోండి. రోజుకు కనీసం 7, 8 గంటలు తప్పనిసరి.

# ఆర్టీసీ సమ్మె ఉధృతం

(మొదటి పేజీ తరువాయి)

ఆర్టీసీ డ్రైవర్ పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోవడం కలకలం రేపింది. రెండు రోజులుగా తోటి కార్మికులతో కలిసి సమ్మెలో పాల్గొన్న ఆ డ్రైవర్ గురువారం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న ఆర్టీసీ కార్మికులను తీవ్ర ఆగ్రహానికి గురి చేస్తోంది. దీంతో తాము నిరసనలు వ్యక్తం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఏ మాత్రం స్పందించడం లేదని, తమ డిమాండ్లపై దిగి రావడం లేదని కార్మికులు మండిపడుతున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయకపోవడం, తమ డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో, రెండు రోజులుగా అందరితో కలిసి ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు చేసిన కోలా శంకర్ గౌడ్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు.

ఈ క్రమంలోనే పెట్రోల్ బాటిల్ తీసుకువచ్చి.. నర్సంపేట బస్టాండ్ ఎదురుగానే.. తన ఒంటిపై పోసుకుని నిప్పు పెట్టుకున్నాడు. అది గమనించిన తోటి ఆర్టీసీ సిబ్బంది.. శంకర్ గౌడ్‌ను.. వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోవడంతో.. శంకర్ గౌడ్ తీవ్ర గాయాల పాలయ్యారు. అతడి పరిస్థితి ఇప్పుడే ఏం చెప్పలేమని ఆస్పత్రి వర్గాలు చెప్పినట్లు తెలుస్తోంది. ఇక శంకర్ గౌడ్‌కు ప్రస్తుతం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి డాక్టర్లు చికిత్స అందిస్తున్నారు. కాగా రెండు రోజులుగా జరుగుతున్న ఈ ఆర్టీసీ సమ్మెలో అక్కడక్కడా చిన్న చిన్న ఉద్రిక్తతలు జరగ్గా ఇప్పుడు ఏకంగా ఓ డ్రైవర్ తన ప్రాణాలు తీసుకునేందుకు కూడా సిద్ధపడటం తీవ్ర దుమారం రేపుతోంది. తాము సమ్మె చేస్తున్న ప్రభుత్వం మాత్రం దిగిరావడం లేదని ఆర్టీసీ కార్మికులు మండిపడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో ఆర్టీసీ సిబ్బంది, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం, ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. పలు ప్రాంతాల్లో పోలీసులు.. ఆర్టీసీ సిబ్బందిని అడ్డుకునే క్రమంలో చూపించిన అత్యుత్సాహానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి

### డ్రైవర్ పరిస్థితి ఆందోళనకరం

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నర్సంపేట డిపో డ్రైవర్ కోలా శంకర్ గౌడ్ ఆరోగ్య పరిస్థితి విషమించింది. ఈ ఘటనలో 70 శాతానికి పైగా కాలిన గాయాలపాలైన శంకర్ గౌడ్‌కు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి మరింత విషమించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం ఆయనను వరంగల్ నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.



**పోలీసుల తీరుపై ఆగ్రహం:**

జనగామ ఆర్టీసీ డీపో దగ్గర ఆర్టీసీ కార్మికుల ధర్నాను పోలీసులు అడ్డుకున్నారు. ధర్నాకు అనుమతి లేదంటూ టెంట్లు తొలగించారు. దీంతో పోలీసుల తీరుపై ఆర్టీసీ కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది.

**ఆందోళన పంథా మారుస్తాం: ఈదురు వెంకన్న**

తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని ఆర్టీసీ కార్మిక జేఏసీ నేతలు హెచ్చరించారు. మా డిమాండ్లపై ప్రభుత్వం సాగుకూలంగా స్పందించాలని జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న అన్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయాల వైపు ఆలోచన చేస్తే తాము ఆందోళన పంథాను మారుస్తామని హెచ్చరించారు. తాజాగా ఓ న్యూస్ చానల్ తో మాట్లాడిన ఆయన నోటీసులు ఇచ్చిన 14 రోజుల తర్వాతే సమ్మెకు దిగామన్నారు. ప్రభుత్వం అర్ధరాత్రి పిలిచినా చర్చలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వం చేసిన అలసత్వంతోనే సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు.

**దుర్మార్గపు సర్కార్ : ఆర్టీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్**

రాష్ట్ర ప్రభుత్వ దుర్మార్గ విధానాల ఫలితంగా అన్ని వర్గాలు రోడ్ల పైకి వస్తున్నాయని కార్పొరేషన్ మాజీ చైర్మన్ జి దేవీప్రసాద్ పేర్కొన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆర్టీసీ కార్మికులు నుంచి సమ్మె ప్రారంభిస్తే వాటిని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతుందని మండిపడ్డారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అయన మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని కేసీఆర్ హయాంలో ఆగస్టు 2023 లో గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారని గుర్తు చేశారు. నాడు ఎన్నికల కోడ్ రావడంతో నిర్ణయం అపాయింటెడ్ డే రాలేదని తెలిపారు. మొత్తం 32 డిమాండ్ల పై ఆర్టీసీ కార్మికులు సమ్మె నోటిస్ ఇస్తే ఆర్టీసీ యాజమాన్యం చర్చలకు పిలువలేదని ఆరోపించారు. ఆర్టీసీ బస్సులకు నైపుణ్యం లేని డ్రైవర్లను తాత్కాలికంగా నియమించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

సమ్మె తొలి రోజు సమ్మెలో తాత్కాలిక డ్రైవర్ నిర్వాహకంతో 38 మంది ప్రయాణికులు గాయ పడ్డారని వివరించారు. తాండూరులో పోలీసులు జారీ చేసిన హెచ్చరిక దుర్మార్గంగా ఉందని, సీఎం జిల్లాలో పోలీసులు ఎమెర్జెన్సీ రోజులను గుర్తుకు తెస్తున్నారని వెల్లడించారు. సమ్మె పై బీజేపీ గోడ మీద పిల్లి వాటాన్ని ప్రదర్శిస్తోందని దుయ్యబట్టారు. ఆర్టీసీ సమ్మె వెనక హరీష్ రావు ఉన్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. హరీష్ రావు ఆర్టీసీ కార్మికులకే కాదు. సమస్యల్లో ఉన్న వారి ఎవరికైనా మద్దతు ఇస్తారని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులకు పీఆర్సీ అమలు చేసింది కేసీఆర్ మాత్రమేనని వెల్లడించారు. కాళేశ్వరం ఘోష్ కమిషన్ నివేదిక పై హై కోర్టు తీర్పు తో ప్రభుత్వానికి కను విప్పు కావాలని సూచించారు. ఘోష్ కమిషన్ రిపోర్ట్ నేపథ్యంలో ఇరిగేషన్ ఇంజినీర్ల పై క్రమశిక్షణ చర్యలకు ఇచ్చిన నోటీసులు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వాన్ని కూల్చే శక్తి ఆర్టీసీ కార్మికులకు ఉంది: తలసాని శ్రీనివాస్ యాదవ్**

ప్రభుత్వాన్ని కూల్చే శక్తి ఆర్టీసీ కార్మికులకు ఉందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీసుకోవాలని ఆనాడు కేసీఆర్ కేబినెట్ నిర్ణయం తీసుకుందని.. కానీ ప్రభుత్వం మారిందని తెలిపారు. రాణిగంజ్ డిపో ముందు కార్మికులతో కలిసి ఆయన ధర్నా చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఆనాడు కేసీఆర్ సకల జనులను ఏకం చేశారని.. అందులో ఆర్టీసీ కార్మికులు ప్రధాన పాత్ర పోషించారని గుర్తుచేశారు. తెలంగాణ సాధనలో ఆర్టీసీ కార్మికుల కృషి మర్చిపోలేనిదని.. ఆ విషయం ప్రభుత్వం గుర్తుపెట్టుకోవాలని సూచించారు. రెండు రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తుంటే.. ప్రజలు అల్లాడిపోతున్నారని తెలిపారు. ప్రతిపక్ష నేతలు వెనకుండి సమ్మె చేయిస్తున్నారని ఓ మంత్రి అంటున్నారని.. అసలు ప్రభుత్వం ఇచ్చిన హామీలు తీరిస్తే సమ్మె ఎందుకు చేస్తారని ప్రశ్నించారు. సమ్మె చేసే ఉద్యోగులను ఆర్టీసీ ఎండీ బెదిరిస్తున్నారని మండిపడ్డారు. అందరం కలిసి సెక్రటేరియట్ ముట్టడికి వెళ్దామని.. ప్రభుత్వం మెడలు వంచి హామీలను సాధిద్దామని మాజీ మంత్రి పిలుపునిచ్చారు. పీఆర్సీ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి గుర్తుచేశారు. ఎలక్ట్రికల్ బస్సులకు ప్రైవేట్ డ్రైవర్లను పెట్టి నడిపిస్తున్నారని.. ఆర్టీసీ బస్సు నడిపిన డ్రైవర్లకు ఎలక్ట్రికల్ బస్సు నడపడం రాదా అని నిలదీశారు. 'మీరు ధైర్యంగా పోరాటం చేయండి. మీ వెనుక కేసీఆర్ ఉన్నారు. మీ వెనుక మా పార్టీ మొత్తం ఉంది' అంటూ ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కేబినెట్ సమావేశం అయిన వెంటనే ఆర్టీసీ జేఏసీని ప్రభుత్వం చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. హామీల విషయంలో పూర్తి స్పష్టత ఇవ్వాలన్నారు. తూతూ మంత్రంగా ఒప్పుకోవద్దని జేఏసీ సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. 29 డిమాండ్లు తీర్చేందుకు సిద్ధంగా ఉన్నామని అంటున్నారని.. మరి ఆ 29 డిమాండ్లు ఏంటో మీడియా సాక్షిగా విడుదల చేయాలని తలసాని డిమాండ్ చేశారు.

**కార్మికుల ఆందోనలలో బీజేపీ శ్రేణులు పాల్గొంటారు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**

ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీజేపీ పూర్తి మద్దతిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు స్పష్టం చేశారు. అన్ని జిల్లాల వ్యాప్తంగా బీజేపీ పార్టీ కార్యకర్తలు వారికి మద్దతుగా ఉంటారని తెలిపారు. గురువారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని.. లేదంటే బీజేపీ తరపున ఆందోళనలో పాల్గొంటామని అన్నారు. ప్రభుత్వం అసలు సమస్యలు పక్కన పెట్టి కేబినెట్ అంటూ కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. పీఆర్సీ మీద అప్పుడు కేసీఆర్ మాట ఇచ్చి తప్పారని గుర్తు చేశారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని విమర్శించారు. కార్మికుల పక్షాన ఉంటానని చెప్పి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట తప్పారన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఇద్దరూ ఇద్దరే అంటూ వ్యాఖ్యానించారు. నేడు ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరపాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు.

## తొర్రూర్ లో 21 మందిపై కేసులు

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డిపో పరిధిలో విధులకు రాని 21 మంది కార్మికులపై కేసు నమోదు చేశారు. సమ్మెలో పాల్గొనేందుకు డిపో వద్దకు వస్తున్న కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయడంపై ఉద్యోగ సంఘాల నేతలు మండిపడ్డారు. తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య బస్సులు నడిపేందుకు డిపో నుంచి బస్టాండ్ వరకు బస్సులు తీసుకురాగా కార్మికులు సమాచారం తెలుసుకొని భారీ సంఖ్యలో చేరుకొని అడ్డుకున్నారు. ఆర్టీసీ బస్సులను అడ్డుకోవడంతో పోలీసులు కార్మికులను బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

మెదక్ ఆర్టీసీ డిపో వద్ద భారీ సంఖ్యలో పోలీసులు చేరుకోవడంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆర్టీసీలో బస్సులు నడిపేందుకు అధికారులు ప్రయత్నం చేశారు. దీంతో కార్మికులు అడ్డు చెప్పగా పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. ఈ క్రమంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది.



# కొలువుల పండుగ

(మొదటి పేజీ తరువాయి)

అగ్రికల్చర్ ఆఫీసర్లు.. పలు శాఖల్లోని అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) పోస్టుల భర్తీకి కూడా కమిషన్ అధికారులు దృష్టి సారించారు. ఇక విద్యా శాఖలోనూ డిప్యూటీ ఈఓలు, డైట్ లెక్చరర్లు, బీఈడీ లెక్చరర్ల పోస్టులతో పాటు ఆర్టీసీ, సివిల్ సప్లై విభాగాల్లోని పలు పోస్టుల భర్తీకి అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. రకరకాల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేయడమే కాకుండా.. పరీక్షలు నిర్వహించడంలోనూ సరికొత్త విధానాన్ని పాటించాలని టీజీపీఎస్సీ నిర్ణయించింది. ఇతర రాష్ట్రస్థాయి ఉద్యోగాలతోపాటు.. యూపీఎస్సీ, ఎస్ఎస్సీ వంటి నేషనల్ లెవల్ పరీక్షల తేదీలను దృష్టిలో పెట్టుకుని.. టీజీపీఎస్సీ పరీక్షల షెడ్యూల్ ను తయారు చేస్తోంది. దీంతో కేంద్ర, రాష్ట్ర ఉద్యోగ పరీక్షలు రాసే నిరుద్యోగులకు.. ఎలాంటి ఇబ్బంది లేకుండా చేయనుంది.

ఇక వన్ టైం రిజిస్ట్రేషన్ (ఓటీఆర్) అప్‌డేట్ చేయాలని ఇప్పటికే టీజీపీఎస్సీ పేర్కొన్నా, చాలామంది నిరుద్యోగులు మాత్రం చేసుకోకపోవడం గమనార్హం. తెలంగాణలో సుమారు 30 లక్షల మంది ఓటీఆర్ కలిగి ఉండగా వారిలో 12 లక్షల మంది మాత్రమే రెగ్యులర్‌గా పలు పరీక్షలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఓటీఆర్ అప్ డేట్ చేసుకోవాలని, అందుకు గడువు 2 సార్లు పెంచినా ఇప్పటికీ కేవలం 6 లక్షల మంది మాత్రమే అప్‌డేట్ చేసుకున్నట్టు టీజీపీఎస్సీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలనే కొత్త ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలంటే అభ్యర్థులు తప్పనిసరిగా ఓటీ ఆర్ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపాయి.

# పోలింగ్ ప్రశాంతం

(మొదటి పేజీ తరువాయి)

డీఎంకే నేతృత్వంలోని కూటమి, ఏఐఏడీఎంకే–బీజేపీ కూటమి, అలాగే నటుడు విజయ్ ప్రభావం కీలకంగా మారింది. డీఎంకే తన ప్రచారాన్ని "ద్రావిడ మోడల్" పాలన, సంక్షేమ పథకాలపై కేంద్రీకరించగా, ప్రత్యర్థి కూటములు "కుటుంబ పాలనకు ముగింపు, అవినీతి రహిత పాలన" అనే నినాదంతో ముందుకు సాగుతున్నాయి.

**కీలక నియోజకవర్గాలు**

ఎడప్పాడి నియోజకవర్గం: మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె పళనిస్వామికి ఇది బలమైన కంచుకోట. ఈసారి ఆయనకు డీఎంకే, టీవీకే అభ్యర్థుల నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది.

కొలత్తూరు నియోజకవర్గం: ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వరుసగా మూడు సార్లు గెలిచిన ఈ నియోజకవర్గంలో ఈసారి కూడా హైటెన్షన్ పోటీ నెలకొంది. మొత్తం 2 లక్షలకు పైగా ఓటర్లు ఉన్న ఈ నియోజకవర్గం రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారింది.

**ఓటింగ్ శాతం**

పశ్చిమ బెంగాల్: 89.92% (సాయంత్రం 5 గంటల వరకు)

తమిళనాడు: 82.24%

మొత్తంగా ఈ రెండు రాష్ట్రాల్లో భారీ పోలింగ్ నమోదవుతుండటం, రాజకీయ పార్టీల భవిష్యత్తును నిర్ణయించే కీలక పరిణామంగా భావిస్తున్నారు.

# హాలిడేస్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలో 2025–26 విద్యా సంవత్సరం ముగిసింది. శుక్రవారం నుంచి వేసవి సెలవులు ప్రకటించారు. వేసవి తీవ్రత పెరుగుతున్న వేళ విద్యార్థులకు ఉపశమనం కలిగిస్తూ విద్యాశాఖ వేసవి సెలవుల షెడ్యూల్‌ను అమలులోకి తీసుకొచ్చింది. ఏప్రిల్ 23ను ఈ విద్యా సంవత్సరానికి చివరి పని దినంగా నిర్ణయించడంతో పాఠశాలలు రేపటి నుంచి మూతపడనున్నాయి. ప్రభుత్వం ప్రకటన ప్రకారం వేసవి సెలవులు ఏప్రిల్ 24 నుంచి ప్రారంభమై జూన్ 11 వరకు కొనసాగుతాయి. అంటే విద్యార్థులకు సుమారు 48 రోజుల పాటు సుదీర్ఘ విరామం లభించనుంది. తిరిగి జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభమవుతాయి. పాఠశాలల్లో చివరి రోజు విద్యార్థులకు వారి విద్యా సామర్థ్యాన్ని వివరించే ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను అందించనున్నారు. ఈ సెలవులు కేవలం ప్రభుత్వ పాఠశాలలకే మాత్రమే కాకుండా అన్ని ప్రైవేటు, ఎయిడెడ్, కార్పొరేట్ విద్యాసంస్థలకు వర్తిస్తుంది. నిబంధనల ప్రకారం అన్ని రకాల బళ్లు రేపటి నుంచి మూతపడాల్సిందే. సెలవుల పేరుతో విద్యార్థులను పాఠశాలలకు పిలిపించి స్పెషల్ క్లాసులు నిర్వహించడం చట్టవిరుద్ధం. ఏ పాఠశాల అయినా ఈ రూల్ అతిక్రమిస్తే ఆ సంస్థ గుర్తింపు రద్దు చేయడంతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# తొందరపాటు నిర్ణయాలొద్దు

## ఆర్టీసీ కార్మికులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి

- కార్మికుల డిమాండ్లు, సమస్యల పరిష్కారంపై కేబినెట్ లో కీలకంగా చర్చించాం
- నేడు ఐదుగురు మంత్రులు కార్మిక సంఘాలతో చర్చిస్తారు
- ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్టీసీ కార్మికుల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉంది
- మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో 50 శాతం రిటైర్డ్ ఉద్యోగులకు ఇస్తాం
- రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ రూ.6 వేల కోట్ల చెల్లింపుపై త్వరలోనే నిర్ణయం
- కాళేశ్వరం అవినీతిపై ఎన్డిఎస్ఏ విజిలెన్స్ రిపోర్ట్, కాగ్ రిపోర్టులు ఆధారంగా సీబీఐ విచారణ
- త్వరలోనే సహకార సంఘాల ఎన్నికల తేదీలు ప్రకటిస్తాం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

సమ్మెబాట పట్టిన ఆర్టీసీ కార్మికులు క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. తెలంగాణ కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత నిర్వహించిన మీడియా సమావేశంలో.. కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. కేబినెట్ లో కార్మికుల డిమాండ్లు, సమస్యల పరిష్కారంపై కీలకంగా చర్చించామని, నేడు ఐదుగురు మంత్రులు కార్మిక సంఘాలతో చర్చిస్తారని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెపై తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో కీలకంగా చర్చ జరిగిందన్న మంత్రి.. సమస్య పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్టీసీ కార్మికుల విషయంలో ప్రభుత్వం పాజిటివ్ గానే ఉందన్నారు. నర్సంపేట, నల్గొండలో ఆర్టీసీ కార్మికుల ఆత్మహత్యాయత్న ఘటనలపై కేబినెట్ తీవ్ర దిగ్భ్రాంతి చెందిందన్నారు. కార్మికులు ఎవరూ క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. అలాగే మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో 50 శాతం రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాలని నిర్ణయించామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ లో సుమారు రూ.6 వేల కోట్ల బకాయిలున్నాయని, నెక్స్ట్ కేబినెట్ సమావేశమయ్యే నాటికి వారికి ఇవి ఎలా ఇవ్వాలన్న దానిపై క్లారిటీ ఇస్తామన్నారు. కాళేశ్వరంపై మాట్లాడుతూ.. ప్రాజెక్టుపై హైకోర్టు తీర్పు కాపీ కేబినెట్ కు అందిందని తెలిపారు. హైకోర్టు తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందని బీఆర్ఎస్ నేతలు సంబరాలు చేసుకున్నారని, ఏదో సాధించామని హడావుడి చేశారన్నారు. ఘోష్ కమిషన్ విచారణ రాజ్యాంగ విరుద్ధమైందని కోర్టు చెప్పిందని గుర్తు చేశారు. కాళేశ్వరంలో లోపాలకు కేసీఆర్, హరీష్ రావు కారణం కాదని కోర్టు చెప్పలేదన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రాజెక్టు ప్రొసిజర్ టెక్నికల్ విషయాన్ని మినహాయిస్తే.. మిగతా విషయాలను కోర్టు తప్పు పట్టలేదన్నారు. ఎన్డిఎస్ఏ విజిలెన్స్ రిపోర్ట్, కాగ్ రిపోర్టులు ఆధారంగా సీబీఐ విచారణ చేయాలని లేఖ రాశామన్నారు. ఈ లేఖ రాసి 9 నెలలు అయినా చర్యలు లేవన్నారు. దీనిపై ఢిల్లీకి వెళ్లి సీబీఐని కలుస్తామన్నారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణకు ఒత్తిడి చేయాలని కేబినెట్ నిర్ణయించామన్నారు. దీనిపై ఎలా ముందుకు వెళ్లాలో సబ్ కమిటీ వేశామన్నారు. సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కూడా కేబినెట్ నిర్ణయించిందని, త్వరలోనే ఎన్నికల తేదీలు వెల్లడిస్తామని తెలిపారు.




# 'ప్రైవేట్' దోపిడిపై వివరణ ఇవ్వండి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలకు విరుద్ధంగా, ప్రైవేట్ పబ్లిషర్స్ పుస్తకాలను అధిక ధరలకు కొనాలని తల్లిదండ్రులపై ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు చేస్తోన్న ఒత్తిడిపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయింది. దీనిపై సమగ్ర వివరణ ఇవ్వాలని గురువారం అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంపై తల్లిదండ్రుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు పోటెత్తాయి. ప్రైవేటు పాఠశాలల ఏకపక్ష నిర్ణయాలు, తల్లిదండ్రులపై మోపుతున్న ఆర్థిక భారంపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదుల వెల్లువ పెరిగింది. దీనిని సుమోటోగా స్వీకరించిన కమిషన్, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. ప్రైవేట్ పాఠశాలలు కేవలం తమకు కమీషన్లు వచ్చే పబ్లికేషన్లనే విద్యార్థులు కొనాలని బలవంతం చేయడంపై వివరణ కోరింది. జాతీయ స్కూల్ బ్యాగ్ విధానం ప్రకారం.. విద్యార్థులపై పుస్తకాల భారం తగ్గించాలని, అనవసరమైన ప్రైవేట్ పబ్లికేషన్స్ పుస్తకాలను రుద్దకూడదని నిబంధనలు ఉన్నాయి. ఈ నిబంధనలను చాలా పాఠశాలలు తుంగలో తొక్కుతున్నాయని కమిషన్ అభిప్రాయపడింది. ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్యపుస్తకాలనే అమలు చేయాలని ఆదేశించింది. స్కూల్ బ్యాగ్ బరువు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది.

ప్రైవేటు పాఠశాలల తీరుపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, తీసుకున్న చర్యలపై నివేదిక అందించాలని రాష్ట్ర ప్రభుత్వాల విద్యాశాఖ కార్యదర్శులను కమిషన్ ఆదేశించింది. విద్యా హక్కు చట్టం, మానవ హక్కుల ఉల్లంఘన జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని గుర్తు చేసింది. తల్లిదండ్రుల జేబులకు చిల్లు పెడుతున్న ఈ బుక్స్ మాఫియాపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందోననే చర్చ జరుగుతోంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
24.04.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**మైగ్రేన్ నియంత్రణకు... ఖాళీ కడుపుతో ఉండొద్దు**

సమయానికి భోజనం చేయకపోతే మైగ్రేన్ ట్రిగర్ అవుతుంది. చిన్న చిన్నగానైనా ఆహారం తీసుకుంటూ ఉండండి.



# నాదెండ్లకు తుది వీడ్కోలు

- **అధికారిక లాంఛనాలతో తెలంగాణ ప్రభుత్వం అంత్యక్రియలు**
- **నివాళులర్పించిన ప్రముఖులు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు అంత్యక్రియలకు అన్ని రంగాల ప్రముఖులతో పాటు అభిమానులు పోటెత్తారు. ఆయన కడసారి నివాళులర్పించేందుకు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. గురువారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని నివాసంలో భాస్కర రావు పార్థివ దేహాన్ని సందర్శించి పుష్పాంజలి ఘటించారు. సన్నిహితులు, కుటుంబ సభ్యులు, బంధువులను పలకరిస్తూ వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కష్టకాలంలో భగవంతుడు కొండంత ధైర్యం ఇవ్వాలని ఓదార్చారు. భాస్కర రావు కుమారుడు ఏపీ పౌరసరఫరాలు, ఆహార వినియోగదారుల వ్యవహారాల మంత్రి నాదెండ్ల మనోహర్ ను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీలకు అతీతంగా భాస్కర రావుకు తుది వీడ్కోలు పలికేందుకు తెలుగు రాష్ట్రాల ప్రముఖులు హాజరయ్యారు.

**అన్ని రంగాల ప్రముఖులు రాక**

నాదెండ్ల భాస్కర్ రావు మృతి వార్త తెలుసుకొని బుధవారం సాయంత్రం నుంచి ఆయన పార్థివ దేహాన్ని సందర్శించేందుకు ప్రముఖులు తరలి వస్తూనే ఉన్నారు. గురువారం ఉదయం అగ్ర కథానాయకులు చిరంజీవి భాస్కరరావు కు పుష్పాంజలి ఘటించారు. మనోహర్ ను పలకరించి ధైర్యం చెప్పారు. సినీ పరిశ్రమ నుంచి ల అల్లు అరవింద్, బన్నీ వాసు, పీపుల్స్ మీడియా అధినేత విశ్వ ప్రసాద్, ఘట్టమేనని ఆది శేషగిరిరావు ఉన్నారు. రాజకీయ రంగం నుంచి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, తెలంగాణ రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వివేక్, శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, ఏపీ మంత్రులు కందుల దుర్గేష్, కొలుసు పార్థసారధి, సవిత, కొండపల్లి శ్రీనివాస్, ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్ర రావు, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్, రాజ్యసభ మాజీ సభ్యుడు కె .కేశవ రావు, టి.సుబ్బరామి రెడ్డి, కేవీపీ రామచంద్రరావు, ఏపీ ఎమ్మెల్యేలు బుద్ధ ప్రసాద్, సుజనా చౌదరి,పత్సమట్ల ధర్మరాజు, పంతం నానాజీ, అరవ శ్రీధర్, పత్తిపాటి పుల్లారావు, బొమ్మిడి నాయకర్, వంశీకృష్ణ శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, హరిప్రసాద్ ఎం ఎల్ సి, లోక్ సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, ఆంధ్రప్రదేశ్లోని వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు**

నాదెండ్ల భాస్కరరావుకి తెలంగాణ ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో ప్రత్యేక ప్లాటున్ బృందం ఆయన నివాసానికి చేరుకుని గౌరవం వందనం అందించారు. అక్కడి నుంచి అంతిమ యాత్ర పంజాగుట్ట హిందూ శ్మశాన వాటికకు చేరుకుంది. నాదెండ్ల భాస్కరరావు గారి పెద్ద కుమారుడు నాదెండ్ల మురళి సంప్రదాయబద్ధంగా అంతిమ క్రతువులు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున పోలీసులు మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. చివరి మజిలిలో కుటుంబ సభ్యులు, అభిమానుల ఆయనకు తుది కన్నీటి వీడ్కోలు పలికారు.



# నాణ్యమైన విద్య.. పౌష్టికాహారం

- **ప్రభుత్వ ఆశయ సాధనలో భాగస్వామ్యం కావాలి**
- **విద్యార్థులు చదువులో రాణించి లక్ష్యాలు సాధించాలి**
- **రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి**

**ముద్ర, జగిత్యాల:**

రాష్ట్రంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం తోపాటు పౌష్టిక ఆహారం ఇవ్వాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన సంక్షేమ వారోత్సవాల్లో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మ గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మంత్రి అల్పాహారం చేశారు. రాష్ట్రంలో ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయ సాధనలో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంత్రి ఈ సందర్భంగా విద్యార్థులను కోరారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నిజం చేస్తూ ప్రభుత్వ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని చదువులో రాణించాలని మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనబట్ల దినేష్, ఆర్డీవో మధుసూదన్, డీసీసీ అధ్యక్షులు నందయ్య, కౌన్సిలర్లు దుమాల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ భద్రతపై ఆందోళన, అపోహలొద్దు

- **ఆర్టీసీ కార్మికులకు మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు విజ్ఞప్తి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఆర్టీసీ కార్మికులు తమ ఉద్యోగ భద్రతపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని రాష్ట్ర రవాణాశాఖ, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు సూచించారు. ఒక్క ఉద్యోగిని కూడా ప్రభుత్వం తొలగించదని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, సంస్థ పరిరక్షణ ప్రకారమే తాము పనిచేస్తున్నామని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గ సమావేశంలో తెలిపారని వెల్లడించారు. గురువారం సచివాలయంలో కేబినెట్ సమావేశం తర్వాత వారు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులకు కీలక విజ్ఞప్తి చేశారు. కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సంబంధించి పూర్తిగా సానుకూలంగా ఉన్నామని వివరించారు. కేబినెట్ లో మంత్రులంతా కార్మికులకు అనుకూలంగా చర్చించారన్నారు. కార్మికుల సమస్యలు, ధర్నాపై కేబినెట్ లో కీలకంగా చర్చించామని తెలిపారు. కార్మికులు సంయమనంతో ఉండాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తప్పకుండా చర్చలు చేపడుతుందన్నారు. అంతవరకూ ఎలాంటి తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని, ఎవ్వరూ ప్రాణాలు తీసుకోవద్దని కోరారు. ఇలాంటి ఆలోచనలు చేయవద్దన్నారు. కష్టపడి రాష్ట్రాన్ని సాధించుకున్నది ఇలా ఆత్మహత్యలు చేసుకునేందుకు కాదన్న విషయం గుర్తుంచుకోవాలని, క్షణికావేశంతో కుటుంబాలకు అన్యాయం చేయవద్దన్నారు. ప్రజాపాలన ప్రభుత్వంపై నమ్మకం ఉంచాలని కోరారు.

# యాక్సిడెంట్స్ ఫ్రీ మార్గంగా ఎల్బీనగర్ - హయత్ నగర్

- **డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ తో లక్షల మందికి ఉపశమనం**
- **త్వరలో సాంక్షన్స్ చేసుకొని, టెండర్లు పిలిచేలా అధికారులు ఏర్పాట్లు చేయాలి**
- **వచ్చే వారం కేంద్రమంత్రి నితిన్ గడ్కరీనీ కలుస్తా**
- **ఉన్నత స్థాయి సమీక్షలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

నిత్యం యాక్సిడెంట్స్ జరిగే ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ మార్గంలో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్నామని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. రూ. 941 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్ట్ లో రాష్ట్ర వాటాగా రూ. 200కోట్లు ఇచ్చేందుకు సీఎం ఇప్పటికే సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. ఇది నాగపూర్ తర్వాత ఇండియాలో చేపట్టే రెండో పెద్ద ప్రాజెక్ట్ అన్నారు.ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఎల్బీనగర్,హయత్ నగర్ ప్రాంతాల్లోని 54 కాలనీల్లో నివసించే సుమారు 20లక్షల మంది ప్రజలకు పెద్ద ఉపశమనం లభిస్తుందని,హైదరాబాద్ విజయవాడ దారిలో రాకపోకలు సాగించే లక్షల మంది 15నిమిషాల్లోపే సిటీ క్రాస్ చేస్తారని అన్నారు. ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ ఆల్ ఇండియా రేడియో స్టేషన్ వరకు నిర్మించతలపెట్టిన 7.1 కి.మీ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పురోగతిపై మంత్రి



కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గురువారం రాష్ట్ర సెక్రటేరియట్ లో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. జాతీయ రహదారి 65 రూట్ లో ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు విపరీతమైన రద్దీ ఏర్పడి ,రోడ్ క్రాస్ చేసేటప్పుడు నిత్యం యాక్సిడెంట్స్ జరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే సమీప కాలనీల్లో నివసించే ప్రజలు కింద సర్వీస్ రోడ్డు ద్వారా సులువుగా రోడ్డు దాటవచ్చన్నారు. ,ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తొలగిపోతాయని చెప్పారు. దీనికి వీలైనంత త్వరగా సాంక్షన్స్ చేసుకొని,టెండర్ ప్రక్రియ పూర్తి చేసేలా కృషి చేయాలని కేంద్ర రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ అధికారులకు సూచించారు. డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు కేంద్ర రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ వార్షిక ప్రణాళికలో ఇప్పటికే పొందుపర్చామని ఆర్ .ఓ కృష్ణ ప్రసాద్ తెలిపారు. కింద సర్వీస్ రోడ్డు, మధ్యలో జాతీయ రహదారి,పైన మెట్రో రైలు నిర్మాణం నేపథ్యంలో సాంకేతికంగా పిల్లర్ ఫౌండేషన్,స్ట్రక్చర్స్, మెట్రో స్టేషన్స్ వంటి అంశాలపై మంత్రి చర్చించారు. పూర్తి నాణ్యతతో బలమైన పిల్లర్లు, రెగ్యులర్ ఎలివేటెడ్ కారిడార్ కంటే పటిష్టంగా ,వెడల్పుగా డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్లు నిర్మించాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఒకే వర్క్ ఏజెన్సీ నిర్మాణ పనులు చేపడితే సమన్వయలోపం లాంటి ఇబ్బంది లేకుండా.. త్వరగా పూర్తి చేసేందుకు వీలుగా ఉంటుందనే అభిప్రాయం మంత్రి వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు మానిటరింగ్ చేయడానికి వీలుగా ఉంటుందనీ,పనులు కూడా సమాంతరంగా జరుగుతాయని మంత్రితో అధికారులు తమ అభిప్రాయాలను చెప్పారు. మంత్రి సూచన మేరకు అందుకు అనుగుణంగా హెచ్ ఎం ఆర్ ఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్ ప్రాజెక్ట్ కన్సెంట్ ఇచ్చేందుకు అంగీకరించారు. కన్సల్టెన్సీని పిలిచి డీటెయిల్డ్ ఎస్టిమేట్స్ తయారు చేయాలని నిర్ణయించారు.అధికారులు తమ స్థాయిలో ఉన్న పనులు త్వరగా పూర్తి చేస్తే.. వచ్చే వారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పనులు వెంటనే ప్రారంభించేలా విజ్ఞప్తి చేస్తానని చెప్పారు. సుదీర్ఘంగా సుమారు 4గంటల పాటు జరిగిన ఈ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు,ఆర్ అండ్ బి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, కేంద్ర రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ (మోర్త్ రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ ఎం ఆర్ఎల్) చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద మోహన్,ఆర్ అండ్ బి సి.ఈ ధర్మారెడ్డి పాల్గొన్నారు



## చార్మినార్ చెంత ఆదివాసీల సందడి

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

చారిత్రక చార్మినార్ ప్రాంగణం ఆదివాసీల రాకతో కోలాహలంగా మారింది. గురువారం ఉదయం ఆదివాసీ బృందం భాగ్యనగరానికి చిహ్నమైన ఈ కట్టడాన్ని సందర్శించింది. వారికి పర్యాటక శాఖ అధికారులు మంగళ వాయిద్యాల నడుమ సాదరంగా ఆహ్వానం పలికారు. సన్నాయి మేళాలు, డోలు దరువులతో మార్మోగుతున్న పరిసరాల మధ్య వారికి తిలకం దిద్ది, సాంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. మొదటిసారిగా చార్మినార్‌ను సందర్శించిన ఆదివాసీలు దాని నిర్మాణ శైలిని చూసి అబ్బురపడ్డారు. ప్రాచీన కాలం నాటి శిల్పకళా వైభవం తమను ఎంతగానో ఆకట్టుకుందని పలువురు పేర్కొన్నారు. విదేశీ పర్యాటకులతో కలిసి చిరునవ్వులు చిందిస్తూ ఆ అనుభూతిని జ్ఞాపకాలుగా నిలుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీలు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. నగరానికి వస్తే చార్మినార్ చూడాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నామన్నారు.ఇక్కడి స్వాగతం, ఆ మర్యాదలు మాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చాయి అని హర్షం వ్యక్తం చేశారు. చార్మినార్ విశిష్టతను, దాని వెనుక ఉన్న చారిత్రక నేపథ్యాన్ని పర్యాటక శాఖ అధికారులు వారికి వివరంగా వివరించారు. కొందరు ఆ అద్భుత దృశ్యాలను తమ కెమెరాల్లో బంధించారు. నగర పర్యటనలో భాగంగా తమకు లభించిన ఈ గౌరవం, ఆత్మీయత మర్చిపోలేమని ఆదివాసీ బృందం సంబర పడింది.

# డ్రగ్స్ తయారీ కేంద్రంపై దాడి

- **రూ.17 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్**
- **ముగ్గురు నిందితులు అరెస్ట్**
- **69.600 కిలోల అల్ప్రజోలామ్ స్వాధీనం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

హైదరాబాద్ మౌలాలిలో డ్రగ్ తయారీ కేంద్రం పైనార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో భారీ ఆపరేషన్ నిర్వహించింది. రూ.17 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్ చేయడంతో పాటు ముగ్గురు నిందితులను గురువారం అరెస్ట్ చేసింది. 69.600 కిలోల అల్ప్రజోలామ్‌ను స్వాధీనం చేసుకుంది. ఎఫెడ్రిన్ డ్రగ్ తయారీ ముడి పదార్థాలను కూడా స్వాధీనం చేసుకుంది. ఈ సోదాల్లో రెండు ప్లాస్టిక్ డ్రమ్ములలో భారీగా డ్రగ్ మెటీరియల్ నిల్వ చేసినట్లు అధికారులు గుర్తించారు. రెండు డ్రమ్ముల నుండి మొత్తం 69.600 కిలోల ఆల్ప్రజోలామ్‌ను గుర్తించారు. ఆల్ప్రజోలామ్‌తో పాటు, ఆల్ప్రజోలామ్ తయారీకి ఉపయోగించే ముడి పదార్థాలు, ఎఫెడ్రిన్ కోసం వాడే రసాయనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఒక కెమిస్ట్, మెటీరియల్ సప్లై చేసే వ్యక్తి, మెటీరియల్ తరలించే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఈ ఆల్ప్రజోలామ్‌ను వేసవిలో అధిక డిమాండ్ ఉండే తెలంగాణలోని కల్లు దుకాణాలకు విక్రయించనున్నట్లు గుర్తించారు. ఈ ముగ్గురి నిందితులపై ఎన్డిపిఎస్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా అల్ప్రజోలామ్ వంటి మత్తు బిళ్ళలను కల్లులో కలపడం తీవ్రమైన నేరం. కల్లులో నిషా పెంచడానికి కొందరు అక్రమంగా ఈ బిళ్ళలను కలుపుతుంటారు. ఇలా కల్లును కల్తీ చేయడం ద్వారా అనేక రోగాలు వచ్చే అవకాశం ఉంది. వాస్తవానికి.. అల్ప్రజోలామ్ ఒక సెడెటివ్ డ్రగ్ (నిద్ర కోసం వాడే మందు). దీనిని ఆల్కహాల్‌తో కలిపి తీసుకున్నప్పుడు మెదడు, శ్వాస వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ కలయిక వల్ల శ్వాస ఆగిపోవడం లేదా గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. మోతాదు ఎక్కువైతే మనిషి కోమాలోకి

# రేవంత్ వల్లే కేసీఆర్ కు ఊరట

- **కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

కాళేశ్వరం అవినీతి కేసులో మాజీ సీఎం కేసీఆర్‌కు ఊరట కలిగించింది హైకోర్టు కాదని.. రేవంత్ రెడ్డి ప్రభుత్వమని కేంద్రబొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్ కుటుంబంపై అనేక ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చి రెండేళ్లైనా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకునే దమ్ములేకే తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గురువారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. రెండేళ్ల తర్వాత కేసీఆర్ మళ్లీ మోటార్లకు మీటర్లు అంటున్నారని సెటైర్ విసిరారు. పదేళ్ల నుంచి అదే పాట పడుతున్న కేసీఆర్ ఒక్కరోజూ దాన్ని నిరూపించలేకపోయారని విమర్శించారు. మైక్ దొరికితే ఆయనంత మేధావి ఎవరూ లేరని కేసీఆర్ అనుకుంటారన్నారు. ఆర్టీసీ కార్మికు



లకు రాహుల్ గాంధీ , రేవంత్ రెడ్డి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఒక్క జీవోతో వాళ్ల సమస్యలు పరిష్కారం అయ్యేవని.. కానీ ఆర్టీసీ కార్మికులను రేవంత్ రెడ్డి ఇబ్బంది పెడుతున్నారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బూరుగుపల్లిలో విషాదం

- **పిడుగు పడి రైతు మృతి**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ధాన్యం ఆరబోసిన చోటే అన్నదాతను పిడుగు రూపంలో మృత్యువు కబళించింది. మెదక్ జిల్లా హవేలీ ఘన్ పూర్ మండలం బూరుగుపల్లిలో విషాదం అలుముకుంది. గురువారం సాయంత్రం గ్రామానికి చెందిన రైతు చింతల శ్రీను (36) పిడుగు పడి మృతి చెందారు. బూరుగుపల్లివాడి రహదారిపై ఉన్న పెట్రోల్ బంక్ స్థలంలో ధాన్యం ఆరబెడుతున్న సమయంలో ఆకాశం మేఘావృతమై, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుండగా పిడుగు పడింది. ఈ ఘటనలో రైతు శ్రీను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుడికి భార్య,



ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని గ్రామ సర్పంచ్ సాయిలు డిమాండ్ చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
24.04.2026 శుక్రవారం, హైదరాబాద్



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ 'ముద్ర' వేయండి


మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com



## నారీ శక్తి ముసుగులో
# డీలిమిటేషన్ కుట్ర

భారత రాజకీయ వేదికపై ఒక కీలక మలుపు తిరిగిన క్షణం ఇది. మహిళా సాధికారత అనే పవిత్రమైన లక్ష్యాన్ని ముందుంచుకుని వచ్చిన ఒక చట్టం...కానీదాని వెనుక దాగి ఉన్నరాజకీయ వ్యూహాలు, ప్రాంతీయ సమతుల్యంపై పడే ప్రభావం దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. 'నారీ శక్తి' అనే ఆకర్షణీయ నినాదం కింద డీలిమిటేషన్ వంటి సున్నితమైన అంశాన్ని కలిపి ప్రవేశపెట్టినప్పుడు, అది కేవలం ఒక శాసన ప్రక్రియగా మిగలలేదు – సమాఖ్య వ్యవస్థ, రాష్ట్రాల హక్కులు, రాజకీయ నైతికత అన్నీ ఒకే వేదికపై పరీక్షించబడిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో లోక్‌సభలో జరిగిన ఓటింగ్ కేవలం సంఖ్యల పోటీ కాదు... అది కేంద్రరాష్ట్ర సంబంధాల భవిష్యత్తును నిర్ణయించే ఘట్టంగా మారింది. ఒక వైపు మహిళా రిజర్వేషన్‌కు మద్దతు అనే నైతిక బాధ్యత, మరో వైపు రాష్ట్రాల న్యాయమైన వాటాను కాపాడాల్సిన అవసరం, ఈ రెండింటి మధ్య జరిగిన ఈ పోరు భారత రాజకీయాల్లో అరుదైన ఉదాహరణగా నిలిచింది. ఇదే సంఘటన... 'నారీ శక్తి ముసుగులో రాజకీయ ప్రయోజనాలా? లేక సమాఖ్య ధర్మానికి రక్షణగా నిలిచిన ప్రజాస్వామ్యమా?' అనే ప్రశ్నను దేశం ముందుంచింది. ఈ నేపథ్యంతో లోక్‌సభలో జరిగిన పరిణామాలు ఎలా మలుపుతిప్పాయో చూద్దాం...

లోక్‌సభలో ఏప్రిల్ 17, 2026న జరిగిన ఓటింగ్‌లో కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు వీగిపోవడం ఒక సాధారణ శాసన వైఫల్యం కాదు. అది బీజేపీ వ్యూహాత్మక రాజకీయాలకు స్పష్టమైన చెంపపెట్టు. మహిళా రిజర్వేషన్‌ను 'నారీ శక్తి' పేరుతో రాజకీయ ఆయుధంగా మలచి, దానిని డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన)తో కలిపి ఒకే ప్యాకేజీగా తీసుకురావడం ద్వారా దక్షిణాది రాష్ట్రాల సమాఖ్య హక్కులను కుదించాలని చేసిన ప్రయత్నం పూర్తిగా విఫలమైంది. 298 ఓట్ల మద్దతు, 230 వ్యతిరేక ఓట్లతో రెండింతల మెజారిటీ (352) సాధించలేకపోవడంతో బిల్లు కూలిపోయింది. దీంతో అనుబంధ డీలిమిటేషన్ బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులను ప్రభుత్వం స్వయంగా ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. ఇది కేవలం ఓటు లెక్క కాదు.. భారత రాజకీయ వ్యవస్థలో సమాఖ్య స్ఫూర్తి ఇంకా బలంగా ఉందని నిరూపించిన చారిత్రక క్షణం. 2023లో నారీ శక్తి వందన అధినియమం (106వ సవరణ) ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. మహిళలకు లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో 33 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని నిర్ణయం. కానీ అమలు? 2026 తర్వాత మొదటి జనాభా లెక్కలు (సెన్సస్) అనంతరం డీలిమిటేషన్ పూర్తయ్యే వరకు వాయిదా. అంటే 2034 వరకు ఆశించాల్సిన పరిస్థితి. ఇప్పుడు 2026లో ప్రభుత్వం హడావుడిగా స్పెషల్ సెషన్ పిలిచి మూడు బిల్లులు తెచ్చింది. 131వ సవరణ ద్వారా 2011 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ చేసి 2029 ఎన్నికల నుంచే మహిళా కోటా అమలు చేయాలని, లోక్‌సభ సీట్లు 543 నుంచి 850కి పెంచాలని, యూటీల్లో కూడా అమలు చేయాలని. ఉద్దేశ్యం ఒకటే.. మహిళా సాధికారతను 'ముసుగు'గా ఉపయోగించి డీలిమిటేషన్‌ను త్వరగా ముగించడం. ఇది ఉత్తరాది రాష్ట్రాలకు (జనాభా ఎక్కువగా ఉన్నవి) మరిన్ని సీట్లు ఇచ్చి, దక్షిణాది రాష్ట్రాలు (జనాభా నియంత్రణలో సాధించిన విజయం కారణంగా) సీట్లు తగ్గించే వ్యూహం. దీనిని ప్రతిపక్షాలు (ఇండియా కూటమి) స్పష్టంగా చెప్పాయి.. "మహిళలకు రిజర్వేషన్ మద్దతు ఉంది, కానీ డీలిమిటేషన్ ద్వారా దక్షిణ రాష్ట్రాలను శిక్షించే ప్రయత్నం సహించేది కాదు." ఇక్కడే బీజేపీ వ్యూహం బయటపడింది. 2023లో బిల్లును వాయిదా వేసినప్పుడు ప్రభుత్వం "సెన్సస్, డీలిమిటేషన్ తర్వాతే" అని చెప్పింది.



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి,
సీనియర్ జర్నలిస్ట్

## మహిళల రిజర్వేషన్ల బిల్లు ఓడిందా?
# ఓడగొట్టబడిందా?
### కావాలనే మోడీ అమిత్ షా రాజకీయ డ్రామా ఆడారా!

దేశంలో సరికొత్త నాటక రాజకీయాలు మరోసారి మహిళల పేరుతో మొదలయ్యాయి. రాజ్యాంగ సవరణ చేయాలంటే మూడింట రెండు వంతుల మెజార్టీ అవసరం. ప్రస్తుతం లోకసభలో సభ్యుల సంఖ్య 543 ఉన్నది.కానీ మోడీఅమిత్ షా కు అవసరమైన మెజార్టీ బలం లేదని తెలుసు. అందుకే బిల్లు వీగిపోగానే పదిహేను నిమిషాలలోనే విపక్షాలను నిందించడానికి.. బిజెపి మహిళా నేతలతో పార్లమెంటు ముందు నిరసన వ్యక్తం చేయించారు. ఒక వైపు పశ్చిమబెంగాల్, తమిళనాడు ఎన్నికలు జరుగుతున్న వేళ

మహిళా రిజర్వేషన్ కు ఇండియా కూటమి వ్యతిరేకమని కాంగ్రెస్, త్రుణమూల్ కాంగ్రెస్, డీఎంకే పార్టీలపై వ్యతిరేకత వెళ్లగక్కారు.రాహుల్ గాంధీ ఇంటిని మహిళలచే ముట్టడించారు.. దూరదర్శిని, టీవీ చానలలో ప్రతిపక్షాల పైన మహిళా వ్యతిరేకులని ప్రచారం చేశారు. ఆయారాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నందున దీనిని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటు ప్రచారంచేస్తున్నారు.



**మహిళా బిల్లు 2023లోనే ఆమోదం:-**

మహిళలకు 2/3 రిజర్వేషన్ బిల్లు 2023 సెప్టెంబర్ లోనే 128 రాజ్యాంగ సవరణ"నారీ శక్తి వందన్ అధినియం"పేరుతో లోకసభ, రాజ్యసభ లలో ఏకగ్రీవంగా ఆమోదించబడింది. తదుపరి రాష్ట్రపతి ఆమోదంతో చట్టం చేశారు. ఫలితంగా రాజ్యాంగంలో కొత్తగా ఆర్టికల్స్ 330A, 332A, 334A లు చేర్చబడ్డాయి. ఈ చట్టం ప్రాప్తికి లోకసభ, రాష్ట్ర శాసనసభలలో ఎస్సీ,ఎస్టీ మహిళలకు 33% సీట్లు కేటాయించబడతాయి. ఇది ప్రతి ఎన్నికల సందర్భంగా రోటేషన్ పద్ధతిలో వారికి నియోజకవర్గాలు మారుతూ ఉంటాయి. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా విపక్ష పార్టీలన్నీ ప్రస్తుతం ఉన్న 543 లోకసభ స్థానాలలోనూ, ఆయా రాష్ట్ర శాసనసభ స్థానాలలోనూ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మైనార్టీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి, 2024 లోకసభ ఎన్నికల నుండి అమలు చేయాలని డిమాండ్ చేశాయి.కానీ ఈ మహిళా సర్వేషన్లు జనగణన, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం మాత్రమే తదుపరి ఎన్నికల నుంచి అమలు చేయబడతాయని చట్టంలో పేర్కొన్నారు. ఈ చట్టంలో లోపం ఏమిటంటే, "ఓ బి సి, మైనారిటీ మహిళలకు రిజర్వేషన్లు వర్తింప చేయక, జనరల్ కోటాలోనే వారిని కలిపి వేయడం జరిగింది. ఈ అంశం అప్పుడు ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించారు. అయినప్పటికీ చట్టం కావడం జరిగింది.

**డి లిమిటేషన్ తో ముడిపెట్టి బిల్లు :**

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ది లిమిటేషన్ తో గతంలో ఆమోదించబడిన మహిళా రిజర్వేషన్ బిల్లును ముడిపెట్టి 131 వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆమోదించాలని చర్చకు పెట్టడం జరిగింది. దీనిపై ఇండియా కూటమిలోని పార్టీలు.. విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ నియోజకవర్గాల పునరుభజనను వ్యతిరేకిస్తూ మాట్లాడారు. మహిళా బిల్లు ప్రత్యేకంగా ఉండాలని.. దాని గతంలోనే బలపరిచామని చెప్పారు. అయినా మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం మొండిగా 131 వ రాజ్యాంగ సవరణ బిల్లు 2026 ను ఏప్రిల్ 17వ తేదీన లోకసభలో ప్రవేశపెట్టారు. ఎన్ డి ఏ కు మెజార్టీ లేకపోవడం, విపక్షపార్టీల సభ్యులు ఏఒక్కరూ బలపర్చకపోవటంతో ఈ బిల్లు 2/3 వంతు మెజార్టీలేక వీగిపోయింది. వాస్తవానికి 131 వ రాజ్యాంగ సవరణ బిల్లు మహిళల రిజర్వేషన్ల బిల్లు కాదు. ఇది కేవలం నియోజకవర్గాల పునర్విభజన బిల్లు మాత్రమే. ఇందులో మరోసారి మహిళా రిజర్వేషన్ల కోసం ప్రస్తావన చేశారు. అంశం అప్పుడు ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించారు. అయినప్పటికీ చట్టం కావడం జరిగింది.

డిలిమిటేషన్ కోసం మహిళా రిజర్వేషన్ అంశాన్ని అడ్డుపెట్టుకొని కూటమి నాయకత్వం లబ్ధి పొందాలని చూస్తున్నారు. చట్టసభలలో ఏ వర్గం మహిళలకు ప్రవేశం కల్పించబడుతుంది? ఉన్నత వర్గాలకు చెందిన మహిళలు లబ్ధి పొందుతున్నారు తప్ప శ్రామిక వర్గం మహిళలకు వీటిలో ప్రవేశం శూన్యం.1952 నుంచి జరుగుతున్న ఎన్నికలు ఉన్నత వర్గాల వారికే ప్రయోజనం చేకూర్చబడుతుంది. తీరా ఈ ఉన్నత వర్గ మహిళలు చట్టసభలకు ఎన్నిక కాబడిన తర్వాత భార్య పేరుతో భర్త, భర్త పేరుతో కుమారులు, కుమార్తెల పేరుతో తండ్రి, అన్నదమ్ములు అధికారం చలాఇస్తున్నారు. పేరుకే పదవులు తప్ప మహిళలకు స్వేచ్ఛ సమానత్వం ఆచరణలో జరగడం లేదు.

**రాజకీయ అవసరంగా సవరణలు :**

2014 నుంచి స్పష్టమైన మెజార్టీ ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం, 1996 నుండి పెండింగ్లో ఉన్న ఈ బిల్లు విషయంలో 2023 వరకు ఎందుకు వేచి చూసింది? యూపీఏ ప్రభుత్వాలు ప్రయత్నించినా, రాజకీయ ఏకాభిప్రాయం లేక విఫలమయ్యాయి. కానీ ఎన్డీఏ ముందుగానే దీని ఆమోదింప చేసుకున్నది. కానీ, అమలు ఆలస్యం అయ్యేలా షరతులు చేర్చడం వెనుక రాజకీయ వ్యూహాలు ఉన్నాయనే అనుమానం కలుగుతుంది. 2024 ఎన్నికలపై ప్రభావం లేకుండా ఉండేందుకు ఇదే మార్గమని విమర్శకులు అప్పుడు సందేహం వ్యక్తం చేశారు. ఇప్పుడు బిజెపి స్వతంత్ర మెజార్టీ కోల్పోయిన నేపథ్యంలో, సవరణలు రాజకీయ అవసరంగా ముందుకు వస్తున్నాయని ప్రతిపక్షం ఆరోపిస్తుంది.


**రాజకీయ లబ్ధి కోసం మోడీ ఎత్తుగడ :**

పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సందర్భంలో ఎలాంటి చర్చలకు తీసుకొని రాకుండా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల మధ్యలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం అధికార కూటమి ఉద్దేశాలపై సందేహాలు తావిస్తోంది. ప్రధాని మోడీ 2026 ఏప్రిల్ 11న అన్ని పార్టీల నేతలకు రాసిన లేఖలలో 'మహిళా సాధికారతకు ఏకగ్రీవ మద్దతు కోరారు'. ఇది ఒక ఎత్తుగడ మాత్రమే. దీనిపై ఇండియా ఫ్రంట్ లోని పార్టీలు ఎన్నికల పోలింగ్ కాగానే పిలవాలని మోడీకి విజ్ఞప్తి చేశారు. లోకసభ సభ్యుల సంఖ్య పెంచాలనుకుంటున్న ఎన్ డి ఏ, పార్లమెంటు విస్తరణతో ప్రాంతాల మధ్య సమతుల్యత కాపాడుతామని చెప్తుంది. కానీ ఇదే వాదన 2023లో ఎందుకు వినిపించలేదు? అప్పుడే జనగణనను పూర్తి చేసి ఉండి ఉంటే, ఈ పరిస్థితి వచ్చేది కాదు. 2011 గుణాంకాలను ఆధారంగా తీసుకోవడం వల్ల రిజర్వేషన్ల అమలుపై చిత్తశుద్ధి లేదేమోననే అనుమానాలు రేకెత్తుతున్నాయి.

**కేంద్రం నిబద్ధతపైనే సందేహాలు :-**

ఎన్ డి ఏ గత దశాబ్దంలో ఈ బిల్లును వాయిదా వేసి, ఇప్పుడు రాజకీయ అవసరాల నేపథ్యంలో ముందుకు తీసుకురావడం అనేక విమర్శలకు దారి తీస్తుంది. మహిళ సాధికారత పై నిజమైన నమ్మకం ఉంటే, ప్రభుత్వం పార్టీ స్థాయిలో మార్పులు తీసుకురావాలి. భారత మహిళలు చాలాకాలంగా ఈ విప్లవాత్మక నిర్ణయం అమలు కోసం ఎదురుచూస్తున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రస్తుత పరిస్థితులలో అన్ని పార్టీలతోనూ, ప్రతిపక్షాలతోనూ విస్తృతంగా చర్చలు జరిపి ఏకాభిప్రాయం తీసుకువచ్చేటందుకు కృషిచేయాలి, అమలు చేసేందుకు నిబద్ధతతో అమలు చేస్తుందా? లేక స్వీయ రాజకీయ లబ్ధి కోసం పావులు కలుపుతుందా? అన్నది చరిత్ర నిర్ణయిస్తుంది. ప్రస్తుతం మాత్రం ఈ నిర్ణయం ఆచరణ పై అనుమానాలకు తావిస్తుంది.

128 వ రాజ్యాంగ సవరణ చట్టంలోని లోపాలను సరిచేయాలని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ మహిళలందరికీ చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, పోరాడినప్పుడే, చట్టసభలలో మహిళ రిజర్వేషన్లు అమలు కావడం జరుగుతుందని ఆశిద్దాం.



ఉజ్జిని రత్నాకర్ రావు-9490952546

# అంకెల గారడీలో ఆదివాసీ అస్తిత్వం!

- నాయక పోడుల ఉనికిపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక వర్గం అభివృద్ధి చెందాలన్నా, వారికి రాజ్యాంగ ఫలాలు అందాలన్నా ప్రాథమిక ప్రాతిపదిక 'జనాభా గణాంకాలు'. కానీ, తెలంగాణలో రెండో అతిపెద్ద గిరిజన తెగగా ఉన్న 'నాయక పోడు'ల విషయంలో ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలు ఆ జాతి ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సుమారు 7 లక్షలకు పైగా ఉన్న నాయక పోడు జనాభాను కేవలం 3,81,276 కి పరిమితం చేయడం అంటే, దాదాపు సగానికి పైగా జనాభాను అధికారిక రికార్డుల్లో అదృశ్యం చేయడమే. ఇది కేవలం ఒక సాంకేతిక పొరపాటో, గణాంకాల గందరగోళమో కాదు... ఒక ప్రాచీన ఆదివాసీ జాతికి జరుగుతున్న చారిత్రక అన్యాయం.

తెలంగాణ రాష్ట్రంలో ఆదివాసీల సామాజిక, ఆర్థిక వికాసానికి జనాభా లెక్కలే వెన్నెముక. ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, సీరియల్ నెంబర్ 6 కింద ఉన్న గోండు, నాయక పోడు, కోయతుర్, రాజ్ గోండు వంటి నాలుగు ప్రధాన తెగలు కలిపి మొత్తం 3,81,276 జనాభాతో (10.29 శాతం) ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. అయితే, ఈ గణాంకాల్లోని అంతర్గత విభజనను లోతుగా పరిశీలిస్తే నాయక పోడులకు జరుగుతున్న అన్యాయం స్పష్టమవుతోంది. వివిధ సామాజిక సర్వేలు మరియు ఆదివాసీ సంఘాల లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఈ తెగ జనాభా ఒక్కటే 7 లక్షల మార్కును దాటినప్పటికీ, నాలుగు తెగలను కలిపి కూడా కేవలం 3.81 లక్షలుగానే చూపడం వెనుక ఉన్న మతలబు ఏమిటో ప్రభుత్వమే సమాధానం చెప్పాలి.

**జిల్లాల వారీగా గల్లంతైన జనాభా**

ప్రభుత్వ గణాంకాలు కేవలం ఐదు జిల్లాలకే పరిమితమై ఉండటం గమనార్హం. ఆదిలాబాద్ (1,41,598), ఆసిఫాబాద్ (75,312), నిర్మల్ (35,938), నిజామాబాద్ (18,885) మరియు భూపాలపల్లి (14,774) జిల్లాల్లో మాత్రమే నాయక పోడుల ఉనికిని ప్రభుత్వం గుర్తించింది. ఈ ఐదు జిల్లాలను మినహాయిస్తే రాష్ట్రంలోని మిగిలిన 28 జిల్లాల్లో అసలు నాయక పోడులు లేరా? అనే సందేహం కలుగుతోంది. ములుగు, వరంగల్, ఖమ్మం, భద్రాచలం, జగిత్యాల, కరీంనగర్, మహబూబాబాద్ వంటి జిల్లాల్లో వేల సంఖ్యలో నాయక పోడు కుటుంబాలు నివసిస్తున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల ఏజెన్సీ ప్రాంతాల్లో తరతరాలుగా కొండపోడు వ్యవసాయం చేస్తూ, తమదైన సంస్కృతిని కాపాడుకుంటున్న ఈ తెగ జనాభాను ఏ ప్రాతిపదికన విస్మరించారో అర్థం కాని పరిస్థితి. ఇక్కడ వారిని ఏ తెగ కింద లెక్కించారు? లేక వారిని ఇతర తెగలలో కలిపి చూపిస్తున్నారా? అన్న అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్నాయి.

**ఇతర తెగలలో విలీనం – అస్తిత్వ ముప్పు**

నాయక పోడుల జనాభాను ఇతర ఆదివాసీ తెగల్లో కలిపి చూపడం వల్ల వారి ప్రత్యేక సాంస్కృతిక గుర్తింపు ప్రమాదంలో పడుతోంది. ప్రతి ఆదివాసీ తెగకు ఒక ప్రత్యేకమైన ఆచార వ్యవహారాలు, దైవారాధన, సామాజిక కట్టుబాట్లు ఉంటాయి. నాయక పోడుల జనాభాను ఇతర తెగల్లో విలీనం చేయడం ద్వారా వారి స్వయంప్రతిపత్తి కలిగిన అస్తిత్వాన్ని ప్రభుత్వం చెరిపివేస్తోంది. ఇది కేవలం జనాభా లెక్కల తగ్గింపు మాత్రమే కాదు, ఒక తెగ యొక్క ఉనికిని కాలరాయడమే. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో తమ జనాభా ఎక్కువగా ఉందని డామినేట్ చేస్తున్న వర్గాల వల్ల నాయక పోడులు సామాజికంగా ఒంటరి అవుతున్నారు. తప్పుడు గణాంకాలు ఈ ఆధిపత్య పోరాటాలను మరింత పెంచి, నాయక పోడుల రాజకీయ ప్రాతినిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయి.



**రిజర్వేషన్లు మరియు రోస్టర్ విధానంపై ప్రభావం**

జనాభా లెక్కల్లో జరిగే ఈ తప్పులు నేరుగా నిరుద్యోగ యువత మరియు విద్యార్థుల భవిష్యత్తు పై ప్రభావం చూపుతాయి.

విద్యా, ఉద్యోగ అవకాశాలు: రాజ్యాంగం ప్రకారం జనాభా నిష్పత్తిలోనే రిజర్వేషన్లు దక్కాలి. 7 లక్షల జనాభా ఉన్న చోట 3 లక్షల పైచిలుకే చూపిస్తే, వారికి దక్కాల్సిన అవకాశాల్లో సగానికి పైగా కోత పడుతుంది.

రోస్టర్ విధానం: ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో, పదోన్నతుల్లో రోస్టర్ పాయింట్లు జనాభా నిష్పత్తిపై ఆధారపడి ఉంటాయి. తప్పుడు లెక్కల వల్ల నాయక పోడు అభ్యర్థులు తమకు రావాల్సిన సీట్లను, ఉద్యోగాలను శాశ్వతంగా కోల్పోయే ముప్పు పొంచి ఉంది.

సంక్షేమ పథకాలు: ఎస్టీ ఉప ప్రణాళిక (TSP) కింద కేటాయించే నిధులు మరియు జిల్లా స్థాయి సంక్షేమ పథకాలు అన్నీ అంకెల ఆధారంగానే మంజూరవుతాయి. జిల్లాల వారీగా జనాభాను గుర్తించకపోతే ఆయా ప్రాంతాల్లోని నాయక పోడులకు ప్రభుత్వం నుండి ఏ విధమైన సహాయం అందదు.

**ప్రభుత్వ బాధ్యత - తక్షణ చర్యలు**

ఇప్పటికే నాయక పోడు ప్రతినిధులు అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రభుత్వ సర్వేలు శాస్త్రీయంగా లేవని, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలను అధికారులు విస్మరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఎస్టీ కమిషన్‌ను కలిసి తమ నిరాశన వ్యక్తం చేస్తామని నాయక పోడు ప్రతినిధులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి వాస్తవాలను గ్రహించాలి.

పారదర్శక సర్వే: వివాదాస్పదంగా మారిన జిల్లాలలో తక్షణమే పారదర్శకమైన మరియు శాస్త్రీయమైన 'రీసర్వే' నిర్వహించాలి.

ఉప తెగల గుర్తింపు: సీరియల్ నెంబర్ 6 లోని ఇతర తెగలతో కలపకుండా నాయక పోడు జనాభాపై స్పష్టమైన గణాంకాలు వెల్లడించాలి.

ఎస్టీ కమిషన్ జోక్యం: రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఈ వ్యవహారాన్ని గంభీరంగా పరిగణించి, ఆదివాసీ తెగలకు జరగబోయే అన్యాయాన్ని అడ్డుకోవాలి.


ఒక తెగ యొక్క జనాభాను తక్కువగా చూపడం అంటే ఆ తెగ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడమే. తెలంగాణలో రెండో అతిపెద్ద ఎస్టీ తెగకు జరుగుతున్న ఈ అన్యాయాన్ని సరిదిద్దకపోతే, అది సామాజిక న్యాయానికే మాయని మచ్చగా మిగిలిపోతుంది. నాయక పోడులు అడుగుతున్నది కేవలం వారి ఉనికిని గుర్తించమని మాత్రమే. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వాస్తవ జనాభాను రికార్డుల్లో నమోదు చేయాలి. లేనిపక్షంలో, అస్తిత్వం కోసం వారు చేసే పోరాటం ఉధృతమయ్యే అవకాశం ఉంది. ప్రజాస్వామ్యంలో ఏ ఒక్కరి హక్కు కూడా గణాంకాల గారడీ వల్ల గల్లంతు కాకూడదని పాలకులు గుర్తించాలి.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

**మైగ్రేన్ నియంత్రణకు కాఫీ, టీ పరిమితం**

అధిక కెఫీన్ నొప్పిని పెంచుతుంది. రోజుకు 1–2 కప్పులకు మాత్రమే పరిమితం చేయండి.




## ఘనంగా భగీరథ మహర్షి జయంతి



ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్: నాగర్ కర్నూల్ కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పాల్గొని మహర్షి భగీరథుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ భగీరథ మహర్షి పట్టుదల, సేవాభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి గంగానదిని భూమికి తీసుకువచ్చిన మహనీయుడిగా భగీరథుడు చరిత్రలో నిలిచారని తెలిపారు. నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. భగీరథుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సగర కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సగర కుల సంఘ నాయకులు భగీరథుని విగ్రహం ఏర్పాటు చేయాలని, సగర కుల భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సహాయ అధికారి శ్రీరాములు, వివిధ శాఖల అధికారులు, సగర సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టు శ్రీనివాసులు సాగర్, 18వ వార్డు కౌన్సిలర్ చంద్రకళ సాగర్, సంఘ నాయకులు అల్లం రాముడు, సాయిలు సాగర్, లక్ష్మణ్ సాగర్, బాలయ్య సాగర్, బంగారయ్య సాగర్, సూరంపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల పాత్ర కీలకం

### - జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్: విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంత ముఖ్యమో, తల్లిదండ్రుల పాత్ర కూడా అంతే కీలకమని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణలో భాగంగా నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని బిజినపల్లి మండలం పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ ఆకస్మికంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతి, పాఠశాల అభివృద్ధి, తల్లిదండ్రుల బాధ్యతలపై ఆయన అవగాహన కల్పించారు. జిల్లాలో విద్యార్థుల హాజరు శాతం పెంపు, మధ్యలో చదువు మానేసే వారి సంఖ్య తగ్గింపు, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్యపై మరింత శ్రద్ధ వహించాలని, వారిని క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని, ఇంటి వద్ద చదువుకు అనుకూల వాతావరణాన్ని కల్పించాలని సూచించారు.

### లాభదాయకమైన వంగడాలను అభివృద్ధి చేయాలి

రైతులకు లాభదాయకంగా ఉండే వ్యవసాయ వంగడాలను కనుగొని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన మరియు విస్తరణ సలహా సంఘ సమావేశం పాలెంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో నిర్వహించగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో



కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ విస్తరణాధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ రైతుల సమస్యలకు సమయానుకూల పరిష్కారాలు కనుగొనాలని సూచించారు. రైతులు శాస్త్రవేత్తల సలహాలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపడితే దిగుబడులు పెరుగుతాయని కలెక్టర్ తెలిపారు. అనంతరం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సంచాలకులు డా. ఎల్. కృష్ణ మాట్లాడుతూ గత ఏడాది వరి, వేరుశనగ, శనగ పంటల్లో సాధించిన పురోగతిని వివరించారు. విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డా. బలరాం మాట్లాడుతూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన వరి, అముదం పరిశోధన కేంద్రాలను అభినందించారు. చలి, ఎండలను తట్టుకునే పంట రకాల అభివృద్ధి, వరి ప్రత్యామ్నాయ పంటల విస్తరణపై దృష్టి పెట్టాలని సూచించారు.

సమావేశంలో యూరియా సమగ్ర వినియోగం, చిరుధాన్యాల ప్రోత్సాహం, అడవి పందులు, కోతుల వల్ల కలిగే నష్టాన్ని నియంత్రించడానికి తీసుకుంటున్న చర్యలపై శాస్త్రవేత్తలు వివరించారు. డిజిటల్ వ్యవసాయం ప్రాధాన్యత పెరుగుతోందని, సామాజిక మాధ్యమాల ద్వారా రైతులకు సత్వర సమాచారం చేరవేయాలని సూచించారు.

ఈ సమావేశంలో 200కు పైగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయ సంచాలకులు, 12 జిల్లాల వ్యవసాయ అధికారులు, విస్తరణ శాస్త్రవేత్తలు, ఉద్యానవన శాఖ అధికారులు, నాబార్డు, భారత వ్యవసాయ పరిశోధన మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

### లింగ నిర్ధారణ చట్టం అమలుపై నిబంధనలు తప్పనిసరి

లింగ నిర్ధారణ చట్టం అమలులో కఠిన నిబంధనలు తప్పనిసరి అని కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి బహుళ సభ్యుల అనుమతి కమిటీ సమావేశంలో, కొత్తగా ఏర్పాటు అవుతున్న క్లినిక్కు, ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లకు అనుమతుల అంశంపై సమగ్రంగా చర్చించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 15 ఆసుపత్రులు మరియు 3 స్కానింగ్ సెంటర్ల దరఖాస్తులను కమిటీ పరిశీలించింది.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో బాలికలపై వివక్షను నివారించడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అన్ని వైద్య కేంద్రాలు తప్పనిసరిగా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. 15 ప్రైవేట్ క్లినిక్‌లు, 3 స్కానింగ్ సెంటర్లకు అనుమతులు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రవికుమార్ నాయక్, ఇండియన్ మెడికల్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ యం. చెన్నయ్య, ఎన్జీవో ప్రతినిధి లక్ష్మణరావు, వైద్యులు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ భరత్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ధరిత్రి దినోత్సవం




ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్: నాగర్ కర్నూల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గగ్గలపల్లి గ్రామంలో ధరిత్రి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. లయన్స్ ఇంటర్నేషనల్ పిలుపు మేరకు, డిస్ట్రిక్ట్ గవర్నర్ మహేంద్ర కుమార్ రెడ్డి ఆదేశాల ప్రకారం ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో రైతుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మళ్లాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మొక్కలు నాటడం, విత్తన బంతుల పంపిణీ చేపట్టారు. రైతులతో కలిసి “నేల తల్లిని కాపాడుకుంటాం, ప్లాస్టిక్ వాడం, చెట్లు పెంచుతాం” అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, క్లబ్ సభ్యుడు దొడ్ల ఈశ్వర్ రెడ్డి చేత కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. క్లబ్ సెక్రటరీ సురేష్ కుమార్, ట్రెజరర్ పరమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కుషాయిగూడ డిపో ఎదుట ఆర్టీసీ కార్మికుల ధర్నా



ముద్ర, కుషాయిగూడ: ఆర్టీసీ సమ్మెలో భాగంగా కుషాయి గూడ డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు గురువారం ధర్నా చేశారు. ఈ ధర్నాకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకపోతే మరోసారి సకల జనుల సమ్మెకు దిగాల్సి వస్తుందని హెచ్చ రించారు. ఆర్టీసీ సమ్మెను భగ్నం చేసే కుట్రలు జరుగుతున్నాయని, కుట్రలు కాదు సమస్యలకు పరిష్కారం కావాలన్నారు. ప్రభుత్వం వెంటనే కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్త లు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## కెసిఆర్ పై కాంగ్రెస్ ఆరోపణలు అవాస్తవం

### - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ముద్ర, కాప్రా:** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు అసత్యమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ లోని ఏ.ఎస్. రావు నగర్‌లో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయంపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తోందని విమర్శించారు. ప్రాజెక్టు ఖర్చు లక్ష కోట్లు అని చెప్పడం పూర్తిగా అసత్యమని, అన్నారు. ఈ విషయంపై తమకు కోర్టులపై పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, హరీష్ రావులపై చేస్తున్న ఆరోపణలు ఆధార రహితమని, నిజాలు త్వరలో బయటపడతాయని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, అంజయ్య, ప్రభుదాస్, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

## ప్రాజెక్టులు చేపట్టలేక కేసీఆర్ పై ఆరోపణలు

### - మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి




**ముద్ర, మల్కాజిగిరి:** మాజీ ముఖ్యమంత్రి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తుత ప్రభుత్వం విమర్శిస్తున్నప్పటికీ, గత రెండున్నర సంవత్సరాలుగా కొత్త ప్రాజెక్టులను ప్రారంభించడంలో విఫలమైందని మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆరోపించారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు దూరదృష్టితో నిర్మించిన ప్రాజెక్ట్‌గా అభివర్ణించారు. ఈ ప్రాజెక్ట్ వల్ల ఎండాకాలంలో కూడా రైతులు రెండు పంటలు పండించగలుగుతున్నారని చెప్పారు. కేసీఆర్, హరీష్ రావుపై వచ్చిన ఆరోపణలు నిలబడలేదని, కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలు తేలిపోవడంతో వాస్తవం ప్రజలకు తెలిసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా అనిల్ కిషోర్ గౌడ్, అలాగే బీఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, మేకల రాము యాదవ్ పాల్గొన్నారు.

## ‘వేసవిలో పిల్లల పట్ల జాగ్రత్త వహించాలి’




ముద్ర, పెబ్బేరు: వేసవిలో పాఠశాలల విద్యార్థులకు సెలవుల నేపథ్యంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని ఎస్సై వెంకటేష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 24 నుంచి జూన్ 11 వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించిన నేపథ్యంలో విద్యార్థులు సరదా కోసం చెరువులు, కుంటలు, వాగులలో ఈతకు వెళ్లకుండా దృష్టి సారించాలన్నారు. గతంలో విద్యార్థులు ఈతకు వెళ్లి మరణించిన సంఘటనలు గుర్తు చేసుకోవాలని అన్నారు.

## మున్సిపల్ కమిషనర్ గైర్హాజరుపై బీఆర్ఎస్ కౌన్సిలర్ల ధర్నా



ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి: గద్వాల మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న నాలుగు కో–ఆప్షన్ సభ్యుల ఎంపిక ప్రక్రియ తీవ్ర ఉత్కంఠకు, వివాదానికి దారితీసింది. దరఖాస్తుల స్వీకరణకు గురువారం ఆఖరి రోజు కావడంతో ఆశావహులు, బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు భారీగా తరలివచ్చారు. అయితే, అత్యంత కీలక సమయంలో మున్సిపల్ కమిషనర్ జానకీ రాం సాగర్ కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. కో–ఆప్షన్ దరఖాస్తులను స్వయంగా కమిషనర్‌కే అందజేయాలని కౌన్సిలర్లు భావించగా, ఆయన కార్యాలయంలో లేకపోవడంతో గందరగోళం నెలకొంది. బీఆర్ఎస్ కౌన్సిలర్లు గద్వాల్ కమిషనర్ ను ఫోన్ ద్వారా సంప్రదించగా, "దరఖాస్తులను ఇన్–వార్డు సెక్షన్‌లో ఇచ్చి వెళ్ళండి" అంటూ బదులివ్వడం వివాదానికి ఆజ్యం పోసింది. దీంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. కమిషనర్ తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు మున్సిపల్ కార్యాలయంలోనే బైఠాయించి ధర్నా చేపట్టారు. కమిషనర్ ఛాంబర్ వద్ద బైఠాయించిన కౌన్సిలర్లు ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న గద్వాల మున్సిపల్ కమీషనర్ కార్యాలయానికి వచ్చారు. దరఖాస్తు చేసుకోవడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని, దరఖాలను ప్రత్యేక సెల్‌లో సమర్పించాలని సూచించారు.


## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

### - అసిస్టెంట్ ప్రొఫెసర్ రవికుమార్

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల్లోనాణ్యమైన విద్య అందుతుందని పాలమూరు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్. రవికుమార్ అన్నారు. గురువారం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్ యం ఎస్.కల్పన అధ్యక్షతన జరిగిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం, ప్రగతి పత్రాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయనతో పాటు, సర్పంచ్ పెద్దమోని లక్ష్మీ ఆంజనేయులు, ఉప సర్పంచ్ కవిత, ఏఏపీసీ చైర్మన్ వాకిటి అరుణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రవికుమార్ మాట్లాడుతూ అర్హతలు, మంచి అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మకమైన అందిస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచిం చి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఈ విద్యా సంవత్సరంలో ఒకటి నుంచి 5 వ తరగతి వరకు విద్యను అభ్యసించి పై తరగతులకు ఉత్తీర్ణతను విద్యార్థులకు ప్రగతి పత్రాలను ప్రదానం చేశారు.



## విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి




**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకునేలా ఉపాధ్యాయు లతో పాటు వారి తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా గురుకుల విద్యాలయంలో చదివి ఇంటర్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించారు. అనంత రం అధికారులు గురుకుల విద్యాలయంలోని విద్యా ర్థులతో, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు.

ఈ కార్యక్రమంలో పుల్లూరు సర్పంచ్ సునీతమ్మ, ఉప సర్పం చ్ అబ్దుల్, డీసిఓ అనిలా కుమారి, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా, ఎంపీఓ ఖాజా మొయినుద్దీన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్గనూర్ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా..

### - ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి




**ముద్ర, తాండూర్:** ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. తాండూర్ నియోజకవర్గం యాలాల మండలం అగ్గనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.42 లక్షలతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను, సైన్స్ ల్యాబ్ ను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. అగ్గనూర్ ప్రభుత్వ పాఠశాలకు విద్యాపరంగా, క్రీడల పరంగా మంచి ప్రశాంతతతో అన్ని రంగాల్లోనూ ఈ యొక్క పాఠశాలకు చాలా మంచి పేరు ఉందని ఆయన తెలిపారు. ఇంతటి క్రమశిక్షణకు మారుపేరు గల జిల్లా పరిషత్ పాఠశాలను ఇంటర్ స్థాయికిగఅప్గ్రేడ్ చేసేలా నేను కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నాలుగు అదనపు గదులు మంజూరు చేయాలని ఉపాధ్యాయులు కోరగా మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారు.

అనంతరం నూతనంగా నిర్మించిన జోగు విజయలక్ష్మి ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి గృహప్రవేశ పూజా కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాఠశాల అధ్యాపకబృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 24.04.2026
www.mudranews.in | @mudranews



**మైగ్రేన్ నియంత్రణకు..**



కాంతి – శబ్దం తగ్గించండి
ఎక్కువ లైటింగ్, గట్టిగా శబ్దం మైగ్రేన్‌కు కారణం.
శాంతమైన వాతా వరణంలో విశ్రాంతి తీసుకోండి.

# విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
విద్యార్థుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ప్రజా పాలన –ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో భాగంగా పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో గురువారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్, కలెక్టర్ సత్యప్రసాద్ విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులతో మమేకమై వారి అభ్యాస పరిస్థితులు, వసతి సదుపాయాలు, ఆహార నాణ్యతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. గురుకుల విద్యా సంస్థలను మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు తమకు అందుతున్న సదుపాయాలపై అభిప్రాయాలను వెల్లడించారు. విద్యార్థుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ సంగనబట్ల దినేష్, ఆర్‌డీవో మధుసూదన్, డీసీసీ అధ్యక్షుడు నందయ్య, కౌన్సిలర్లు దుమాల రాజ్ కుమార్, బడుగు పద్మ రాజేందర్, బొల్లరపు స్వప్న గిరిధర్, ఖాజా కమలుద్దిన్, మున్సిపల్ మాజీ చైర్మెన్ గిరి నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు బండ శంకర్, దయాల శంకర్, అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సమ్మె ఉధృతం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
తమ డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మె గురువారం రెండో రోజుకు చేరుకుంది. తమ నిరసనలో భాగంగా సిబ్బంది నిర్మల్ డిపో ఎదుట ధర్నా చేశారు. కొన్ని ప్రైవేటు బస్సులు నడుపుతున్నా అవి ప్రజల అవసరాలు తీర్చటం లేదు. ఫలితంగా ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రైవేటు వాహన చోదకులు ప్రయాణికుల వద్ద ఎక్కువ మొత్తాన్ని వసూలు చేస్తున్నారు.

## భూగర్భ జలాలు పెంపునకు కృషి చేయాలి



**బోథ్, ముద్ర:**
భూగర్భ జలాలు పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బోథ్ ఎంపీడీఓ రమేష్ సూచించారు. గురువారం ఆయన మండలంలోని జీడిపల్లి లో ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న నిరవధిక సమతల కందకాల పనిని పరిశీలించారు. కూలీల హాజరు విధానం, పని కొలతల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో కూలీలందరూ ఉదయం 6 గంటల లోపు పనికి రావాలన్నారు. కొలతల ప్రకారం పనులను నాణ్యంగా చేపట్టాలన్నారు. కందకాల్లో వర్షం నీటి నిలువ ద్వారా భూగర్భ జలాలు పెంపొందించుటకు కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జగ్దే రావు, ఈసీ మధుకర్, టెక్నికల్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ రాము, మెట్లు తదితరులు పాల్గొన్నారు.

## మోదుగ మొగ్గలు పుస్తకావిష్కరణ

**బోథ్, ముద్ర:**
ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం పొన్నారి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల రచించిన గేయాల సంపుటి 'మోదుగ మొగ్గలు' (పొన్నారి పిల్లల గేయాలు) పుస్తకాన్ని గురువారం కలెక్టర్ రాజర్షి షా ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్ల ల్లో అద్భుతమైన ప్రతిభ ఉంటుందన్నారు. డిఆర్డీఓ రవీందర్, ఎంఈఓ శ్రీకాంత్, మం డల నోడల్ అధికారి రాజాశంకర్,హెచ్ ఎం సుజాత, ఏఎంఓ లక్ష్మణ్, అసి స్టెంట్ అజయ్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**- సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి**




**ముద్ర, కరీంనగర్:**
రైతులకు ఎల్లప్పుడూ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్, ఫకీర్ పేట్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండించిన ధాన్యం అమ్ముకోవడానికి గతంలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. తప్పు, తాలు పేరు మీద అనేక ఇబ్బందులు పెట్టారన్నారు. రైతును రాజును చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత ప్రభుత్వం ఎనిమిది లక్షల కోట్ల అప్పుల ఖజానా అప్పజెప్పినా రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుకు అండగా నిలవడం కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రామ్మోహన్, సీసీలు కృష్ణ, అశోక్, పీఏసీఎస్ ఈఈఓ రమేష్, సర్పంచ్ లు సుద్దాల కమలాకర్, బొద్దుల విజయ లక్ష్మి లక్ష్మణ్, వీవో సునీత తదితరులు పాల్గొన్నారు.

**పెండింగ్ పనులు పూర్తి చేయాలి..**

పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేసి కొత్త పనులకు టెండర్లు ఖరారు చేయాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,వైస్ చైర్మన్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశిం చారు. సుడా పనులపై చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ కారణాలతో పెండింగ్ లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని కొత్త పనులకు టెండర్లు పిలవడానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సుడా కమర్షియల్ బిల్డింగ్ మొదటి విడత పనులు చివరి దశకు వచ్చాయని ఆది పూర్తి కాగానే మిగతా పనులకు టెండర్లు పిలవాలని రాజీవ్ చౌక్ లో నూతనంగా ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహం, రాజీవ్ చౌక్ సుందరీకరణ పనులు మే 21 లోగా పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఈ రాజ్ కుమా ర్, ఈఈ శివానంద్, డీఈఈ లు రాజేంద్ర ప్రసాద్, వెంకటేశ్వర్లు, ఏఈ సతీష్ పాల్గొన్నారు.

# 'భగీరథ' సంకల్పం నేటి తరానికి ఆదర్శం

**- కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా**



**ముద్ర, కరీంనగర్:**
సగర భగీరథ మహర్షి పట్టుదల, సంకల్పం నేటి తరానికి ఆదర్శమని కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతిని ఘనంగానిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఉన్నతాధికారులు సగర సంఘం నాయకులతో కలిసి భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సగర సంఘం నాయ కులు మాట్లాడుతూ తాము అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నామని.. చేయూత అందించాలని కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సగర కులస్తులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం తరపున అందించే విద్య, స్కాలర్షిప్, విద్యాలయాల్లో సీట్లు, అందించే రుణాలపై సగర సంఘం నాయకులకు అవగాహన కల్పించాలని బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్ ను ఆదేశించారు. ఆర్డీవో మహేశ్వర్ జడ్పీ సీఈవో శ్రీనివాస్, సగర సంఘం జిల్లా అధ్యక్షుడు దేవుని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కట్ట రాజు, కోశాధికారి కుమారస్వామి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్, రాష్ట్ర కార్యనిర్వహక సభ్యులు జ్యోతి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పంటల సాగులో ఆధునికత జోడించాలి

**- ఎమ్మెల్యే సంజయ్ కుమార్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
రైతులు పాత పద్ధతుల్లోనే కాకుండా ఆధునికతను జోడించి మార్కెట్ లో డిమాండ్ కు అనుగుణంగా పంటల సాగు పై ప్రత్యేక దృష్టి సారించాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సూచించారు. జగిత్యాల రూరల్ మండలంలోని చల్గల్ వ్యవసాయ మార్కెట్ లో రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, జగిత్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అదనపు కలెక్టర్ బీ ఎస్ లత, మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీని వాస్, డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, ఏఎంసీ చైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి, డీఏఓ భాస్కర్, డీఈవో మనోజ్, డీఈఎస్ఓ జితేందర్ రెడ్డి, తహసీ ల్దార్ హాకిం, డీఎంఓ ప్రకాష్, సెక్రెటరీ శ్రీనివాస్ రావు, ఏఎంసీ మాజీ చైర్మెన్ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

## దివ్యాంగురాలికి స్కూటీ అందజేత

**- మంత్రి అడ్లూరికి కృతజ్ఞతలు తెలిపిన శిరీష**



**ముద్ర, ధర్మపురి:** సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశంతో అధికారులు ఓ దివ్యాంగురాలుకు స్కూటీ అందజేశారు. తన కష్టాలు చెప్పుకోగానే స్పందించి సాయం చేసిన మంత్రికి ఆమె కృతజ్ఞతలు తెలిపింది. వివరాల్లోకి వెళ్లితే.. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నామపూర్ గ్రామానికి చెందిన జొన్నల శిరీష దివ్యాంగురాలు. కుటుంబ పోషణ కోసం శిరీష హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. కాని హైదరాబాద్ మహానగరంలో విధులకు హాజరయ్యేందుకు ప్రయాణం చేయడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో తనకు ప్రభుత్వం ద్వారా సాయం అందించాలని శిరీష ఇటీవల సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను వేడుకుంది. దీంతో చలించిన మంత్రి లక్ష్మణ్ కుమార్ తన శాఖ ద్వారా శిరీషకు స్కూటీ అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో అధికారులు గురువారం ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శిరీష కు స్కూటీ అందజేశారు. శిరీష ఆనందం వ్యక్తం చేసింది. తనకు స్కూటీని అందజేసినందుకు మంత్రి లక్ష్మణ్ కుమార్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లకు ధన్యావాదాలు తెలిపారు.

## బ్రిక్ టు బుక్స్

**– వలస కార్మికుల పిల్లలకు విద్యాభ్యాసం**



**ముద్ర, కరీంనగర్:** కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని గట్టుబూత్కూర్‌లో నిర్వహిస్తున్న "బ్రిక్ టు బుక్స్" వర్క్ సైట్ స్కూల్ ద్వారా వలస కార్మికుల పిల్లలకు విద్యా వెలుగు చేరుతోంది. విభిన్న రాష్ట్రాల నుంచి వచ్చిన ఇటుక బట్టీల్లో పని చేసే కార్మికుల కుటుంబాలకు చెందిన 66 మంది విద్యార్థులు ఐదు నెలలుగా విద్యాభ్యాసం చేశారు. గురువారం వీరికి ప్రగతి పత్రాలు అందజేశారు. ఈ పిల్లల్లో చాలా మందికి ఇది మొట్టమొదటి విద్యా గుర్తింపు కావడం విశేషం. తల్లిదండ్రుల ఉపాధి కోసం తరచూ ప్రాంతాలు మారాల్సి వచ్చే పరిస్థితుల్లో కూడా, విద్యార్థులకు గణితం, ఆంగ్లం, చిత్రలేఖనం వంటి ప్రాథమిక నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్ రావు. హెచ్ఎం చంద్రకళ, సిఆర్పీ మధుకర్, వీవీలు జ్యోతి, కావ్య పాల్గొన్నారు.

## నేడు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జగిత్యాల మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నికలు ముహూర్తం ఖరారు అయింది. మున్సిపల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించడానికి అధికారులు ఏర్పాటు చేశారు. జగిత్యాల మున్సిపల్ నాలుగు కో ఆప్షన్ సభ్యుల పదవులు ఉండగా, ఇందుకుగాను మొత్తం 12 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో కో ఆప్షన్ సభ్యుల నియామకంపై ఓటింగ్ తప్పనిసరి కానుంది. అయితే ఒక పదవికి హోరా హోరు పోరు నడుస్తుండగా, పదవీ నాకు అంటే నాకే అని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ల ఆశీస్సులు ఎవరికి అని జగిత్యాలలో మొదలైన చర్చ నడుస్తుంది. కాగా ఇప్పటికే 4 పేర్లు ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతుంది. వీరిలో గట్టు సతీష్, వీరబత్తిని పద్మజ, ముజాయిద్, తస్లీమ్ సుల్తానా పేరు దాదాపు ఖరారయ్యాయి. జగిత్యాల మున్సిపల్ లో కాంగ్రెస్ కు 23 మంది సభ్యులు ఉండగా, బీజేపీపికి 6, బీఆర్ఎస్ నాలుగు, ఎంఐఎం 2, ఇండిపెండెంట్ 15 మంది ఉన్నారు. కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక సందర్భంగా ఆయా పార్టీలు వారి సభ్యులకు విప్ జారీ చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు కోఆప్షన్ సభ్యులు ఎవరు అనే విషయం పై పూర్తి క్లారిటీ రానుంది.

## వైభవంగా దత్తాత్రేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



**మహాదేవపూర్, ముద్ర:** కాటారం మండలంలోని ధన్వాడ గ్రామంలో శ్రీ దత్తాత్రేయ స్వామి వారి ఆలయ 5వ వార్షికోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, హోమం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వామన్ రావు, మెంగాని అశోక్, చల్ల తిరుపతిరెడ్డి పలువురు కాటారం, మహా ముత్తారం మలహర్ మండలాల నాయకులు, ప్రజా ప్రతినిధులు భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారి దర్శనం చేసుకుని అన్నదానం స్వీకరించారు.

## అంత్య పుష్కర పనులను పూర్తి చేయాలి

**మహదేవపూర్, ముద్ర:** సరస్వతి అంత్య పుష్కర పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం కాళేశ్వరంలో సరస్వతి ఘాట్ వద్ద జరుగుతున్న పనుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రత, పారిశుధ్యం, తాగునీరు, రవాణా తదితర అన్ని ఏర్పాట్లను సమన్వయంతో నిర్వహించాలని తెలిపారు. కాటారం సబ్ కలెక్టర్ మ యాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మక్కల కొనుగోళ్లను వేగవంతం చేయాలి



**ముద్ర, కోరుట్ల:** మక్కల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ తెలిపారు. గురువారం ఇబ్రహీంపట్నంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మక్కల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ డీఎంతో మాట్లాడి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. నిల్వలో ఉన్న మక్కలను కొనుగోలు చేయడంలో ఆలస్యం జరుగుతోందని తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
24.04.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews
7 తూర్పు తెలంగాణ
వరంగల్, ఖమ్మం, నల్గొండ
Warangal,Khammam,Nalgonda

మైగ్రేన్ నియంత్రణకు..

మైగ్రేన్ నియంత్రణకు... ఒత్తిడి నియంత్రణ స్ట్రెస్ మైగ్రేన్‌కు ప్రధాన కారణం. ధ్యానం, యోగా వంటి పద్ధతులు పాటించండి.



# రెండో రోజుకు చేరిన ఆర్టీసీ సమ్మె

- గొంగిడి సునీత మహేందర్ రెడ్డి సంపూర్ణ మద్దతు..

**ముద్ర, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట డిపో వద్ద ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజూ ఉధృతంగా కొనసాగుతోంది. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు విధులను బహిష్కరించారు. దీంతో జిల్లాలోని బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమ్మె శిబిరాన్ని సందర్శించి యాదగిరిగుట్ట డిపో వద్ద సమ్మె చేస్తున్న కార్మికులతో కలిసి నిరసనలో పాల్గొన్న మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ గొంగిడి సునిత మహేందర్ రెడ్డి, ఆర్టీసీ కార్మిక జేఏసీ చేపట్టిన ఈ సమ్మెకు తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు.



# అంగన్‌వాడీ లో గ్రాడ్యుయేషన్ డే

**ముద్ర, మోత్కూర్:** మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామంలోని 1,2 అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. తల్లి దండ్రులు తమ చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారం, ఆటలు, పాటలు ఏబీసిడి లు నెంబర్స్ నేర్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు చింతల విజయ, సునిత, ఆయా మమత ,చిన్నారుల తల్లి దండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

# మైనారిటీ గురుకులంలో వారోత్సవాలు



**ముద్ర, తుంగతుర్తి :** ఇంటర్ మొదటి సంవత్సరం ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మైనారిటీ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడం విద్యార్థుల అధ్యాపకుల కృషి ఫలితమేనని మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉమా రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించిన మైనారిటీ వారోత్సవాల్లో పాల్గొని అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. అనంతరం విద్యార్థులలో ఉన్న ప్రతిభను గుర్తించేందుకు క్విజ్, వకృత్వ, వ్యాసరచన, పోటీలతో పాటు సంస్కృతి ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించారు. వచ్చే విద్యా సంవత్సరంలో మైనారిటీ విద్యార్థులు అడ్మిషన్లు పొందే విధంగా విద్యార్థులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు.

# ఎమ్మెల్యేకు ఆహ్వానం



**ముద్ర, మోత్కూర్:** ఈనెల 28న భువనగిరిలో జరిగే సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం తొమ్మిదవ వార్షికోత్సవ మహాసభకు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ను సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు .ఈ కార్యక్రమంలో సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షులు ఘనగాని నరసింహా ,రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి లక్ష్మీ నరసింహా రెడ్డి, రఘు వర్ధన్, ఎడ్ల యాదగిరి రెడ్డి, యోగేందర్ నర్సింగ రావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ గా రవీందర్



**ముద్ర, మోత్కూరు:** మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా ఆర్ రవీందర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ ప్రిన్సిపాల్ గా బాధ్యతలు నిర్వహించిన ప్రభ జస్టిస్ ఈనెల 17న డిప్యూటేషన్ పై డిప్యూటీ సెక్రటరీగా ఇంటర్మీడియట్ బోర్డులో నియమితులయ్యి బదిలీపై వెళ్లారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిత్రం యాదగిరి, నార్కట్ పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఎండి ఇస్మాయిల్, సీనియర్ గణిత శాస్త్ర సీనియర్ లెక్చరర్ కోటేష్, మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఏం పరశు రాములు లెక్చరర్లు కే నరసింహారెడ్డి, సిహెచ్ లింగస్వామి, ఎం సతీష్, ఏ హరికృష్ణ, ఎం మల్లికార్జున్, డి మంజుల, కార్యాలయ సిబ్బంది ఎలిమినేటి నాగరాజు, ఎండి జాకీర్ తదితరులు నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్ ను స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.

# కాంగ్రెస్ కుట్ర బట్టబయలు

- హైకోర్టు తీర్పు రేవంత్ ప్రభుత్వానికి చెంపపెట్టు
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన రిపోర్టు చెల్లదని హైకోర్టు ఇచ్చిన తీర్పు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. గురువారం బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన వంద కాంపోనెంట్లలో రెండు పిల్లర్లు కుంగితే రూ. లక్ష కోట్లు కొట్టుకపోయాయంటూ కాంగ్రెస్ చేసిన గోబెల్స్ ప్రచారం హైకోర్టు తీర్పుతో బట్టబయలైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురద చల్లి రాజకీయ లబ్ధి పొందాలనే దురుద్దేశంతో కాంగ్రెస్ ఇలా చేస్తున్నారన్నారు. తెలంగాణ ఉన్నంత కాలం కాళేశ్వరం ప్రాజెక్టు ఉంటుందని, భూమిపై గోదావరి నది పారినంత కాలం ప్రాజెక్టుకు రూపకల్పన చేసిన కేసీఆర్ పేరు నిలిచి ఉంటుందన్నారు. అభాండాలు, అబద్దాలతో దుష్ప్రచారం చేసి, చిల్లర ప్రచారం చేస్తే రాష్ట్ర హైకోర్టు చెంపపెట్టు లాంటి తీర్పును ఇచ్చిందన్నారు. కేసీఆర్ పైన చేసిన కుట్రలు, కుతంత్రాలు కోర్టు తీర్పుతో కూలి పోయాయన్నారు. బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై చేస్తున్న వ్యాఖ్యలు డ్రామాలని కోర్టులో తేలిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహనం ఆత్మస్థైర్యం కోల్పోతున్నారని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు, పార్టీ నాయకులకు ధైర్యం ఉంటే రాజీనామాలు చేయాలని మళ్లీ ఎలక్షన్లకు పోదామన్నారు. బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ పై చిల్లర భాష మాట్లాడడం మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట నరసింహ, మాజీ ఎంపీపీ కేశవపట్నం రమేష్, మాజీ జెడ్పిటిసి బీరు మల్లయ్య, జిల్లా నాయకులు ర్యాకల శ్రీనివాస్, నాయకులు పెంట నితీష్, చెన్న మహేష్, శాగంటి నరసింహ, ఎండి. నయీమ్, గుజ్జ పవన్, అంజద్, శ్రీనివాస్, రత్నపురం పద్మ పాల్గొన్నారు.



# తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ భాస్కరరావు

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల విద్యా ప్రగతి, ప్రవర్తన, హాజరు, ప్రతిభ వంటి అంశాలపై తల్లిదండ్రులతో సమగ్రంగా చర్చించగలమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు అన్నారు. గురువారం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భువనగిరి లో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ను అదనపు కలెక్టర్ సందర్శించారు. ఉపాధ్యాయులు కూడా తల్లిదండ్రుల అభిప్రాయాలను వినడం ద్వారా విద్యార్థి వ్యక్తిగత పరిస్థితులను అర్థం చేసుకుని, బోధన విధానాల్లో అవసరమైన మార్పులు చేయగలరు. ఈ పరస్పర సంబంధం విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, చదువుపై ఆసక్తిని పెరుగుతుందన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు.

# క్షయ వ్యాధిగ్రస్తులకు కిట్లను పంపిణీ



**ముద్ర, యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం క్షయ వ్యాధి గస్థులకు మిత్ర పథకం ద్వారా పోషకాహర కిట్లను ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పంపిణీ చేశారు. ఈ కిట్లలల్లోబియ్యం, పప్పులు, వేరుశనగలు, వంట నూనె చిరుధాన్యాలు ఉంటాయి ఇవి రోగులకు రోగనిరోధక శక్తి పెంచి 6నెలల చికిత్స సమయంలో త్వరగా కొలుకోవడానికి సహాయపడుతాయని ఇవి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం కాచారం గ్రామపంచాయతీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 90 రోజుల కార్యక్రమంలో భాగంగా టిబి ముక్తు భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి టిబి వ్యాధి పరీక్షలు చెస్ట్ ఎక్రే తెముడా పరీక్షలు రక్త పరీక్షలు బిపి పరీక్షలు నిర్వహించారు. ఈ క్యాంపులో 152 మంది రోగులను పరీక్షించి 142 చాతి ఎక్స్ రేలు 40 మందికి రక్త పరీక్షలు తెముడా పరీక్షలు చేశారు. లక్షణాలు ఉంటే యాదగిరిగుట్ట లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెంటనే పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఈ క్యాంపులో టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశాం డి ఎం హెచ్ ఓ మనోహర్, డాక్టర్ వంశీకృష్ణ, మహేష్ శ్రీ ఘన, డాక్టర్ పావని, మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి, భరత్ కౌన్సిలర్ మధు, కాచారం సర్పంచ్ కొండ ఉపేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ బర్మ మౌనిక తదితరులు పాల్గొన్నారు.



# అర్హులందరికి అక్రిడిటేషన్ కార్డులు

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి** అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు వచ్చేలా చూడాల్సిన బాధ్యత జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీపై ఉందని, అర్హులైన జర్నలిస్టులు అందరికీ అక్రిడిటేషన్ కార్డు త్వరలో అందజేస్తామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం తన చాంబర్లో జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. దరఖాస్తు చేయని పాత్రికేయులు ఈనెల 24లోపు దరఖాస్తు చేయాలని కలెక్టర్ సూచించారు. అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు చలసాని శ్రీనివాసరావు, వజ్జె వీరయ్య, షేక్ సైదా, కోల నాగేశ్వరరావు, ఎండి.ఖలీల్ అహ్మద్, డాక్టర్ బంటు కృష్ణ, రెబ్బ విజయ కుమార్, శంకర్ మంచి రవీందర్ శర్మ, బత్తుల మల్లికార్జున్, బుక్క ఉపేందర్ లకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ కు పుష్ప గుచ్చం అందజేసి శాలువ సమర్పించారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు..

- భువనగిరి వ్యవసాయ కమిటీ చైర్‌పర్సన్ రేఖ



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** దళారులని నమ్మి మోసపోవద్దని రైతులకు మద్దతు ధర కలిపిస్తామని భువనగిరి వ్యవసాయ కమిటీ చైర్పర్సన్ రేఖ బాబు రావ్ అన్నారు. గురువారం మండలంలోని బొల్లేపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాని ప్రారంభించారు. ఈ కార్యకమంలో 8వ వార్డ్ మెంబర్ సందెల మహేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కనుకుంట్ల కొండల్, గ్రామశాఖ అధ్యక్షులు ముక్కిడి బాలయ్య, రెడ్డిసంఘం అధ్యక్షులు జిట్టా కృష్ణ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పినపురాల సమయ్య,కుర్మా సంఘం అధ్యక్షులు మాదా సత్యనారాయణ, సరికొండ లక్ష్మయ్య, ఉదారి శంకరయ్య, గుండు కృష్ణ, మద్ది బాల రెడ్డి, కొత్తపల్లి శేఖర్, గండికోట యాదయ్య, గండికోట కృష్ణయ్య, కనుకుంట్ల వెంకటేష్ పాల్గొన్నారు.

# చేనేత హక్కుల సాధన సభ

**ముద్ర, మోత్కూర్:** చౌటుప్పల్ పద్మశాలి నగర్ లోని శ్రీ పద్మ వంశీ ఫంక్షన్ హాల్ లో జరిగే చేనేత కార్మిక హక్కుల సాధన సభను జయప్రదం చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతి కుమార్ అన్నారు. గురువారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మోత్కూర్ లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం మేనేజర్ వేముల నర్సయ్య జిల్లా ఉపాధ్యక్షులు పోచం కన్నయ్య రాష్ట్ర కమిటీ సభ్యులు పసునూరి యాదయ్య, బాలరాజు, తాటి లక్ష్మణ్ పసునూరి సురేష్ పాల్గొన్నారు.

# శ్రీ వేంకటేశ్వర స్వామివారికి తిరుప్పావడ సేవ



**ముద్ర ప్రతినిధి యాదాద్రి భువనగిరి :** స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో గురువారం ఘనంగా తిరుప్పావడ సేవ చేశారు. సకల ప్రాణికోటికి ఆహార కొరత లేకుండా ఉండడం కోసం స్వామివారికి జరిపే అన్నకూటోత్సవాన్నే తిరుప్పావడ అంటారని అర్చక స్వాములు తెలిపారు. ప్రతి గురువారం నైవేద్య సమయంలో తిరుప్పావడ జరుగుతుందని అప్పుడు సుమారు 450 కిలోల శ్రీవారికి నైవేద్యం చేస్తారు. వేదమంత్రోచ్చారణలతో అర్చించి కర్పూర మంగళ హారతులు సమర్పించారు. ఆలయం లో సుప్రభాత సేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువు తీరినట్టి గోపృష్ట దర్శనాన్ని భక్తులకు కల్పించారు.

# ముగిసిన దరఖాస్తు ప్రక్రియ

**ముద్ర, మోత్కూర్:** మోత్కూర్ పురపాలక సంఘం పరిధిలో కోఆప్షన్ సభ్యుల ఎంపిక కు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ గురువారం సాయంత్రం ఐదు గంటలకు ముగిసిందని మున్సిపల్ కమిషనర్ కే సతీష్ కుమార్ తెలిపారు. ప్రత్యేక పరిజ్ఞానం, అనుభవం ప్రకారం 11 దరఖాస్తులు, మైనారిటీ కేటగిరి కింద 5 దరఖాస్తులు వచ్చాయని ఆయన అన్నారు. ఇట్టి దరఖాస్తులను నీటి నుండి ఆదివారం వరకు పరిశీలించి అర్హుల జాబితాను సోమవారం ప్రకటిస్తామని తదుపరి కౌన్సిల్ సమావేశం తీర్మానం మేరకు కో ఆప్షన్ సభ్యుల ఎంపిక ఉంటుందని కౌన్సిల్ ప్రత్యేక సమావేశం తేదీని త్వరలో ప్రకటిస్తామని మున్సిపల్ కమిషనర్ కే సతీష్ కుమార్ తెలిపారు.

# బియ్యం సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలి

- అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** మిల్లర్లు బియ్యం సరఫరాలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సూచించారు. గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఛాంబర్ లో,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంగా రెడ్డితో కలిసి ఎఫ్ సి ఐ అఫీషియల్స్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో.. రైస్ మిల్లులలో సిఎంఆర్ బియ్యం డెలివరీ విషయంలో చిన్న చిన్న కారణాల వల్ల బియ్యం రిజెక్షన్ అవుతున్నాయని, దీనివలన మిల్లర్లు చాలా నష్టపోతున్నారని, బియ్యం పెట్టడానికి కూడా ముందుకు రావడం లేదనే దానిపై చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బియ్యం రిజెక్షన్ కావడానికి గల కారణాలు ఎఫ్ సి ఐ అధికారులతో చర్చించడం జరిగిందని, రైస్ మిల్లర్లు బియ్యం డెలివరీ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలుపగా, ఎఫ్ సీఐ వారు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి రోజారాణి, జిల్లా మేనేజర్ పౌర సరఫరాలు హరికృష్ణ, ఎఫ్ సి ఐ అధికారులు రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
24.04.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**మైగ్రేన్ నియంత్రణకు... సరైన హైడ్రేషన్**

నీరు తక్కువగా తాగితే తలనొప్పి పెరుగుతుంది. రోజుకు కనీసం 2–3 లీటర్లు నీరు తాగండి.





## జనగణనలో తహసీల్దార్లు చిత్తశుద్ధితో పని చేయాలి

- **కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశం**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

జనగణనలో తహసీల్దార్లు చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో గూగుల్ మీట్ నిర్వహించారు. జిల్లాలో చెరువులు అన్యాక్రాంతం కాకుండా డ్రై ల్యాండ్-వెట్ ల్యాండ్ సర్వే నిర్వహణలో ముందుచూపుతో వ్యవహరించాలని సూచించారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రజలకు ప్రయాణంలో అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వచ్చే వానాకాలం పంటలకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేలా బఫర్ స్టాక్ సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. 525 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా, 11 కేంద్రాల్లో 143 మంది రైతుల నుంచి 887 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. గన్నీ బ్యాగులకు సంబంధించి ఎటువంటి కొరత లేదన్నారు. గ్యాస్‌ను ప్రజల అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉంచాలని సూచించారు. పక్కా ప్రణాళికతో ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సాదా బైనామా, భూభారతి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని తహసీల్దార్లకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు జోజి, డీఆర్డీఓ శ్రీనివాసరావు, నిత్యానంద్, జగదీష్, యాదయ్య, ప్రకాష్ రావు, సురేష్, వెంకటస్వామి, ఆర్టీసీ అధికారి సురేఖ, దేవకుమార్, సంబంధిత తహసీల్దార్లు పాల్గొన్నారు.

**భగీరథ మహర్షికి కలెక్టర్ నివాళులు..**

భగీరథ మహర్షి త్యాగం, పట్టుదల ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తాయని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఎఫ్ఓ జోజి, డీపీఓ యాదయ్య, డీఆర్డీఓ శ్రీనివాసరావు, ఏవో యూనస్, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి గంగా కిషన్, సంఘ జిల్లా అధ్యక్షుడు సాయిలు, నగేష్, సగర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## అన్యాయాన్ని ప్రశ్నించేలా అడ్వకేట్లు పని చేయాలి

- **బాధితుల పక్షాన న్యాయవాదులు నిలబడాలి**
- **సిద్దిపేట జిల్లా లీగల్ ఎయిడ్ కౌన్సిల్ డిప్యూటీ చీఫ్ శ్రీకర్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

అన్యాయాన్ని ప్రశ్నించేలా, బాధితులను కాపాడే విధంగా అడ్వకేట్లు పని చేయాలని సిద్దిపేట జిల్లా లీగల్ ఎయిడ్ కౌన్సిల్ డిప్యూటీ చీఫ్ శ్రీకర్ రెడ్డి సూచించారు. సిద్దిపేటలోని వినాయక లా కళాశాలకు చెందిన లా విద్యార్థులు ప్రాజెక్ట్‌లో భాగంగా గురువారం సిద్దిపేట జిల్లా కోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా కోర్టులో జరుగుతున్న న్యాయ విచారణలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీకర్ రెడ్డి లా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కోర్టును సందర్శించడం మాత్రమే కాకుండా, అక్కడ జరుగుతున్న విచారణలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. అడ్వకేట్లు ఎల్లప్పుడూ బాధితులకు న్యాయం జరిగే విధంగా ఆలోచన విధానం కలిగి ఉండాలని అన్నారు. న్యాయ శాస్త్రం చదవడం అదృష్టంగా భావించాలన్నారు. సమాజంలో చెడును నిర్మూలించడంలో న్యాయవాదుల పాత్ర కీలకమని తెలిపారు. కొత్తగా ప్రవేశిస్తున్న న్యాయవాదులు డబ్బులపై శ్రద్ధ పెట్టకుండా, న్యాయం గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్లు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## డీఎఫ్ఓ జోజి ఐఎఫ్ఎస్‌కు ఎంపిక

- **అభినందించిన కలెక్టర్ ప్రతిమా సింగ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



మెదక్ డీఎఫ్ఓగా పని చేస్తున్న డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ జోజి 2019 బ్యాచ్ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్‌ను జోజి మర్యాదపూర్వకంగా కలవగా, ఆమె అభినందించారు. అటవీ శాఖలో అలుపెరగని, క్రమశిక్షణ గల పనితీరుకు జోజి నిదర్శనమని కలెక్టర్ అభివర్ణించారు. జోజి మాట్లాడుతూ.. ఉద్యోగ విధి నిర్వహణలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో 1993లో ఎఫ్ఆర్ఓగా విధుల్లో చేరి, 2008లో అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా పదోన్నతి పొందినట్లు తెలిపారు. అనంతరం 2017లో డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా పదోన్నతి పొందినట్లు పేర్కొన్నారు. అటవీ శాఖలో అంచెలంచెలుగా ఉన్నత పదవులు అధిరోహిస్తూ 2019 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు ఎంపికైన సందర్భంగా ఉన్నతాధికారులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు జిల్లా అధికారులు జోజిని అభినందించారు.

## 2వ రోజు ఆర్టీసీ సమ్మె కొనసాగింపు

- **సంఘీభావం తెలిపిన బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం**
- **బీజేపీ, సీపీఎం నేతల అరెస్టులు**
- **పోలీస్ పహారాతో నడిచిన బస్సులు**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ జిల్లాలో ఆర్టీసీ కార్మికుల సమ్మె రెండో రోజు కొనసాగింది. ఉదయం డిపోల వద్ద బస్సులను అడ్డుకుంటారన్న సమాచారంతో కొందరు కార్మికులను ముందస్తుగా అరెస్టు చేశారు. పోలీసు బందోబస్త్ మధ్య సంస్థ బస్సులతో పాటు అద్దె బస్సులను నడిపించారు. తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లను నియమించారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా బస్సు సర్వీసులు నడుస్తున్నట్లు మెదక్ డీఎం సురేఖ తెలిపారు. ఇన్‌స్పెక్టర్లు మహేష్, జార్జ్, రేణుక రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేశారు. కార్మికులతో కలిసి నిరసన తెలిపేందుకు యత్నించిన బీజేపీ, సీపీఎం నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



**ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి : మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి**

ఆర్టీసీ కార్మికుల సమ్మె పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడి, తక్షణమే చర్చలు ప్రారంభించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎం. పద్మా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ డిమాండ్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మెదక్ ఆర్టీసీ డిపో పక్కన గుల్షన్ క్లబ్ వద్ద కొనసాగుతున్న కార్మికుల రెండో రోజు సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. ఆర్టీసీ కార్మికులతో కలిసి ర్యాలీగా డిపో వరకు వెళ్లారు. కాంగ్రెస్ హామీలు అన్నీ గంగలో కలిసిపోయాయని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాకుండా తూతూమంత్రంగా పరిపాలన సాగుతోందని, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు టెంట్లు వేసుకుని సామరస్యంగా సమ్మె కొనసాగిస్తున్నప్పటికీ, మెదక్ ప్రాంతంలో పోలీసులు కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. మహిళా కార్మికులను కూడా పట్టించుకోకుండా అరెస్టు చేసి పాపన్నపేట పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని ఖండించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఎం. లావణ్య రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, న్యాయవాది జీవన్ రావు, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు సోహెల్, జుబేర్, దీపక్ కుమార్, నాయకులు మార్గం ఆంజనేయులు, విష్ణువర్ధన్ రెడ్డి, గడ్డమీద కృష్ణ గౌడ్, లింగారెడ్డి, సురేందర్ గౌడ్, వెంకటేశం, కాశీనాథ్ రావు, అంజిరెడ్డి, వేణు, సాయికుమార్, రంజిత్, స్వామి నాయక్, యంబిపూర్ మహేష్ చంద్ పాషా, ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

**బీజేపీ సంఘీభావం..**

సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. గుల్షన్ క్లబ్ నుండి మెదక్ బస్టాండ్ వరకు ర్యాలీగా వస్తున్న కార్మికులు, బీజేపీ నాయకులను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. దీంతో బీజేపీ నాయకులు, పోలీసుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, యూనియన్ పునరుద్ధరించాలని, 2021, 2025 పీఆర్సీలను ప్రకటిస్తూ మిగతా డిమాండ్లను నెరవేర్చాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, జిల్లా నాయకుడు గడ్డం కాశీనాథ్ డిమాండ్ చేశారు.



**సీపీఎం పూర్తి మద్దతు...**

ఆర్టీసీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును సీపీఎం మెదక్ జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ ఖండించారు. కార్మికుల ర్యాలీలో పాల్గొని సమ్మెకు మద్దతు ఇవ్వడానికి వెళ్లిన సీపీఎం జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశంను పోలీసులు అరెస్టు చేసి వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ, ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయాలని కార్మికులు సమ్మె చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా విలీనం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. 32 డిమాండ్లను పరిష్కరించాలని కోరడం అన్యాయం కాదని పేర్కొన్నారు. కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, పార్టీ నాయకుల పట్ల ప్రభుత్వం ఉగ్రవాదుల్లా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

## ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

- **సీఐటీయూ డిమాండ్**

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**



ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, ఉద్యోగులకు బకాయి ఉన్న పీఆర్సీని వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం సిద్దిపేట బస్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతు తెలుపుతూ ఆయన మాట్లాడారు. ఆర్టీసీ కార్మికుల 32 డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. మూడు ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం హామీ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. సమస్యల పరిష్కారానికి కమిటీ వేస్తామని చెప్పడం సరిపోదని, ఇవి చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినప్పటికీ, తెలంగాణలో ఎందుకు చేయరని ప్రశ్నించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న మూడు పీఆర్సీలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్‌లపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని కోరారు. పొన్నం చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని విమర్శించారు. "కేసీఆర్ చెప్పిన మాటలనే మీరు పునరావృతం చేస్తున్నారు. అయితే మీకు, వారికి తేడా ఏమిటి?" అని ప్రశ్నించారు. కార్మికుల సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నాయని తెలిపారు. సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెను ప్రజా ఉద్యమంగా మలుస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గోపాలస్వామి, చొప్పరి రవి కుమార్‌తో పాటు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాల క్యాంటీన్‌ను సందర్శించిన చైర్ పర్సన్



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో గల ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్ ను మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజు సందర్శించారు. ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు సూచనతో క్యాంటీన్ నిర్వహణ గురించి తెలుసుకున్నారు. రుచికరమైన నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆలాగే యంగ్ స్టార్ ఫౌండేషన్ సందర్శించారు. వెంట మెప్మా సునీత, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ నితిన్ కుమార్ కాబ్రా తదితరులున్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలే లక్ష్యం

- **తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



రైతులకు నమ్మకమైన, అధిక దిగుబడిని ఇచ్చే నాణ్యమైన విత్తనాలను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. గురువారం మెదక్ జిల్లా ఐడీఓసీ సమావేశ మందిరంలో విత్తన డీలర్లు, సహకార సంఘాల ప్రతినిధులు, ఎఫ్‌పీఓలు, ఏఆర్ఎస్‌కే కేంద్రాల ప్రతినిధులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ నేరుగా రైతులతో అనుసంధానమై, వారి ద్వారానే విత్తన ఉత్పత్తి చేపడుతోందని చైర్మన్ తెలిపారు. సేకరించిన విత్తనాలను కఠినమైన ప్రమాణ పరీక్షల అనంతరం ధృవీకరించి మాత్రమే రైతులకు అందజేస్తున్నామన్నారు. దీనివల్ల రైతులకు నాణ్యతపై పూర్తి భరోసా ఉంటుందని వివరించారు.

**- వానాకాలం సీజన్‌కు విత్తనాలు సిద్ధం..**

ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో విత్తనాల కొరత లేదని ఆయన స్పష్టం చేశారు. పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము విత్తనాలను కూడా సకాలంలో రైతులకు అందజేస్తామని పేర్కొన్నారు. మెదక్ జిల్లాలో ఈ సీజన్‌లో సుమారు 3.20 లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతుందని అంచనా వేస్తున్నామని, అందుకు 82 వేల క్వింటాళ్ల విత్తనం అవసరమని తెలిపారు. ఇందులో కనీసం 40 వేల క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం ద్వారా సరఫరా చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే నూతన విత్తన చట్టం ద్వారా రైతుల హక్కులతో పాటు డీలర్ల ప్రయోజనాలను కూడా ప్రభుత్వం కాపాడుతుందని అన్నారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ విత్తనాలను రైతులు కొనుగోలు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, విత్తన సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, డీసీఓ కరుణాకర్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పి. ప్రభాకర్ రెడ్డి, ఏడీఏలు, ఎంఏఓలు, విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు, విత్తన డీలర్లు, ఎఫ్‌పీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మే 5న ధర్నాను విజయవంతం చేయాలి

- **ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్ పిలుపు**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మే 5న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం ఎస్టీయూ మెదక్ జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశం ఎస్టీయూ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ గౌడ్ మాట్లాడుతూ, టీజీఈజేఏసీ పిలుపు మేరకు రెండో పీఆర్సీ అమలు, ఐదు డీఏల విడుదల, పెండింగ్ బిల్లుల చెల్లింపు, సీపీఎస్ రద్దు కోసం నిర్వహించే ఉద్యోగ, ఉపాధ్యాయ ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. నూతనంగా ఏర్పాటు చేసే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ప్రతి కాంప్లెక్స్‌కు ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, మెదక్ పట్టణ అధ్యక్షుడు దిలీప్ కుమార్, ప్రధాన కార్యదర్శి రత్నాకర్, పాపన్నపేట అధ్యక్షుడు ఎల్లం, ప్రధాన కార్యదర్శి బాలమల్లేష్, కొల్చారం అధ్యక్షుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మైగ్రేన్ నియంత్రణకు...
ట్రిగర్ ఫుడ్స్ దూరం

చాక్లెట్, ప్రాసెస్ చేసిన ఫుడ్స్ కొందరికి సమస్య. మీకు ట్రిగర్ అయ్యే ఆహారాలను గుర్తించండి.



# గ్లోబల్ సెంటర్ గా తెలంగాణ

- ప్రెసిషన్ ఇంజనీరింగ్ పరిశ్రమలకు ప్రత్యేక ఇండస్ట్రియల్ పార్కులు
- మంత్రి శ్రీధర్ బాబు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



తెలంగాణను కేవలం తయారీ కేంద్రంగా మాత్రమే కాకుండా 'గ్లోబల్ ఇంజనీరింగ్ ఇన్నోవేషన్ సెంటర్'గా తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. తయారీ రంగంలో 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తమయ్యేలా ప్రెసిషన్ ఇంజనీరింగ్ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఇండస్ట్రియల్ పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా ములుగు మండలం తునికి బొల్లారం టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్ లోని 'ఆజాద్ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్'లో గురువారం 7,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన 'ది ఎక్స్ క్లూజివ్ లీన్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఫర్ బేకర్ హ్యూస్'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బేకర్ హ్యూస్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తమ 'మేక్ ఇన్ ఇండియా' ప్రాజెక్టు కోసం హైదరాబాద్‌ను ఎంచుకోవడం తెలంగాణ పారిశ్రామిక ప్రగతికి నిదర్శనమని తెలిపారు. ఒకప్పుడు రక్షణ పరిశోధన సంస్థలు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు మాత్రమే నిలయమైన హైదరాబాద్ నేడు ప్రైవేట్ రంగంలోనూ ప్రెసిషన్ ఇంజనీరింగ్ పరిశ్రమలకు గమ్యస్థానంగా మారిందన్నారు. 1500కు పైగా ఎంఎస్ఎంఈలతో హై ప్రెసిషన్ మాన్యూఫ్యాక్చరింగ్‌లోనూ గ్లోబల్ హబ్ గా ఎదుగుతోందన్నారు. లాక్హీడ్ మార్టిన్, బోయింగ్, జీఈ ఏవియేషన్, సాఫ్రాన్, ఎయిర్‌బస్, హనీవెల్ లాంటి అంతర్జాతీయ దిగ్గజాలు సైతం తమ కార్యకలాపాలను విస్తరించేందుకు హైదరాబాద్ ను ఎంచుకోవడానికి ఇక్కడి ఎకో సిస్టం కారణమన్నారు. ఆ దిశగా అప్పట్లో గత కాంగ్రెస్ ప్రభుత్వాలు వేసిన బలమైన పునాదులు... ఇప్పుడు తెలంగాణను పారిశ్రామికాభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా మార్చాయన్నారు. మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో జాతీయ భద్రత కోసం అత్యాధునిక సాంకేతికతను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా ప్రోత్సహిస్తామని భరోసా ఇచ్చారు. కొత్తగా పరిశ్రమలను ఏర్పాటు చేసి... రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బేకర్ హ్యూస్ ప్రతినిధులు డేవిడ్ మర్రానీ, స్టీఫెన్ హిన్సన్, మార్సెల్లో బారియాని, రోసానో చియెల్లి, మాసిమిలియానో తుర్సీ, మౌరో బ్రాకో, విశాల్ ముర్గుడ్కర్, లియో డి ఫిలిప్పో, ఆజాద్ ఇంజనీరింగ్ చైర్మన్, సీఈవో రాకేష్ చోప్దార్, టీజీఐఐసీ ఎండీ శశాంక పాల్గొన్నారు.



# జేఎన్టీయూలో రాజకీయ జోక్యం

- విద్యార్థి సంఘాల నిరసన

**ముద్ర, కూకట్‌పల్లి:**

జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం లో రాజకీయ నాయకుల జోక్యం పెరుగుతోందని విద్యార్థి సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం యూనివర్సిటీ ఆవరణలో స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం, బంజార విద్యార్థి సంఘం, లంబాడీల ఐక్య వేదిక, బీఆర్ఎస్వి నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంపై కనీస అవగాహన లేని బీజేవైఎం నాయకులు కొంతమంది క్యాంపస్‌లోకి చొరబడి విద్యార్థుల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. జూనియర్, సీనియర్ విద్యార్థుల మధ్య జరిగిన చిన్నపాటి వివాదాన్ని పెద్దదిగా చేసి, పోలీసులపై ఒత్తిడి తెచ్చి బీద విద్యార్థులపై కేసులు పెట్టించారని నేతలు మండిపడ్డారు. ఫిర్యాదులు వెనక్కి తీసుకున్నా, బీజేపీ నాయకుల ఫోన్ కాల్స్ ఒత్తిడితో దళిత, గిరిజన విద్యార్థులను వసతి గృహాల నుంచి దూరం చేస్తూ వారి చదువులను నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జేఎన్టీయూను హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం లాగా మార్చి, రోహిత్ వేముల తరహా పరిస్థితులు సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు. బయటి వ్యక్తుల ప్రలోభాలకు లోనై విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాజకీయ స్వార్థం కోసం విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని, యూనివర్సిటీ ప్రతిష్టను కాపాడాలని విద్యార్థి నేతలు హెచ్చరించారు.



# ప్రజలకు ఓటు ప్రాముఖ్యతను వివరించాలి

- జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్


**ముద్ర, మల్కాజిగిరి:**

ప్రజలకు ఓటు ప్రాముఖ్యతను వివరించాలని జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో గురువారం ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ హాజరై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సిబ్బందిని ముందుగా ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని పేర్కొన్నారు. అన్ని విభాగాల సిబ్బంది తమ ఓటును 2025 ఓటరు జాబితాకు తప్పనిసరిగా మ్యాపింగ్ చేయించుకోవాలని సూచించారు. లేనిచో రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమాన్ని ఏప్రిల్ 25 నుంచి ప్రజల్లో విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో కూడా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ప్రచార మాధ్యమాలు. పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా ప్రజలకు సమాచారం అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఈఆర్ఓ, ఏఈఆర్ఓ దయానంద్, సూపర్వైజర్ అధికారులు చింతా శ్రీనివాస్, నిర్మల, శ్రీరాములు, శ్రవణ్, బీఎల్ఓలు గురుభూషణ్, అబ్దుల్, నర్సింహారావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీలో ఆర్టీసీ బస్సులన్నీ ఏసీ సర్వీసులు

- సీఎం చంద్రబాబు కీలక ప్రకటన

**ముద్ర, డెస్క్:**



ఏపీలో ఆర్టీసీ బస్సులన్నింటినీ ఏసీ సర్వీసులుగా మార్చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటన ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం ఆర్టీసీలో డీజిల్ బస్సులు 99 శాతం నడుస్తున్నాయి. గురువారం అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రెవెన్యూ ఇంగాట్ వేపర్స్ పరిశ్రమ శంకుస్థాపన అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగంలో పలు ముఖ్యాంశాలను ప్రస్తావించారు. భవిష్యత్తులో ఆర్టీసీలో అన్ని బస్సులను ఏసీ సర్వీసులుగా మార్చనున్నట్లు ప్రకటించారు. డబ్బున్నవారే కాదు సామాన్య ప్రయాణికులు, పేదలు కూడా ఏసీ బస్సుల్లోనే తిరగాలనేది తన స్వప్నమని వెల్లడించారు. త్వరలో 1050 ఎలక్ట్రిక్ బస్సులు తీసుకువస్తున్నామని చెప్పారు. వెయ్యికి పైగా చార్జింగ్ స్టేషన్లు నిర్మిస్తున్నామని వివరించారు. దశలవారీగా విద్యుత్ సర్వీసులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం చాలా కాలంగా ఆలోచిస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం కూడా విద్యుత్ బస్సులను ప్రోత్సహిస్తోందన్నారు. దీంతో ఆర్టీసీని పూర్తిగా సంస్కరించి అన్ని సర్వీసులను ఏసీ సర్వీసులుగా మార్చాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా పెట్టుబడుల ఆకర్షించడంలో అనకాపల్లి ముందంజలో ఉందని, ఆ జిల్లాను మరో రంగారెడ్డి జిల్లాగా తయారు చేస్తామని ప్రకటించారు. ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రాలో రంగారెడ్డి జిల్లా చాలా వెనుకబడి ఉండేదని, కానీ తాను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో ఇప్పుడు ఆ జిల్లానే సంపద కలిగిన ప్రాంతంగా తయారైందని తెలిపారు. ఇప్పుడు అనకాపల్లి జిల్లా సైతం భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోందన్నారు. దేశంలోనే అగ్రస్థానానికి చేరుకుందని ప్రకటించారు. కాగా రెండేళ్లలో రెవెన్యూ ఇంగాట్ వేపర్ ప్లాంట్ నిర్మించేలా సంస్థ పనిచేస్తుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

# హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:**



జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద ఈ నెల 12న గొల్ల వీరేంద్ర(34) హత్య కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు గద్వాల డీఎస్పీ వై.మొగులయ్య తెలిపారు. గురువారం గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడిమెట్ల గ్రామానికి చెందిన గొల్ల వీరేంద్ర జీవనోపాధి కోసం గద్వాల పట్టణానికి వచ్చి ఖాళీ సీసాలు, ప్లాస్టిక్ వస్తువులు సేకరించి విక్రయించి జీవనం సాగించేవాడు. మహబూబ్ నగర్ కు చెందిన కుప్ప గిరి శ్రీనివాసులు, కడప జిల్లాకు చెందిన సిద్దయ్య అనే ఇద్దరు కూడా ఖాళీ సీసాలు, చెత్తను సేకరించి విక్రయిస్తూ జీవనం కొనసాగించేవారు. ఈ క్రమంలో గిరి శ్రీనివాసులు, సిద్దయ్య చెత్త సేకరించడం వల్ల తన ఆదాయం తగ్గుతుందని వీరేంద్ర వారితో తరచూ ఘర్షణకు దిగేవాడు. ఈ క్రమంలో ఈ నెల 11న రాత్రి ఓ వైన్ షాప్ వద్ద వీరేంద్ర గొడవపడి తిట్టాడు. దీంతో కక్ష పెంచుకున్న నిందితులు పథకం ప్రకారం వీరేంద్రను హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 12న ముగ్గురు కలిసి మద్యం సేవించేందుకు స్వాగత్ లాడ్జి సమీపంలో గల రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద నిర్మానుష్య ప్రదేశానికి వెళ్లారు. అక్కడ మద్యం సేవిస్తున్న క్రమంలో వీరేంద్రతో నిందితులు ఘర్షణకు దిగి దాడి చేసి పెద్ద రాయితో వీరేంద్ర ముఖం, తలపై కొట్టడంతో అక్కడే మృతి చెందాడు. అనంతరం నిందితులు పరారయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గద్వాల సీఐ టి.శ్రీను అక్కడి చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు. మృతుడి కుడి చేతిపై ఉన్న 'అనిత' అనే పచ్చబొట్టు ఆధారంగా గద్వాల పోలీసులు ప్రాథమిక దర్యాప్తు మొదలు పెట్టారు. సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి కుప్పగిరి శ్రీనివాసులు, సిద్దయ్యలను గురువారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో గద్వాల సీఐ టి.శ్రీను, ఎస్ఐ కళ్యాణ్ రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# కేసీఆర్ చేతుల్లోనే తెలంగాణ భవిష్యత్తు

- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి
- రేవంత్ రెడ్డి కేసీఆర్ ను కలలో తలుచుకొని భయపడుతున్నారు
- కేటీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు వేస్తుంది

**ముద్ర, జగిత్యాల:**


రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి కేవలం మాజీ సీఎం కేసీఆర్ చేతుల్లోనే ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి కళ్లు మూసుకున్నా ఆయన కలలో కేసీఆర్ వస్తున్నారన్నారు. ఆ భయంతోనే సీఎం అభివృద్ధిని విస్మరిస్తున్నారని జీవన్ రెడ్డి సెటైర్లు వేశారు. గురువారం జగిత్యాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. సిరిసిల్ల నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు మాజీ మంత్రి కేటీఆర్ ఎంతో కృషి చేశారని ఆయన కొనియాడారు. విద్యా, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనలో కేటీఆర్ చేసిన పోరాటాన్ని రాష్ట్ర ప్రజలెవరూ విస్మరించలేదని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలోనే మళ్లీ తెలంగాణ ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు వేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో రాష్ట్రంలో బలహీన వర్గాలు విద్యకు దూరమవుతున్నారని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. ఇప్పటికైనా రాజకీయ కక్షలు పక్కన పెట్టి, ప్రజల ప్రయోజనాల దృష్ట్యా మేడిగడ్డను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# జగిత్యాల ఆసుపత్రిలో కలకలం..

- చికిత్స పొందుతూ రోగి మృతి
- మృత దేహంపై బంగారు ఆభరణాలు మాయం
- ఆసుపత్రి సిబ్బందిపై బంధువుల ఆగ్రహం

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ క్రిటికల్ కేర్ ఆసుపత్రిలో మృతి చెందిన ఓ రోగి బంగారు ఆభరణాలు కనిపించడం లేదని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించడం కలకలం రేపింది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా కోడిమ్యాల మండలం నాచుపల్లికి చెందిన ఓ మహిళ ఆరోగ్యం విషమించడంతో గురువారం పట్టణంలోని క్రిటికల్ కేర్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. కాగా మృతదేహంపై బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి సిబ్బందిపై అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. కాగా పోలీసులు ఆసుపత్రి సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తూ, ఆభరణాల మాయం పై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# అండర్-17 క్రికెట్ జట్టుకు శ్రీ చైత్ర రెడ్డి ఎంపిక

**ముద్ర, తాండూరు :**



తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ జట్టుకు శ్రీ చైత్ర రెడ్డి ఎంపికయ్యారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పెద్దేముల్ మండలం గిర్మాపూర్ గ్రామానికి చెందిన రైతు పటేల్ రాంరెడ్డి కూతురు శ్రీ చైతన్య రెడ్డి తాండూర్ లోని మల్లారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఆమె విద్యాభ్యాసం చేయడంతో పాటు జనని క్రికెట్ అకాడమీలో మూడేళ్లుగా శిక్షణ పొందుతోంది. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ అండర్ 17 క్రికెట్ పోటీలకు వికారాబాద్ జిల్లా తరపున ప్రాతినిథ్యం హించింది. రంగారెడ్డి జిల్లా జట్టుతో ఇటీవల జరిగిన క్రికెట్ పోటీలో ప్రతిభను కనబరిచి స్థానం సంపాదించింది. అనంతరం ఈ నెల 19 నుంచి 22 వరకు రంగారెడ్డి జిల్లా గుర్రంగూడా లోని జీఎన్ఆర్ గ్రౌండ్స్ లో జరిగిన ఎస్ జీ ఎఫ్ అండర్ 17 బాలికల క్రికెట్ తరపున ఆడింది. సెమి ఫైనల్ లో రంగారెడ్డి జిల్లా జట్టు వరంగల్ పై విజయం సాధించడంలో శ్రీ చైతన్య రెడ్డి కీలక పాత్ర పోషించింది. అలాగే ఫైనల్ లో రంగారెడ్డి జట్టు హైదరాబాద్ జట్టు పై ఘన విజయం సాధించడంలో శ్రీ చైత్ర రెడ్డి ఓపెనర్ బ్యాట్స్మెన్ గానే కాకుండా పీక్ ఓవర్స్ లో ఆఫ్ స్పిన్ తో రాణించి తన ప్రతిభను చాటింది. ఈ నేపథ్యంలో ఆల్ రౌండర్ గా మంచి ప్రదర్శనతో జాతీయ స్థాయిలో క్రికెట్ పోటీల కు సిద్ధమైన రాష్ట్ర అండర్ 17 క్రికెట్ జట్టుకు శ్రీ చైతన్య రెడ్డి ఎంపికైంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీఈఓ సుసిందర్ రావు, జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రెటరీ రామచంద్రుడు, రాష్ట్ర పీఈటీ సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, రవికుమార్ ,సాబెర్ తదితరులు గెలిచిన జిల్లా జట్టును అభినందించారు. సెమీ ఫైనల్ జట్టులో కీలక పాత్ర పోషించిన శ్రీ చైత్ర రెడ్డిని వారు అభినందించారు. రాష్ట్ర జట్టు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ చైతన్య రెడ్డి జాతీయ జట్టుకు సైతం ఎంపిక కావాలని వారు ఆకాంక్షించారు. ఈ నెల 29 నుంచి చండీఘర్ లో జరిగే జాతీయ స్థాయి అండర్ 17 స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రికెట్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున శ్రీ చైత్ర రెడ్డి పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ చైత్ర రెడ్డి మాట్లాడుతూ తాను భారత జట్టుకు ప్రాతినిథ్య వహించాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. రంగారెడ్డి జిల్లా జట్టు విజయానికి మార్గ నిర్దేశం కోసం కృషి చేసిన జిల్లా సెక్రెటరీ రామచంద్రుడు, పీడీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి తదితరులకు శ్రీ చైతన్య రెడ్డి రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
24.04.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews




**మైగ్రేన్ నియంత్రణకు**

రెగ్యులర్ వ్యాయామం శరీరానికి కదలిక లేకపోతే సమస్యలు పెరుగుతాయి. రోజూ 20–30 నిమిషాలు వ్యాయామం చేయండి.





## అగ్రరాజ్యాన్ని వీడాలనుకుంటున్న భారతీయులు

- **కారణం ట్రంప్ ఎఫెక్ట్..!**

ముద్ర, డెస్క్:

ఒకప్పుడు భారతదేశం నుంచి మేధావులంతా అమెరికాకు తరలి వెళ్లేవారు. కానీ ఇప్పుడు పరిస్థితులు తిరగబడుతున్నాయి. ఒకప్పుడు భారతీయులకు విపరీతమైన డాలర్ డ్రీమ్ (అమెరికా కల) ఉండేది. అంటే ప్రతి భారతీయ విద్యార్థికి, నిపుణుడికి ఒక అమెరికా వెళ్లాలనే లక్ష్యం ఉండేది. కానీ అది మారుతుంది.. అది కూడా వేగంగా.. 'కార్నెగీ ఎండోమెంట్ సర్వే' వెల్లడించిన ఈ గణాంకాలు చూస్తుంటే, అగ్రరాజ్యంలో పరిస్థితులు ఎంత వేగంగా మారుతున్నాయో అర్థం అవుతోంది. డాలర్ల కంటే ఆత్మగౌరవం, భద్రతే ముఖ్యమని భారతీయులు భావిస్తున్నారు. అగ్రరాజ్యం అమెరికాలో స్థిరపడటం అనేది ఒక సామాజిక హోదాగా భావించే రోజులు రాను రాను వేగంగా పోతున్నాయి. తాజాగా వెలువడిన ఒక సర్వే ప్రకారం ప్రతి 10 మంది భారతీయుల్లో నలుగురు (40%) అమెరికాను వీడి మళ్లీ భారతదేశానికి లేదంటే ఇతర దేశాలకు వెళ్లాలని యోచిస్తున్నారట. విద్వేషపూరిత దాడులు, వీసా అనిశ్చితి, రాజకీయ మార్పులు కలిసి ఇండోఅమెరికన్ కమ్యూనిటీలో ఒక విధమైన అభద్రతా భావాన్ని కలిగించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న తీరుపై 71 శాతం మంది భారతీయులు అసంతృప్తితో ఉన్నట్లు సర్వే స్పష్టం చేసింది. 'అమెరికా అమెరికన్ల కోసమే' అనే నినాదం భారతీయులను మానసికంగా దెబ్బతీసింది. దశాబ్దాలుగా అక్కడ ఉండి, ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలిచిన ఐటీ నిపుణులు కూడా తాము 'పరాయివాళ్లం' అనే ముద్రతో బాధపడుతున్నారు. సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్లు హెచ్1బీ హోల్డర్లను వేధించడం, వారి ఇళ్ల వద్దకు వచ్చి డాక్యుమెంట్లు అడగడం వంటి ఘటనలు ఈ అభద్రతా భావానికి ఆజ్యం పోశాయి. భారతీయులు అమెరికాలో అత్యంత విజయవంతమైన మైనారిటీ గ్రూపుగా గుర్తింపు పొందారు. కానీ నేడు వారు ఎదుర్కొంటున్న సమస్యలు పెరుగుతూనే ఉన్నాయి. వలస వ్యతిరేక కంటెంట్ ఆన్‌లైన్‌లో పెరగడం వల్ల సామాన్య అమెరికన్లు కూడా భారతీయులను అనుమానంగా చూసే పరిస్థితి ఏర్పడింది. ఐటీ రంగంలో వస్తున్న లేఆఫ్స్, వీసా పొడిగింపులో జరుగుతున్న జాప్యం వల్ల 'డాలర్ డ్రీమ్స్' ఇప్పుడు భారంగా మారుతున్నాయి. భారతదేశంలో స్టార్టప్ సంస్కృతి పెరగడం, మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో 'ఇక్కడ ఎందుకు కష్టపడాలి.. మన దేశానికే వెళ్లిపోదాం' అనే ధోరణి పెరిగింది.

## భారతీయులపై అక్కసు వెళ్లగక్కిన ట్రంప్

- **భారత్, చైనా నరక కూపాలన్న పోస్టు, రీపోస్టు చేసిన ట్రంప్**

ముద్ర, డెస్క్:

ఒకవైపు పశ్చిమాసియా యుద్ధం జరుగుతోంది. ఇరాన్-అమెరికా మధ్య శాంతి చర్చలు కొలిక్కి రాలేదు. 50 రోజులైనా అమెరికాకు ఇరాన్ లొంగలేదు. దీంతో అకారణంగా యుద్ధం మొదలు పెట్టిన ట్రంప్ పరువు హార్మూజ్‌లో కలిసేలా ఉంది. ఇలాంటి పరిస్థితిలో యుద్ధం నుంచి ఎలా బయటపడాలో తెలియక తంటాలు పడుతున్న ట్రంప్.. భారత్, చైనాపై అక్కసు వెల్లగక్కారు. యుద్ధం గెలవడం చేతగాక, కొవ్వెక్కిన మాటలు మాట్లాడాడు. భారతీయులు, చైనీయులు 'ల్యాప్‌టాప్' పట్టుకుని అమెరికా వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దేశాలను 'నరకకూపాలు'గా పిలిచిన రేడియో వ్యాఖ్యాత పోస్ట్‌ను రీపోస్ట్ చేసి, వలసదారులపై అసహనం చూపారు. అమెరికా రాజ్యాంగం 14వ సవరణ పౌరసత్వ నిబంధన మార్చలేని పరిస్థితిలో ఉందని పేర్కొన్నారు.

**భారత్, చైనా నరకకూపాలు..**

ట్రంప్ రీపోస్ట్‌లో, భారతీయులు, చైనీయులు 'బర్త్ టూరిజం' ద్వారా పిల్లలను కలిగి పౌరసత్వం పొంది.. కుటుంబాలను సైతం అమెరికాకు తీసుకువస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఐటీ నిపుణులను 'ల్యాప్‌టాప్ గ్యాంగ్‌స్టర్లు'గా పిలిచారు. ఒక్కరు అమెరికాకు వచ్చి తర్వాత కుటుంబం మొత్తాన్ని తీసుకువచ్చి ఇక్కడే తిష్టవేస్తున్నారని పేర్కొన్నాడు.

**పౌరసత్వ సవరణ అసాధ్యం..**

అమెరికా రాజ్యాంగం ప్రకారం దేశంలో జన్మించినవారికి స్వయంచాలక పౌరసత్వం ఇవ్వాలి. ఈ 14వ సవరణ మార్చడం సుప్రీం కోర్టు, కాంగ్రెస్ ఆమోదం అవసరం. ట్రంప్ ఒక్కరు చేయలేరు. ఈ అడ్డంకి వలస విధానాలను మరింత కఠినతరం చేస్తోందని మండిపడ్డారు. సొంత రాజ్యాంగాన్నే ట్రంప్ తప్పుపట్టారు. హెచ్-1బీ వీసా ఫీజు లక్ష డాలర్లకు పెంచడంతో పిటిషన్లు 87 శాతం తగ్గాయి. భారతీయులు 71 శాతం పొందేవి. 7.25 లక్షల అక్రమ వలసదారుల్లో 18 వేల మంది భారతీయులు బహిష్కరణ జాబితాలో ఉన్నారు. టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి ఐటీ కంపెనీలు అదనపు ఖర్చులు ఎదుర్కొంటున్నాయి.

# చెరువులతో పాటు ఎస్టీపీలు సిద్ధం కావాలి

- **అప్పడే చెరువుల పునరుద్ధరణకు ప్రయోజనం**
- **ఇబ్రహీంబాగ్ చెరువును సందర్శించిన హైడ్రా కమిషనర్**

ముద్ర, హైదరాబాద్:




చెరువులను ఎంతో వ్యయప్రయాసలతో పునరుద్ధరిస్తున్న నేపథ్యంలో, చెరువులు పూర్తయ్యే సమయానికి ఎస్టీపీలు (సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు) కూడా సిద్ధంగా ఉండాలని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ అధికారులు ఆదేశించారు. అప్పుడే చెరువుల పునరుద్ధరణకు పూర్తి ప్రయోజనం కలుగుతుందన్నారు. రెండో విడతలో చేపట్టిన 14 చెరువుల పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా, రాజేంద్రనగర్ మండలం ఇబ్రహీంబాగ్‌లోని చెరువును గురువారం కమిషనర్ సందర్శించారు. జరుగుతున్న పనులను పరిశీలించారు. పూడిక పూర్తిగా తొలగించాలని సూచించారు. దీంతో చెరువులో దుర్గంధం తొలగిపోవడంతోపాటు, పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. చెరువుల పునరుద్ధరణ పూర్తయ్యే సమయానికి ఎస్టీపీలు సిద్ధం కాకపోతే మళ్లీ మురుగు నీరు చేరి జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎస్టీపీ పనులను పర్యవేక్షిస్తున్న జలమండలి అధికారులతో చర్చించారు. చెరువు పైభాగంలో ఎస్టీపీ నిర్మాణంలో ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటామని, పనులను వేగవంతం చేయాలని సూచించారు. 56 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్టీపీలు నిర్మిస్తున్నట్లు జలమండలి అధికారులు కమిషనర్‌కు తెలిపారు. ఎస్టీపీ నుంచి వచ్చే నీటిని ముందుగా సెడిమెంటేషన్ పాండ్‌లోకి తరలించి, అక్కడి నుంచి ప్రధాన చెరువులోకి చేరేలా చూడాలని ఆదేశించారు.

**చెరువుల పునరుద్ధరణలో రాజీ పడొద్దు**

ఇబ్రహీంబాగ్ చెరువు దాదాపు వంద ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చిన ఆక్రమణలను ఇప్పటికే హైడ్రా తొలగించింది. ఆ ప్రాంతాలను చెరువు అభివృద్ధి పరిధిలోకి తీసుకురావాలని కమిషనర్ సూచించారు. ఇన్‌లెట్లు, ఔట్‌లెట్ల నిర్మాణంలో శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని తెలిపారు. వరద నీరు పెద్ద మొత్తంలో వచ్చినప్పుడు మాత్రమే చెరువులోకి చేరేలా, మిగతా సమయంలో మురుగు నీరు బయటకు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇప్పటికే అభివృద్ధి చేసిన చెరువుల మాదిరిగా చుట్టూ పాత్‌వే ఏర్పాటు చేసి, అన్ని వయసుల వారు సేదతీరేలా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. 29.53 చదరపు కిలోమీటర్ల పరిధి నుంచి వరద నీరు చెరువుకు చేరుతుందని, చెరువు నిండిన తర్వాత ఆ నీరు నేరుగా మూసీ నదిలో కలుస్తుందని కమిషనర్ తెలిపారు. అంతకుముందు జల సంరక్షణకు కృషి చేస్తున్న సాహే (సొసైటీ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ ఎండీవర్), ది రైన్ వాటర్ ప్రాజెక్ట్ సంస్థలు కొండాపూర్‌లో అభివృద్ధి చేసిన కుడికుంట చెరువును కూడా కమిషనర్ సందర్శించారు. చెరువు పరిధిలోకి వచ్చే 275 గజాల స్థలాన్ని పరిరక్షించాలని ది రైన్ వాటర్ ప్రాజెక్ట్ వ్యవస్థాపకురాలు కల్పనా రమేష్ కోరారు. చెరువును ఆదాయ వనరుగా మార్చడంలో కల్పనా రమేష్ చూపిన చొరవను అభినందించారు.

# పెను ప్రమాదాన్ని తప్పించిన హైడ్రా

- **ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ కూల్చివేత**
- **ఊపిరి పీల్చుకున్న సంజీవరెడ్డి నగర్ నివాసితులు**

ముద్ర, హైదరాబాద్:




చుట్టూ ఇళ్లు, కార్యాలయాలు.. గట్టిగా వర్షం పడితే భయం.. ఈదురు గాలులు వీస్తే మరింత ఆందోళన.. నిరుపయోగంగా ఉన్న ట్యాంక్ ఎప్పుడు కూలిపోతుందో, ఎవరి ప్రాణాలను హరిస్తుందో అన్న భయాలను హైడ్రా దూరం చేసింది. ట్యాంక్‌ను ఎలా తొలగించాలి, ఆ సమయంలో ప్రమాదం జరుగుతుందా అనే సందేహాలను పటాపంచలు చేస్తూ హైడ్రా సురక్షితంగా బుధవారం నేలకూల్చింది. దీంతో స్థానికుల ఆందోళనలకు ముగింపు పలికింది. సంజీవరెడ్డి నగర్‌లో హైడ్రా ఈ ఆపరేషన్‌ను నిర్వహించింది. నిరుపయోగంగా ఉన్న ట్యాంక్‌ను సురక్షితంగా కూల్చివేసింది. వివరాల్లోకి వెళ్తే... అమీర్‌పేట్ సెంటర్ దాటి ఎర్రగడ్డ, కూకట్‌పల్లి వైపు వెళ్లే మార్గంలో ఎడమ వైపు వెంగళరావు నగర్, కుడివైపు సంజీవరెడ్డి నగర్ ఉన్నాయి. హౌసింగ్ బోర్డు అభివృద్ధి చేసిన లే అవుట్లు ఇవి. ఈ కాలనీల్లో నివాసాలు పెరగడంతో విద్యా సంస్థలు ఏర్పడి, సంజీవరెడ్డి నగర్ విద్యాకేంద్రంగా మారింది.

**65 ఏళ్ల నాటి ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్**

సంజీవరెడ్డి నగర్‌లో నివసిస్తున్న వేలాది కుటుంబాలకు నీరు సరఫరా చేయడానికి 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్‌ను 65 ఏళ్ల క్రితం నిర్మించారు. ఒత్తిడితో నీరు సరఫరా చేయాలనే ఉద్దేశంతో 80 మీటర్ల ఎత్తులో నిర్మించారు. నాటి నుంచి తాగునీటి అవసరాలను తీర్చిన ఈ ట్యాంక్ కాలక్రమేణా బలహీనమైంది. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ నిపుణులు పరిశీలించి వినియోగించరాదని నివేదిక సమర్పించారు. దీంతో గత 15 ఏళ్లుగా నిరుపయోగంగా ఉంది. దీనిని తొలగించాలని జలమండలి నిర్ణయించింది. 100 గజాల పరిధిలో నిర్మాణం ఉన్నప్పటికీ చుట్టూ నివాసాలు ఉన్నాయి. 20 మీటర్ల దూరంలో జలమండలి, జీహెచ్ఎంసీ, హౌసింగ్ బోర్డు కార్యాలయాలు ఉన్నాయి. అదే విధంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉంది. ఒక వైపు రహదారి ఉన్నా, మూడు వైపులా నివాసాలు, కార్యాలయాలు ఉండటంతో కూల్చివేత క్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలో హైడ్రాను జలమండలి అధికారులు ఆశ్రయించి సురక్షితంగా కూల్చివేయాలని కోరారు.

**4గంటల్లో ఆపరేషన్ పూర్తి**

జలమండలి లేఖ అందుకున్న వెంటనే హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. 6 పిల్లర్లపై 80 మీటర్ల ఎత్తులో నిర్మించిన 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంక్‌ను ప్రమాదం లేకుండా కూల్చేందుకు నిపుణులతో సమీక్షించింది. బుధవారం ఉదయం 6 గంటలకు ఆపరేషన్ ప్రారంభించింది. ఐరన్ రోపులు బిగించి, ఎత్తైన హిటాచీ యంత్రాలను వినియోగించింది. ప్రమాదకర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా కూల్చివేత చేపట్టి, ఉదయం 10 గంటలకల్లా మొత్తం ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. నిర్దేశించిన మేరకు, ట్యాంక్ నిర్మాణ పరిధిలోనే కూలేలా చర్యలు తీసుకోవడంతో చుట్టుపక్కల ప్రాంతాలకు ఎలాంటి నష్టం కలగలేదు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ట్యాంక్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయ సిబ్బంది కూడా ప్రమాదం తప్పిందని ఊరట చెందారు. ఎలాంటి ప్రమాదం లేకుండా ట్యాంక్‌ను తొలగించిన హైడ్రాకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.



## అమరావతిలో బిట్స్ పిలాని క్యాంపస్

- **బిట్స్ పిలాని ప్రతినిధులతో సీఎం చంద్రబాబు భేటీ**
- **2027 నుంచి ప్రవేశాలు**

ముద్ర, అమరావతి:

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ బిట్స్ పిలాని క్యాంపస్‌ను నిర్మిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలిపారు. గురువారం సచివాలయంలో జరిగిన సమావేశంలో క్యాంపస్ నిర్మాణ పురోగతిని వివరించారు. ఈ క్యాంపస్‌లో క్వాంటం, ఏఐ విభాగాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. క్వాంటం టెక్నాలజీ రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహించేలా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. అమరావతి క్యాంపస్‌ను ఐకానిక్, ఏఐ ఆధారితంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. 2027 నుంచి ప్రవేశాలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రాజధాని ప్రాంతంలోని ఈ క్యాంపస్ విస్తరణకు సుమారు రూ.250 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. మూడు దశల్లో క్యాంపస్ నిర్మాణం చేపడుతూ, మొత్తం 10 వేల మంది విద్యార్థులు చదువుకునే విధంగా మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు.

# కాళేశ్వరంపై ఎవరి వాదన వారిదే!

- **విజయం మాదేనంటున్న బీఆర్ఎస్**
- **అసలు పోరు ముందుందంటున్న కాంగ్రెస్**
- **రైతుల్లో నీటి ఆశలు - మధ్య మధ్యలో బీజేపీ ఎంట్రీ**

ముద్ర, తెలంగాణ బ్యూరో:

కాళేశ్వరం ప్రాజెక్టు అంశాన్ని రాష్ట్ర రాజకీయ పోరుకు సర్వనామంగా మార్చేశారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజా సమస్యలు, రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పథకాలు, నిరుద్యోగం, ఉద్యోగ ఉపాధి అంశాల కంటే రాజకీయ ఆధిపత్య చదరంగంలో కుంగిన కాళేశ్వరం ప్రాజెక్టు అంశం కీలకంగా మారింది. ప్రచార, ప్రసార సాధనాలు కూడా ఇదే అంశానికి ఎక్కడలేని ప్రాధాన్యం ఇస్తూ పరిస్థితిని పతాకస్థాయికి చేర్చుతున్నాయి. ఒక్కోసారి ఆయా పార్టీల చోటామోటా నాయకుల నుంచి అధినేతల వరకు మాట్లాడుతున్న మాటలు రాజకీయంగా జుగుప్సాకరంగా మారాయి. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు దారితీసింది. ఈ పరిణామం అటు అధికార కాంగ్రెస్‌కు సవాలుగా, ఇటు విపక్ష బీఆర్ఎస్‌కు అందివచ్చిన అస్త్రంగా మారింది. హైకోర్టు తీర్పును బీఆర్ఎస్ శ్రేణులు తమకు లభించిన క్లీన్ చిట్ గా అభివర్ణిస్తూ రాజకీయంగా పైచేయి సాధించే ప్రయత్నం చేస్తున్నాయి.



**సీబీఐ విచారణపై స్పష్టత లేమి**

**సీబీఐ విచారణపై స్పష్టత లేకపోవడం బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తుండగా, సీఎం రేవంత్ రెడ్డి మాత్రం అవినీతి పరులను వదిలిపెట్టబోమని చెబుతున్నారు. చర్యల్లో ఆలస్యం కొనసాగితే ఇది కాంగ్రెస్‌కు ప్రతికూలంగా మారే అవకాశముంది.**

**బీఆర్ఎస్‌లో ఉత్సాహం**

**- కాంగ్రెస్‌కు ఇబ్బందులు**

బీఆర్ఎస్ ఈ తీర్పును తమకు అనుకూలంగా భావిస్తూ 'క్లీన్ చిట్'గా ప్రచారం చేస్తోంది. దీంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది. మరోవైపు కాంగ్రెస్ నేతలు ఇది క్లీన్ చిట్ కాదని, కేవలం సాంకేతిక కారణాలతో వచ్చిన స్టే మాత్రమేనని చెబుతున్నా, ఆ వాదన బలంగా వినిపించడం లేదు. ఎన్నికల ముందు చేసిన ఆరోపణలపై ఇప్పటికీ స్పష్టమైన చర్యలు లేకపోవడం కాంగ్రెస్‌కు ఇబ్బందిగా మారింది.

**న్యాయపరమైన చిక్కుల్లో ప్రభుత్వం**

ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ, కమిషన్ ప్రక్రియలో లోపాల కారణంగా న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొంటోంది. నోటీసులు జారీ చేసి వాదనలు వినకపోవడం వంటి అంశాలు కేసును వెనక్కి నెట్టాయి.

**రాజకీయ వేడి పెంచుతున్న బీజేపీ**

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోటాపోటీ విమర్శల మధ్య బీజేపీ నేతలు కూడా అప్పుడప్పుడు స్పందిస్తూ రాజకీయ వేడి పెంచుతున్నారు. హైకోర్టు తీర్పు బీఆర్ఎస్‌లో ఉత్సాహం, కాంగ్రెస్‌లో నిరాశను కలిగించింది.

**రైతుల్లో నీటి ఆశలు**

ఇదిలా ఉంటే, కాళేశ్వరం అంశం పూర్తిగా రాజకీయ కథగా మారింది. పార్టీలు ఆరోపణలు, ప్రతిఆరోపణలు చేసుకుంటుండగా, మరోవైపు రైతులు మాత్రం వచ్చేకాలంలో నీళ్లు అందుతాయా అన్న ఆశతో ఎదురుచూస్తున్నారు.

# ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి


- **ఆర్టీసీ జేఏసి**
- **భవిష్యత్ కార్యాచరణ ప్రకటన**

ముద్ర, తెలంగాణ బ్యూరో:

వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపో డ్రైవర్ కోలా శంకర్ గౌడ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని చేసిన ఆత్మహత్యాయత్నానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆర్టీసీ జేఏసీ డిమాండ్ చేసింది. సమ్మె డిమాండ్ల పరిష్కారం విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పిన అబద్ధాలు, ఈ ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం లాగే సమస్యలను పరిష్కరించడానికి మొండి వైఖరి అవలంబిస్తున్నందుకు తట్టుకోలేక శంకర్ గౌడ్ మనోవేదనతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని ఆరోపించింది. ఈ మేరకు గురువారం ఆర్టీసీ జేఏసీ హైదరాబాద్ లో అత్యవసర సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించింది. ఈ కార్యక్రమాలను అన్ని డిపోలకు చెందిన జేఏసి నాయకులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది.

**ఎంత మంది బలిదానాలు కావాలి..**

ఆత్మహత్యాయత్నం చేసిన శంకర్ గౌడ్ 70 శాతం కాలిన గాయాలతో వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడని ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడని జేఏసీ తెలిపింది. ఈ దుర్ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన జేఏసీ.. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 34 మంది ఆర్టీసి కార్మికులు ఆత్మబలిదానం చేసుకుంటే, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతమంది ఆర్టీసి కార్మికులు బలిదానాలు చేసుకుంటే దిగివస్తుందో చెప్పాలని ప్రశ్నించింది. ఇప్పటివరకు శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా సమ్మె చేస్తున్న ఆర్టీసి కార్మిక వర్గంపై ఉక్కుపాదం మోపుతూ, డిపోలలో వేసుకున్న టెంట్లను పోలీసులతో కూల్చివేయించి అక్కడినుండి నిర్దాక్షిణ్యంగా కార్మికులను తరిమి కొడుతున్నారని ఇదేనా ప్రజాపాలన అని ముఖ్యమంత్రిని జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి.మౌలానా, కో కన్వీనర్లు సుద్దాల సురేష్, కత్తుల యాదయ్య, బి.యాదగిరి ప్రశ్నించారు.




**ఆత్మహత్యలు వద్దు..**

నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్‌కు ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా వెంటనే మెరుగైన వైద్యం అందించాలని జేఏసీ డిమాండ్ చేసింది. ఈ ఆత్మహత్య సంఘటనకు ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వాలే బాధ్యత వహించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి స్పందించాలని కోరింది. సమ్మె డిమాండ్లను పరిష్కరించి, సమ్మెను విరమింపచేయాలని కోరుతూ అన్ని డిపోలలో నెలకొన్న ఉద్రిక్త వాతావరణాన్ని తొలగించి కార్మికులకు ప్రశాంత వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికవర్గమంతా క్షణికావేశానికిలోను కాకుండా ఎలాంటి అఘాయిత్యాలు చేసుకోవద్దని, ధైర్యంగా ఉండాలని సూచించింది. ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావని ఐకమత్యంతో మనమంతా కొట్లాడి మన డిమాండ్లను సాధించుకోవడానికి జేఏసీ కృత నిశ్చయంతో ఉందని జేఏసీ పట్ల విశ్వాసంతో ఉండాలని కోరింది.

**భవిష్యత్ కార్యాచరణ..**

- 24 ఏప్రిల్ అన్ని డిపోల ముందు మౌన ప్రదర్శనలు
- 25 ఏప్రిల్ అన్ని డిపోలలో వంటావార్పు
- 26 ఏప్రిల్ అన్ని రీజియన్‌లలో, జిల్లాలలో కార్మిక కవాత్
- 27ఏప్రిల్ తెలంగాణ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపి, మంత్రులకు, వినతిపత్రాలు
- 28 ఏప్రిల్ మహిళ ఉద్యోగులతో అన్ని డిపోలలో బతుకమ్మలతో నిరసన ప్రదర్శనలు
- 29ఏప్రిల్ అన్ని డిపోల ముందు అర్ధనగ్న ప్రదర్శనలు

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
24.04.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**మైగ్రేన్ నియంత్రణకు...**

స్క్రీన్ టైమ్ తగ్గించండి
మొబైల్, ల్యాప్‌టాప్ ఎక్కువగా వాడటం మైగ్రేన్ పెంచుతుంది.
మధ్య మధ్యలో బ్రేక్స్ తీసుకోవడం అవసరం.



# మీరు మారిపోయారు సార్

- లక్నో ఓడినా పంత్‌ను హత్తుకున్న ఓనర్ సంజీవ్ గోయెంకా

ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:




ఐపీఎల్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్ వరుస పరాజయాలతో కష్టాల్లో పడింది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 40 పరుగుల తేడాతో ఓటమి చవిచూసిన లక్నో, ఈ సీజన్‌లో వరుసగా నాలుగో మ్యాచ్‌ను కోల్పోయి పాయింట్ల పట్టికలో దిగువ స్థానాలకు చేరుకుంది.ః ఈ ఓటమి తర్వాత జట్టు ఓనర్ సంజీవ్ గోయెంకా ప్రవర్తన అందరి దృష్టిని ఆకర్షించింది. మ్యాచ్ ముగిసిన వెంటనే కెప్టెన్ రిషబ్ పంత్ వద్దకు వెళ్లిన ఆయన, కొంతసేపు మాట్లాడి ధైర్యం చెప్పారు. పంత్‌ను ఆప్యాయంగా హత్తుకుని మద్దతు తెలపడం అభిమానులను ఆకట్టుకుంది. సాధారణంగా జట్టు ఓడినప్పుడు యాజమాన్యం అసహనం వ్యక్తం చేసే సందర్భాలు కనిపిస్తాయి. కానీ గోయెంకా మాత్రం జట్టు కష్టకాలంలో కెప్టెన్‌కు అండగా నిలవడం ప్రత్యేకంగా మారింది. గతంలో విమర్శలు ఎదుర్కొన్న ఆయన, ఈసారి చూపిన ప్రవర్తనతో ప్రశంసలు అందుకుంటున్నారు. మ్యాచ్ విషయానికి వస్తే, లక్నో బౌలర్లు మంచి ప్రదర్శనతో ప్రత్యర్థిని తక్కువ స్కోర్‌కే పరిమితం చేశారు. అయితే బ్యాటింగ్ విభాగం పూర్తిగా విఫలమవడంతో లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. మిచెల్ మార్ష్ పోరాడినా, ఇతర బ్యాటర్ల నుంచి సహకారం లేకపోవడం జట్టుకు చేటు అయింది. ఓటమి అనంతరం స్పందించిన రిషబ్ పంత్, బ్యాటింగ్ వైఫల్యమే ప్రధాన కారణమని ఒప్పుకున్నాడు. జట్టు తిరిగి పుంజుకుంటుందనే నమ్మకాన్ని వ్యక్తం చేస్తూ, రాబోయే మ్యాచ్‌ల్లో మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపాడు.




# కార్టూన్స్ చూస్తా.. బౌలర్లకు చుక్కలు చూపిస్తా

- వైభవ్ సూర్యవంశీ

ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:

యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ తన అద్భుత బ్యాటింగ్‌తో ఈ సీజన్‌లో మరోసారి హాట్ టాపిక్‌గా మారాడు. గత సీజన్‌లో చూపిన ఫామ్‌ను కొనసాగిస్తూ, ప్రత్యర్థి బౌలర్లపై ఎలాంటి భయం లేకుండా దూకుడుగా ఆడుతున్నాడు. ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వంటి బలమైన జట్లపై కూడా అతని ఇన్నింగ్స్‌లు ప్రత్యేకంగా నిలిచాయి. ఇలాంటి ఫామ్ మధ్య వైభవ్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ప్రతి మ్యాచ్‌కు ముందు తాను కార్టూన్స్ చూస్తానని తెలిపాడు. వాటి ద్వారా రిలాక్స్ అయి, ఆ తర్వాత బ్యాటింగ్‌లో పూర్తి దృష్టి పెడతానని వివరించాడు. చిన్న వయసులోనే ఆట, వినోదం రెండింటినీ సమతుల్యంగా నిర్వహిస్తున్నానని చెప్పాడు. మ్యాచ్‌లో విఫలమైనా ఒత్తిడికి లోనుకాకుండా తదుపరి మ్యాచ్‌లో మెరుగ్గా ఆడేందుకు ప్రయత్నిస్తానని వైభవ్ పేర్కొన్నాడు. ప్రతి మ్యాచ్‌ను కొత్తగా తీసుకుని తన ప్రదర్శనను మెరుగుపరుచుకుంటానని చెప్పాడు. ఈ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్‌ను ఛాంపియన్ చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపిన వైభవ్, తన ఆటతీరుతో జట్టుకు కీలకంగా మారుతున్నాడు.

# మయాంక్‌పై ట్రోలింగ్..

## అండగా నిలిచిన బిషప్



ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:

ఐపీఎల్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో యువ ఫాస్ట్ బౌలర్ మయాంక్ యాదవ్ ప్రదర్శన చర్చనీయాంశంగా మారింది. గాయాల నుంచి కోలుకుని దాదాపు ఏడాది తర్వాత మైదానంలోకి తిరిగి వచ్చిన మయాంక్, ఈ మ్యాచ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. తన పూర్తి కోటా నాలుగు ఓవర్లు వేసిన అతడు 56 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ కూడా తీసుకోలేకపోయాడు. ముఖ్యంగా చివరి ఓవర్‌లో ఎక్కువ పరుగులు సమర్పించుకోవడంతో అభిమానులు తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో అతడిపై విమర్శలు వెల్లువెత్తుతూ ట్రోలింగ్ కూడా మొదలైంది. అయితే ఈ విమర్శలకు వెస్టిండీస్ మాజీ దిగ్గజం, ప్రముఖ వ్యాఖ్యాత ఇయాన్ బిషప్ ఘాటుగా స్పందించారు. చిన్న వయసులోనే గాయాలతో కెరీర్ ప్రమాదంలో పడిన మయాంక్, కష్టపడి మళ్లీ మైదానంలోకి రావడం గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు. తిరిగి 150 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేయగలగడం అద్భుతమని ప్రశంసించారు. ప్రస్తుతం అతడు పూర్తిగా ఫిట్‌గా ఉండటం ముఖ్యమని, లైన్ అండ్ లెంగ్త్‌పై నియంత్రణ క్రమంగా వస్తుందని బిషప్ అభిప్రాయపడ్డారు. యువ ఆటగాడిని విమర్శించకుండా ప్రోత్సహించాలని సూచించారు.


# జడేజా రియాక్షన్

- సోషల్ మీడియాలో వైరల్

ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:

ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా స్టేడియంలో చోటుచేసుకున్న ఓ సంఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మ్యాచ్ జరుగుతున్న సమయంలో బంతి స్టాండ్స్‌లో పడడంతో అభిమానుల మధ్య చిన్నపాటి గొడవ చెలరేగింది. బంతిని ఎవరు తీసుకోవాలన్న విషయంలో ప్రారంభమైన వాగ్వాదం కాస్త తోపులాటగా మారింది. ఈ గందరగోళం కారణంగా మ్యాచ్ కొద్దిసేపు ఆగిపోవడంతో మైదానంలో ఉన్న ఆటగాళ్లు అసహనానికి గురయ్యారు. ముఖ్యంగా రవీంద్ర జడేజా ప్రేక్షకుల వైపు కోపంగా చూస్తూ తీవ్రంగా స్పందించినట్లు కనిపించింది. అతని రియాక్షన్ నెట్టింట చర్చకు దారితీసింది. బంతిని వెంటనే మైదానంలోకి విసరాల్సిన సమయంలో ఆలస్యం చేయడంతో ఆటగాళ్లు, అంపైర్లు కూడా వేచి చూడాల్సి వచ్చింది. చివరకు పరిస్థితి సద్దుమణిగిన తర్వాతే ఆట తిరిగి ప్రారంభమైంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, జడేజా ప్రవర్తనపై నెటిజన్లు విభిన్నంగా స్పందిస్తున్నారు.



## డాన్స్ మాస్టర్లైన ఇషాన్–అభిషేక్..

# హెడ్‌కు స్టెప్స్ క్లాస్!

- ట్రావిస్ హెడ్‌కు డాన్స్ నేర్పిన ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ

ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:

ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటతో పాటు సరదా క్షణాలతో కూడా అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా జట్టు కెప్టెన్ ఇషాన్ కిషన్, ఓపెనర్ అభిషేక్ శర్మ కలిసి ట్రావిస్ హెడ్‌కు డాన్స్ స్టెప్స్ నేర్పుతున్న వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ వీడియోలో ట్రావిస్ హెడ్ కెమెరా ముందు నిలబడి షూట్‌లో పాల్గొంటుండగా, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ కెమెరా వెనుక నుంచి స్టెప్స్ చూపిస్తూ కనిపిస్తున్నారు. వారు చెప్పిన స్టెప్స్‌ను హెడ్ ఫాలో అవుతూ డాన్స్ చేయడం ఆకట్టుకుంటోంది. మరోవైపు ఈ సరదా క్షణాలను అభిషేక్ తన మొబైల్‌లో రికార్డ్ చేయడం హైలైట్‌గా మారింది. ఈ ఫన్నీ వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతూ అభిమానులను అలరిస్తోంది. ఆటగాళ్ల మధ్య ఉన్న స్నేహపూర్వక వాతావరణం, జట్టు బాండింగ్ ఈ వీడియో ద్వారా స్పష్టంగా కనిపిస్తోంది. ఇక జట్టు ప్రదర్శన పరంగా కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్ మంచి ఫామ్‌లో ఉంది. వరుస విజయాలతో పాయింట్ల పట్టికలో ముందంజలో నిలుస్తూ, ఈ సీజన్‌లో టైటిల్ రేస్‌లో బలమైన పోటీదారుగా కనిపిస్తోంది

# అభిమానులకు షాక్


- హోటల్ గదికే పరిమితమైన 'తలా'
- ధోనీ లేకుండా బరిలోకి దిగిన చెన్నై

ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:

ఐపీఎల్ 2026లో ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరుగుతున్న ముంబై ఇండియన్స్-చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్‌కు ముందు అభిమానులకు పెద్ద షాక్ తగిలింది. చెన్నై జట్టు కీలక ఆటగాడు మహేంద్ర సింగ్ ధోనీ ఈ మ్యాచ్‌లో ఆడడం లేదని చివరి నిమిషంలో స్పష్టమైంది. దీంతో 'తలా' అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ మ్యాచ్‌లో ధోనీ ఆడతాడని అందరూ భావించినప్పటికీ, అకస్మాత్తుగా అతడు దూరం కావడంతో హోటల్ గదికే పరిమితమయ్యాడు. జట్టు నుంచి అధికారికంగా ప్రకటించడంతో అభిమానుల్లో చర్చ మొదలైంది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే, టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. గత మ్యాచ్‌లో వచ్చిన విజయాన్ని కొనసాగించాలని భావిస్తున్నట్లు తెలిపాడు. ఈ మ్యాచ్‌కు ముంబై ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగింది. చెన్నై తరపున కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మాట్లాడుతూ, తాము టాస్ గెలిచినా బౌలింగ్ ఎంచుకునే వారమని చెప్పారు. ధోనీ ఈ మ్యాచ్‌లో లేకపోవడం జట్టుకు లోటేనని, అయినప్పటికీ అతడిని సంతోషపరిచేలా ఆడతామని తెలిపారు. ఒక మార్పుతో చెన్నై జట్టు బరిలోకి దిగింది.




# సోషల్ మీడియాలో చాహర్ ఫ్యామిలీ హంగామా



- ముంబై ఇండియన్స్–చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్‌కు ముందు ఆసక్తికర సన్నివేశం

ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :

ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరిగే హై వోల్టేజ్ మ్యాచ్‌కు ముందు సోషల్ మీడియాలో చాహర్ కుటుంబం పేరు తెగ వైరల్ అవుతోంది. మైదానంలో పోరు మొదలుకాకముందే, కుటుంబంలో జరిగిన సరదా సంభాషణ అభిమానులను ఆకట్టుకుంటోంది.

**సోదరుల మధ్య పోటీకి అక్క కామెంట్ హైలైట్**

ఈ మ్యాచ్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు క్రికెటర్లు ఎదురెదురుగా నిలవనుండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. దీపక్ చాహర్ ముంబై ఇండియన్స్ తరపున ఆడుతుండగా, రాహుల్ చాహర్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో కొనసాగుతున్నాడు. గతంలో జట్లలో వీరి స్థానాలు మారిపోవడం కూడా గమనార్హం.

ఇలాంటి పరిస్థితుల్లో వారి సోదరి మాలతీ చాహర్ చేసిన ఒక సరదా పోస్టు సోషల్ మీడియాలో భారీ స్పందన తెచ్చుకుంది. ఇద్దరు తమ్ముళ్లతో కలిసి ఉన్న ఫోటోను షేర్ చేసిన ఆమె, మీరు ఆడినా ఆడకపోయినా, బెంచ్‌పై ఉన్నా నా మద్దతు మీకే అంటూ హాస్యంగా వ్యాఖ్యానించింది.

**తక్కువ అవకాశాలు... ఫామ్ సమస్యలతో చర్చలో బ్రదర్స్**

ఈ సీజన్‌లో ఇద్దరు ఆటగాళ్లకు ఎక్కువగా అవకాశాలు దక్కకపోవడం కూడా చర్చనీయాంశంగా మారింది. రాహుల్ చాహర్ ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ మాత్రమే ఆడి వికెట్ తీసుకోలేకపోయాడు. అదే మ్యాచ్‌లో అతను ఎక్కువ పరుగులు ఇవ్వడం అభిమానుల్లో చర్చకు దారితీసింది. మరోవైపు దీపక్ చాహర్ కూడా మూడు మ్యాచ్‌ల్లో ఒకే వికెట్ తీసి, బ్యాటింగ్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. ఈ నేపథ్యంలో అక్క చేసిన సరదా వ్యాఖ్య మరింత వైరల్ అయింది.

**ధోనీ పాదాలను తాకిన దీపక్ చాహర్**

మ్యాచ్‌కు ముందు ప్రాక్టీస్ సెషన్‌లో ఒక భావోద్వేగ క్షణం చోటుచేసుకుంది. దీపక్ చాహర్ తన మాజీ కెప్టెన్ ఎం.ఎస్. ధోనీ పాదాలను తాకి ఆశీర్వాదం తీసుకున్న దృశ్యం అభిమానులను ఆకట్టుకుంది. ఈ వీడియోను చెన్నై సూపర్ కింగ్స్ సోషల్ మీడియాలో పంచుకోవడంతో అది వైరల్ అయింది.

**సోషల్ మీడియాలో నవ్వుల వెల్లువ**

మాలతీ చాహర్ పోస్ట్‌పై అభిమానులు విభిన్నంగా స్పందిస్తున్నారు. కొందరు ఇది సరదా కుటుంబ బంధం అని కామెంట్ చేస్తుంటే, మరికొందరు అక్క జోక్ బాగా హిట్ అయిందని అంటున్నారు. మొత్తం మీద మ్యాచ్ మొదలుకాకముందే చాహర్ కుటుంబం సోషల్ మీడియాలో మంచి వినోదాన్ని అందిస్తూ హాట్ టాపిక్‌గా మారింది.

# గాయాల దెబ్బతో చెన్నై సూపర్ కింగ్స్‌లో ఆందోళన

ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :



ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆటగాళ్ల గాయాలు జట్లకు పెద్ద సమస్యగా మారుతున్నాయి. ఈ ప్రభావం తాజాగా చెన్నై సూపర్ కింగ్స్ జట్టుపై పడింది. జట్టు కీలక ఓపెనర్ ఆయుష్ మ్హాత్రే గాయం కారణంగా మొత్తం టోర్నీకి దూరమవడం జట్టుకు పెద్ద దెబ్బగా మారింది. ఈ సీజన్‌లో మంచి ఫామ్‌లో ఉన్న మ్హాత్రే కేవలం ఆరు మ్యాచ్‌ల్లోనే 201 పరుగులు చేసి జట్టుకు స్థిరమైన ఆరంభాలు అందించాడు. అతడు లేకపోవడంతో ఆ స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారనే దానిపై జట్టులో చర్చలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో టీమిండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఒక ఆసక్తికరమైన సూచన చేశారు. అవసరమైతే మరో జట్టు నుంచి ఆటగాడిని తాత్కాలికంగా తీసుకునే విధానాన్ని ఉపయోగించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టులో బెంచ్‌పై ఉన్న అభిజ్ఞాన్ కుందును తీసుకోవాలని ఆయన సూచించారు. ఐపీఎల్‌లో ఇలాంటి తాత్కాలిక ఆటగాళ్ల మార్పిడి విధానం కొన్ని షరతుల ఆధారంగా మాత్రమే ఉంటుంది. రెండు జట్లు మరియు ఆటగాడు ముగ్గురూ అంగీకరించాలి. అలాగే ఆ ఆటగాడు తన మాతృ జట్టు తరపున తక్కువ మ్యాచ్‌లు మాత్రమే ఆడి ఉండాలి. ఒక సీజన్ వరకే ఈ అవకాశం ఉంటుంది. అలాగే తన మాతృ జట్టుతో జరిగే మ్యాచ్‌లో ఆ ఆటగాడు ఆడడు. ఈ మార్పిడి విండో ఏడవ మ్యాచ్ తర్వాత ముగుస్తుంది కాబట్టి చెన్నై సూపర్ కింగ్స్ త్వరగా నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికే టోర్నీ వాతావరణంలో ఉన్న ఆటగాడు దొరికితే జట్టుకు వెంటనే ఉపయోగపడుతుందని నిపుణులు భావిస్తున్నారు. అభిజ్ఞాన్ కుందు లాంటి యువ ఆటగాడు జట్టులోకి వస్తే ఓపెనింగ్ సమస్య కొంతవరకు పరిష్కారం అవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే దీనికి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు మరియు ఆటగాడు అంగీకారం తప్పనిసరి. ప్రస్తుతం ఈ విషయంపై చెన్నై సూపర్ కింగ్స్ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
24.04.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





## రీరిలీజ్‌లో దుమ్మురేపుతున్న 'డార్లింగ్'

ముద్ర, సినిమా డెస్క్: యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన క్లాసిక్ లవ్ స్టోరీ 'డార్లింగ్' రీరిలీజ్‌తో బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. చాలా కాలం తర్వాత ఈ సినిమా మళ్లీ థియేటర్లలోకి రావడంతో ప్రభాస్ లవర్ బాయ్ లుక్‌ను పెద్ద తెరపై చూసేందుకు అభిమానులు భారీగా తరలివస్తున్నారు. లిమిటెడ్ ప్రీమియర్స్ నుంచే ఈ సినిమా మంచి వసూళ్లను నమోదు చేసింది. ట్రాక్ చేసిన కొన్ని సెంటర్ల నుంచే దాదాపు రూ.20 లక్షల గ్రాస్ సాధించడం విశేషం. అసలు జోరు అయితే విడుదలైన రోజునే కనిపించింది. మధ్యాహ్నం 3 గంటల సమయానికే ఆన్‌లైన్ ట్రాకింగ్ ప్రకారం రూ.3 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేయడం ఈ రీరిలీజ్‌కు ఉన్న క్రేజ్‌ను స్పష్టంగా చూపిస్తోంది. సాయంత్రం, రాత్రి షోల బుకింగ్స్ కూడా భారీగా ఉండటంతో మొదటి రోజు కలెక్షన్లు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభాస్ వింటేజ్ లుక్, దర్శకుడు కరుణాకరన్ స్టైల్ టేకింగ్, జివి ప్రకాష్ సంగీతం కలిసి మళ్లీ థియేటర్లలో మాయాజాలాన్ని సృష్టిస్తున్నాయి. థియేటర్ల వద్ద అభిమానులు చేస్తున్న సందడి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రస్తుత ట్రెండ్‌ను బట్టి చూస్తే, 'డార్లింగ్' రీరిలీజ్ మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయంగా కనిపిస్తోంది.

## స్టైల్ రూల్స్ మార్చేసిన మాళవిక



ముద్ర, సినిమా డెస్క్: హీరోయిన్ మాళవిక మోహనన్ మరోసారి తన స్టైలిష్ లుక్స్‌తో నెటిజన్లను ఆకట్టుకుంటోంది. భిన్నమైన అవుట్‌ఫిట్స్‌లో కనిపిస్తూ తన ఫ్యాషన్ వెర్సటిలిటీని చాటుకుంది. చాక్లెట్ బ్రౌన్ ఆఫ్‌షోల్డర్ రిబ్డ్ మిడీ డ్రెస్‌లో ఆమె క్లాసీగా మెరిసింది. భారీ గోల్డ్ ఇయర్‌రింగ్స్, స్లీక్ పోనీటైల్‌తో కలిసి ఆ లుక్‌కు రిచ్ ఫినిష్ ఇచ్చింది. మిర్రర్ సెల్ఫీలో కనిపించిన ఆమె ఫిట్ సిల్హౌట్ సోషల్ మీడియాలో వెంటనే ట్రెండ్ అయింది.ఇక మరో లుక్‌లో పూర్తిగా భిన్నమైన స్టైల్‌తో కనిపించింది. డెనిమ్ బ్లేజర్‌ను బ్లాక్ బ్రాలెట్‌తో జత చేసి, ట్రాపికల్ ప్రింట్ స్లిట్ స్కర్ట్, గోల్డ్ ప్లాట్‌ఫామ్ హీల్స్‌తో బోల్డ్ ఫ్యాషన్ స్టేట్‌మెంట్ ఇచ్చింది. ఈ కాంబినేషన్ ఆమెకు మరింత గ్లామర్ జోడించింది. ఇటీవల వచ్చిన 'రాజా సాబ్' సినిమా ఆశించిన స్థాయిలో రాణించకపోయినా, మాళవిక మాత్రం తన జోరు తగ్గించడం లేదు. ప్రస్తుతం 'సర్దార్ 2', 'పాకెట్ నవెల్' వంటి ప్రాజెక్టులతో బిజీగా ఉండగా, ఫ్యాషన్ పరంగా కూడా ట్రెండ్ సెట్ చేస్తూనే ఉంది.

## బ్లాక్ డ్రెస్‌లో నేహా శర్మ గ్లామర్ షో



ముద్ర, సినిమా డెస్క్: మోస్ట్ బ్యూటిఫుల్ నటి నేహా శర్మ తన గ్లామర్‌తో మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన 'చిరుత' సినిమాతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఈ బ్యూటీ, తొలి చిత్రంతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత స్టార్ హీరోయిన్‌గా ఎదుగుతుందని భావించినప్పటికీ, కెరీర్ అనుకున్న విధంగా సాగలేదు. 'చిరుత' విజయానంతరం వరుణ్ సందేశ్‌తో చేసిన 'కుర్రాడు' సినిమా ఆశించిన ఫలితం ఇవ్వకపోవడంతో, నేహా తెలుగు చిత్రాలకు దూరమైంది. అనంతరం బాలీవుడ్‌పై దృష్టి పెట్టి అక్కడ అవకాశాలు అందిపుచ్చుకుంది. హిందీ సినిమాల్లో ఆమెకు మోస్తరు విజయాలు దక్కుతూ కెరీర్ కొనసాగుతోంది. ఇక సోషల్ మీడియాలో మాత్రం నేహా ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ తన గ్లామర్ ఫోటోలను అభిమానులతో పంచుకుంటుంది. తాజాగా బ్లాక్ కలర్ డ్రెస్‌లో చేసిన ఫోటోషూట్ నెట్టింట వైరల్ అవుతోంది. కుర్చీలో కూర్చొని, వేర్వేరు యాంగిల్స్‌లో పోజులు ఇస్తూ ఆమె చేసిన స్టైలిష్ ఫోటోలు ఆకట్టుకుంటున్నాయి. ఈ లుక్‌లో నేహా శర్మ తన అందంతో నెటిజన్లను ఫిదా చేస్తూ మరోసారి ట్రెండ్ సెట్ చేసింది.



## విడిగా ఉన్నా... సంతోషంగానే ఉన్నాం: రకుల్

ముద్ర, సినిమా డెస్క్: టాలీవుడ్, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్, నటుడు నిర్మాత జాకీ భగ్నానీ తమ వైవాహిక జీవితంపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. 2024 ఫిబ్రవరి 21న గోవాలో ఘనంగా పెళ్లి చేసుకున్న ఈ జంట, పెళ్లి తర్వాత కూడా తమ బంధాన్ని స్వేచ్ఛ, పరస్పర గౌరవంతో కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఓ ఇంటర్వ్యూలో రకుల్ మాట్లాడుతూ, "మేమిద్దరం విడిగా ఉన్నా కూడా సంతోషంగానే ఉంటాం. ఒకరి జీవితాన్ని మరొకరు పూర్తిచేయడానికి పెళ్లి చేసుకోలేదు. మేమిద్దరం వ్యక్తిగతంగా కూడా స్ట్రాంగ్‌గానే ఉన్నాం" అని చెప్పింది. కలిసి ఉన్నప్పుడు ఆ ఆనందం మరింత రెట్టింపు అవుతుందని ఆమె పేర్కొంది. జాకీ భగ్నానీ కూడా తమ బంధంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మేము భార్యాభర్తలమే అయినా, మా మధ్య ఉన్న స్నేహం, పారదర్శకతే అసలు బలం. ఏ విషయమూ దాచుకోకుండా మాట్లాడుకుంటాం" అని తెలిపారు. పరస్పర నమ్మకం, స్పష్టతతో తమ దాంపత్యాన్ని ప్రత్యేకంగా మలుచుకుంటున్న ఈ జంట, ఆధునిక సంబంధాలకు కొత్త దారి చూపుతోందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

## కోర్సెట్ లుక్‌లో అదిరిపోయిన రాశి సింగ్

ముద్ర, సినిమా డెస్క్: హీరోయిన్ రాశి సింగ్ తాజా ఫోటోషూట్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. బ్లష్ పింక్ స్ట్రాప్‌లెస్ కోర్సెట్ డ్రెస్‌లో ఆమె సాఫ్ట్ గ్లామ్ లుక్‌తో ఆకట్టుకుంది. క్లీన్ మిడీ సిల్హౌట్, స్ట్రక్చర్డ్ కోర్సెట్ డిజైన్ కలిసి ఈ లుక్‌ను మరింత స్టైలిష్‌గా మార్చాయి. ఈ ఫోటోల్లో ఆమె ప్రతి ఫ్రేమ్‌ను తన స్టైల్‌తో పూర్తిగా ఆక్రమించింది. ఒక ఫోటోలో డ్రీమీ, ఎలిగెంట్ లుక్‌లో కనిపిస్తే, మరో షాట్‌లో పూర్తి కాన్ఫిడెన్స్‌తో బోల్డ్ పోజ్ ఇచ్చింది. వేవీ హెయిర్, ఎక్స్‌ప్రెషన్స్‌తో రెండు విభిన్న వైబ్స్ చూపించినా, ప్రతి లుక్‌లోనూ ఆకర్షణ తగ్గలేదు. యాక్సెసరీస్ కూడా ఈ లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. లేయర్డ్ గోల్డ్ నెక్లేస్‌లు, చంకీ హూప్ ఇయర్‌రింగ్స్, గోల్డ్ బ్రేస్‌లెట్, న్యూడ్ స్లైడ్స్‌తో ఆమె స్టైలింగ్‌ను పూర్తిచేసింది. సింపుల్ పింక్ షేడ్‌కే కొత్త కాన్ఫిడెన్స్ ఇచ్చిన రాశి సింగ్, మరోసారి తన ఫ్యాషన్ సెన్స్‌తో అభిమానులను ఆకట్టుకుంది.




## AK47.. స్టేషన్‌లో హై వోల్టేజ్ యాక్షన్

ముద్ర, సినిమా డెస్క్: స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్ హీరోగా రూపొందుతున్న 'ఆదర్శ కుటుంబం ఏకే 47' సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. 'గుంటూరు కారం' తర్వాత త్రివిక్రమ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంపై అభిమానుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కీలక యాక్షన్ సన్నివేశాన్ని హైదరాబాద్‌లోని మలక్‌పేట్ మెట్రో స్టేషన్‌లో చిత్రీకరించినట్లు సమాచారం. రైల్వే స్టేషన్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కించిన ఈ హై వోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్ సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలవనుందని టాక్ వినిపిస్తోంది. త్రివిక్రమ్ తన ప్రత్యేక శైలిలో ఈ సన్నివేశాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. కామెడీ, యాక్షన్ మేళవింపుతో రూపొందుతున్న ఈ చిత్రంలో వెంకటేష్ కొత్త లుక్‌లో కనిపించనున్నారని సమాచారం. మొదట సంగీత దర్శకుడిగా హర్షవర్ధన్ రామేశ్వర్‌ను ఎంపిక చేసినప్పటికీ, ప్రస్తుతం ఎస్.ఎస్. తమన్ సంగీతాన్ని అందిస్తున్నట్లు తెలుస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగ వంశీ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది అక్టోబర్ లేదా దసరా కానుకగా విడుదలయ్యే అవకాశం ఉందని సమాచారం.





## త్రిష పోస్టుతో మళ్లీ చర్చలో విజయ్

ముద్ర, సినిమా డెస్క్: దక్షిణాది సినీ పరిశ్రమలో ఎప్పుడూ వార్తల్లో ఉండే త్రిష, దళపతి విజయ్‌ల అనుబంధం మరోసారి సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. గతంలో వీరిద్దరూ కలిసి కనిపించిన సందర్భాలు, వాటికి సంబంధించిన ఫోటోలు వైరల్ కావడంతో అనేక రకాల ప్రచారాలు వెలువడ్డాయి. అయితే ఈ విషయాలపై ఇద్దరూ ఎప్పుడూ స్పందించలేదు. ఇటీవల తమిళనాడులో జరిగిన ఎన్నికల్లో త్రిష తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం తన వేలిపై సిరా గుర్తును చూపిస్తూ ఒక ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. సాధారణంగా సెలబ్రిటీలు ఓటింగ్‌పై అవగాహన కల్పించే పోస్టులు పెడతారు. కానీ త్రిష తన పోస్ట్‌కు జత చేసిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఇప్పుడు ప్రత్యేక చర్చకు కారణమైంది. విజయ్‌తో కలిసి నటించిన 'గిల్లి' సినిమాలోని ప్రసిద్ధ గీతాన్ని ఆమె ఆ పోస్ట్‌కు ఉపయోగించడం అభిమానుల్లో ఆసక్తి రేపింది. ముఖ్యంగా ఆ పాట ఎంపిక వెనుక ఉన్న అర్థాలపై నెటిజన్లు విశ్లేషణలు చేస్తున్నారు. కొందరు దీన్ని విజయ్‌కు పరోక్ష మద్దతుగా భావిస్తుండగా, మరికొందరు ఇది కేవలం యాదృచ్ఛికమేనని అంటున్నారు. ఇప్పటికే వీరిద్దరి మధ్య అనుబంధంపై వస్తున్న వార్తలకు ఈ పోస్టు మరింత ఊతమిచ్చింది. విజయ్ రాజకీయాల్లో కీలకంగా అడుగులు వేస్తున్న సమయంలో త్రిష చేసిన ఈ చర్య సినీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.




## టికెట్ ధరలు తగ్గించిన 'డెకాయిట్'

ముద్ర, సినిమా డెస్క్: అడవి శేష్ హీరోగా, మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా తెరకెక్కిన 'డెకాయిట్' చిత్రం విడుదలైన తర్వాత మోస్తరు స్పందనతో బాక్సాఫీస్ వద్ద కొనసాగుతోంది. ఇదే సమయంలో ప్రేక్షకులను థియేటర్లకు మరింత ఆకర్షించేందుకు చిత్ర బృందం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా టికెట్ ధరలను గణనీయంగా తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. రేపటి నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కొత్త టికెట్ రేట్లు అమల్లోకి రానున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ ధరలను రూ.105, రూ.70గా నిర్ణయించగా, తెలంగాణలో రూ.105, రూ.80, రూ.50గా ఫిక్స్ చేశారు. మల్టీప్లెక్స్‌లలో మాత్రం టికెట్ ధరను రూ.150గా ఉంచినట్లు వెల్లడించారు. ఇటీవల కాలంలో పెరిగిన టికెట్ ధరలు ప్రేక్షకుల రాకపై ప్రభావం చూపుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తగ్గించిన ధరలతో ప్రేక్షకుల సంఖ్య పెరిగి, సినిమా కలెక్షన్లపై సానుకూల ప్రభావం చూపుతుందా అనే అంశం ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రానికి షానీల్ డియో దర్శకత్వం వహించగా, సుప్రియా యార్లగడ్డ, సునీల్ నారంగ్ నిర్మాతలుగా వ్యవహరించారు.




Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com